ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
21-5-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 110 పేజీలు: 16 వెల: 6.50

**మోడీ, అమిత్‌షా దేశద్రోహులు: రాహుల్**

**వచ్చే నెల ఫ్రాన్స్‌లో జి-7 శిఖరాగ్ర సదస్సు**

5లో

# కడపలో భారీ విద్యుత్ ప్రాజెక్టు



## • అదానీ హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ • పునరుత్పాదన ఇంధన స్థిరత్వాన్నిచ్చే ప్రాజెక్టు • ఆర్ఐఎల్ భారీ పెట్టుబడికి ప్రభుత్వం ఆమోదం

**విజయవాడ, మే20, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఇంధన ప్రాజెక్టు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. వైఎస్ఆర్ కడప జిల్లాలో 2,250 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును (పిఎస్పీ) అభివృద్ధి చేసేందుకు అదానీ గ్రీన్ ఎనర్జీ అనుబంధ సంస్థ అయిన అదానీ హైడ్రో ఎనర్జీ ఎలెవెన్ లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపిబి) సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. 'గండికోట2' పేరుతో వైఎస్ఆర్ కడప జిల్లాలోని లార్డ్ బాలాజీ దొంతికోన పిఎస్పీ పార్కులో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోనే అతిపెద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో పెరుగుతున్న గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, డేటా సెంటర్ల వంటి అధునాతన పరిశ్రమలకు అవసరమైన నిరంతరాయ విద్యుత్‌ను అందించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుంది. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు పునరుత్పాదక ఇంధన వ్యవస్థలకు వెన్నెముకగా నిలుస్తాయి. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్నప్పుడు ఆ మిగులు విద్యుత్‌తో నీటిని పైకి పంపింగ్ చేసి, డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో ఆ నీటిని కిందకు వదిలి టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. దీనివల్ల 24 గంటలూ నిరంతరాయంగా స్వచ్ఛమైన విద్యుత్‌ను అందించడం సాధ్యమవు తుంది. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే ఉన్న గండికోట జలాశయం నుంచి ఒకేసారి నింపడానికి 29.20 ఎంసిఎం నీటిని, ఏటా ఆవిరి నష్టాల కోసం 2.20 ఎంసిఎం నీటిని కేటాయించడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024' కింద ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ఈ పాలసీ ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టును 72 నెలల్లో (6 ఏళ్లు) పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతుల ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని ప్రభుత్వం ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది.

**రిలయన్స్‌కు గ్రీన్ సిగ్నల్**

ఆంధ్రప్రదేశ్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ భారీ పెట్టుబడికి కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు విజయనగరం జిల్లా పోలిపల్లి, భోగాపురం పరిధిలో 853.97 ఎకరాల భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సెంటర్‌కు భారీగా ప్రోత్సాహకాలు ప్రకటించిన ఎపి ప్రభుత్వం.. వాటికి సంబంధించి తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. విజయనగరం జిల్లాలో గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆర్ఐఎల్ ముందుకొచ్చింది. రూ.1,08,010 కోట్ల భారీ అంచనా వ్యయంతో డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్ఐఎల్ ప్రతిపాదనలు చేసింది. దీనికి, అనుమతులు ఇచ్చిన >>2



# మండిపోతోంది..

## పిడుగురాళ్లలో 47.6° ఉష్ణోగ్రత

### పగలు, రాత్రి వేడిగాలులే, 11 జిల్లాల్లో తీవ్రత అధికం

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండ ఉదృతి ఎక్కువుతుంది. వెచ్చటి గాలులు వీస్తున్నాయి.జనం వేసవి తాపానికి తట్టుకోలేని పరిస్థితి,.ఈ వేసవి సీజన్లోనే గరిష్ఠ ఉష్ణోగ్రత ఇవాళ పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. 11 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు దాటినట్లు తెలిపారు. రానున్న నాలుగురోజులు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకో వాలని సూచించారు.ఇవాళ రాష్ట్రంలోని 28 జిల్లాలకుగాను, 18 జిల్లాల పరిధిలోని 204 మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు... ఇందులో ముఖ్యంగా పల్నాడు జిల్లాలో 23, కృష్ణాలో 21, ప్రకాశంలో 20, ఏలూరులో 20, బాపట్లలో 17, నెల్లూరులో 16, ఎన్టీఆర్ లో 15, గుంటూరులో 15, మార్కాపురం జిల్లాలోని 12 మండలాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా చూపిందని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 46.1డిగ్రీలు, పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 46 డిగ్రీలు, బాపట్ల జిల్లా కొల్లూరు, ఎన్టీఆర్‌జిల్లా తొర్రగుడిపాడులో 45.9 డిగ్రీలు, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో >>2

# ప్రపంచ శాంతికి గమ్యం

## • సనాతన ధర్మానికి, ఆధునిక ప్రపంచానికి వారధి 'ఆర్ట్ ఆఫ్ లివింగ్': సిఎం చంద్రబాబు • దేశానికి ఐటి మ్యాన్‌గా చంద్రబాబు: రవిశంకర్ గురూజీ



బుధవారం బెంగళూరులో రవిశంకర్ గురూజీతో సిఎం చంద్రబాబు భేటీ దృశ్యం

**విజయవాడ, మే 20, ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన ధర్మానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ పనిచేస్తోందని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మానసిక ఒత్తిడిలేని సమాజం ప్రపంచ శాంతి గమ్యంగా ఆ సంస్థ నాలుగు దశాబ్దాలుగా సేవలు అందిస్తోందని అన్నారు. బెంగుళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45వ వార్షికోత్సవానికి సిఎం హాజరయ్యారు. రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవాన్ని సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా మానవాళి శ్రేయస్సు, శాంతి సౌఖ్యాలకోసం పనిచేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నాననిఅన్నారు. రవిశంకర్ గురూజీ కేవలం ఆధ్యాత్మిక బోధనలతో పాటు శాంతి సామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హింస లేని సమాజం, ఒత్తిడి లేని మనుషులు అనే లక్ష్యాన్ని సాధించాలని ఆయన దశాబ్దాలుగా మానవాళికి గొప్ప సేవ చేస్తున్నారని అన్నారు. యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని అనిశ్చితి నుంచి బయట పడేసేలా మానవత్వమే అత్యుత్తమ మార్గంగా ఆయన ఎంచుకున్నారని అన్నారు. ట్రాన్స్‌ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ వంటి విధానాల ద్వారా గ్రామాల నుంచి అంతర్జాతీయ సంస్థల వరకూ, కొలంబియా వంటి సంఘర్షణ ప్రాంతాల వరకూ చర్చల మార్గంలో మార్పులు తెచ్చారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మిక వేత్తగా శ్రీరవిశంకర్ గురూజీ నిలిచారన్నారు.

**ఎపిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సేవలు.**

45 ఏళ్ల క్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్, స్ట్రెస్ ఫ్రీ సొసైటీ, బెటర్ వరల్డ్ అనే విజన్‌తో ప్రారంభమైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అభినందించారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజువనేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య వంటి రంగాల్లో ఈ సంస్థ అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలు రోజువారీ జీవితంలో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని.. భౌగోళిక రాజకీయ పరిస్థితులు సామాన్య ప్రజల జీవితాలను కూడా తీవ్ర ఒడిదుడుకులకు గురి చేస్తున్నాయని తెలిపారు. గ్యాస్, ఇంధనంవంటివనరుల లభ్యత ప్రజలను >>2



# మాట నిలబెట్టాం

## ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా మత్స్యకార సాయం రెండో యేడాది కూడా ఇచ్చాం: డి.సిఎం పవన్

**విజయవాడ,మే 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని డిప్యూటీ సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. మత్సకారులకు వేట నిషేధ సమయంలో అండగా నిలుస్తామని వాగ్దానం చేసామన్నారు.ఆ మేరకు కూటమి ప్రభుత్వం వరుసగా రెండో యేడాది కూడా వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక భృతిని విడుదల చేసిందని తెలిపారు.బుధవారం ఉపముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో మత్స్యకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మత్స్యకారుల సేవలో పథకం కింద అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే ఇవ్వగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రెట్టింపు చేసి ఇస్తుంది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరనుంది. ఈ పథకం కోసం ప్రభుత్వం మొత్తం రూ.262 కోట్లు వ్యయం చేస్తోంది. కాకినాడ జిల్లాలో 24,930 మంది లబ్ధిదారులకు రూ.49.86 కోట్ల మేర, పిఠాపురం నియోజకవర్గంలో 6,897 మంది లబ్ధిదారులకు రూ.13.79 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు.

**మత్స్యకారుల వలసలు తగ్గించే దిశగా అడుగులు..**

కాకినాడ జిల్లాలోని 119 కిలోమీటర్ల కోస్తా తీరం పరిధిలో ఉన్న 23 ల్యాండింగ్ సెంటర్లు, 51 మత్స్యకార గ్రామాల ప్రజలకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నో పథకాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి అన్నారు.4,578 బోట్లకుగాను 91.48 లక్షల లీటర్ల డీజిల్‌పై ప్రభుత్వం రూ.8.23 కోట్ల రూపాయల సబ్సిడీని అందించింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, డిఆర్డీఏ సహకారంతో ఇంజన్లు, వలలు, బోట్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల కొనుగోలుకు రూ.1.13 కోట్ల రూపాయల సబ్సిడీ అందించింది. కోనపాపపేట గ్రామంలో మత్స్యకారుల కోసం రూ.2కోట్ల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నాం. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల రక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా 100శాతం సబ్సిడీపై ట్రాన్స్‌పాండర్స్ ఇస్తోంది. ఇవి తుపానులు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడతాయి. సముద్రంలో జీవవైవిధ్యాన్ని, చేపల సంఖ్యను పెంచడానికి జిల్లాలో 20 స్థలాలను ఎంపిక చేశారు. ఒక్కో చోట రూ. 20 లక్షల వ్యయంతో ఆర్టిఫిషియల్ రీఫ్స్ ఏర్పాటు చేస్తున్నాం. సముద్ర తాబేళ్లను రక్షించేందుకు వీలుగా అన్ని ట్రాలింగ్ బోట్లకు ఉచితంగా టెడ్ పరికరాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు.



# ఎరువుల అక్రమాలపై కొరడా

## డీలర్ల లైసెన్స్‌లు రద్దుచేసి క్రిమినల్ కేసులు పెడతాం
## స్టాక్‌పై రోజువారీ మానిటరింగ్: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, మే 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎరువుల అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులను అక్రమంగా పక్కదారి పట్టించడం సహించరాని అంశమన్నారు. వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడంపై మంత్రి అసహనం వ్యక్తంచేసారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, ఇతర ప్రాంతాలకు తరలింపు వంటి వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యవహరిస్తుందన్నారు.ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. రైతులకు సరైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందకుండా కొరత సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం, పరిశ్రమలకు మళ్లించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే డీలర్లు, మధ్యవర్తులు, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా >>2

## మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, మే 20,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ పొడిగించారు. నిందితుడు ప్రణయ్ ప్రకాశ్‌ను విజయవాడ సీబీఐ కోర్టులో అధికారులు హాజరుపరిచారు. విచారణకు బెయిల్‌పైఉన్న ఐదుగురు నిందితులు హాజరయ్యారు. నిందితులరిమాండ్‌ను జూన్ మూడో తేదీకి పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. ఈకేసులో ప్రణయ్‌ప్రకాశ్ మినహా మిగతా నిందితులు బెయిల్‌పై ఉన్నారు విచారణకు కృష్ణమోహన్‌రెడ్డి, నవీన్ కృష్ణ, బాలాజీకుమార్, వెంకటేశ్‌లు హాజరయ్యారు. దీనికి సంబంధించి రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, మిథున్‌రెడ్డి, అనిల్‌లు అబ్సెంట్ పిటిషన్ వేసారు.

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర



బుధవారం సచివాలయంలో డిఇఒలు, ఎపిసిలతో జరిగిన సమావేశంలో మంత్రి లోకేష్

## నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్‌పై దృష్టి సారించాలి
## ప్రభుత్వ స్కూళ్లలో కనీస సౌకర్యాలకు స్టార్ రేటింగ్
## డిఇఒలు, ఎపిసిలతో సమావేశంలో మంత్రి లోకేష్

**విజయవాడ,మే 20, ప్రభాతవార్తప్రతినిధి:** దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ అన్నారు. అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనాపద్ధతులను రాష్ట్రంలో అమలు >>2



బుధవారం రోమ్‌లో 'అగ్రికోలా మెడల్ 2026'ను ప్రధాని మోడీకి బహూకరిస్తున్న ఎఫ్ఎఒ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ క్యూ డాంగ్యూ

# ప్రధాని మోడీకి ఇటలీలో అరుదైన గౌరవం

## ఎఫ్ఎఒ ప్రతిష్టాత్మక 'అగ్రికోలా మెడల్ 2026' ప్రదానం
## రైతులకు అంకితం చేసిన ప్రధాని

**రోమ్, మే 20:** ప్రధాని మోడీకి ఇటలీ పర్యటనలో అరుదైన గౌరవం దక్కింది. మోడీకి ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎవో) అత్యున్నత గౌరవమైన "అగ్రికోలా మెడల్ 2026"తో సత్కరించింది. ఇటలీ రాజధాని రోమ్‌లోని ఎఫ్ఎవో ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ >>2

# కులగణన సమంజసమే

## వ్యతిరేకించిన పిల్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
## ప్రజలను గుర్తించే హక్కు ప్రభుత్వానికి ఉన్నదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, మే 20:** జనాభా లెక్కలలో కుల గణనను తొలగించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)ను సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. జాతీయ జనాభా గణనలో భాగంగా ప్రస్తుత ప్రభుత్వం కుల గణనను చేపట్టడంలో, నిర్ధారించడంలో ఎలాంటి తప్పు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. "ఏ ప్రభుత్వమైనా ఎంతమంది వెనుకబడిన వారు ఉన్నారో, ఎంతమందికి సంక్షేమ పథకాలు అవసరమో తెలుసుకోవాలి. ఇది ఒక విధానపరమైన అంశం" అని త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహించిన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. "జనాభా లెక్కలు కుల ఆధారితంగా ఉండాలా వద్దా అనేది ఒక విధానపరమైన నిర్ణయం. ఎంతమంది వెనుకబడిన తరగతికి చెందినవారు ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాలి" అని సిజెఐ వ్యాఖ్యానించారు. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని, ఇందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం >>2

# మూతపడిన మెడికల్ షాపులు

## పలు జిల్లాల్లో ర్యాలీలు, కలెక్టర్లకు మెమొరాండాలు




**విజయవాడ, మే20, ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా బుధవారం మందుల దుకాణాలను బంద్ చేసారు. ప్రభుత్వం కరోనా సమయంలో అమల్లోకి తీసుకువచ్చిన జిఎస్ఆర్ టి20 యాక్ట్ రద్దు చేయాలని కోరుతూ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియే షన్ దేశవ్యాప్తపిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహించారు. బుధవారం ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ అసోసియేషన్ పిలుపుమేరకు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టంలో ప్రతిపాదించిన సవరణలను వ్యతిరేకిస్తూ ఎపి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపులో భాగంగా మెడికల్ షాప్ యజమానులు బంద్ నిర్వహించారు. పలు జిల్లాలో ర్యాలీలు నిర్వహించి, జిల్లా కలెక్టర్లకు మెమొరండం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ మందుల విక్రయాలను నియంత్రించాలని, చిన్న మెడికల్ షాపుల మనుగడకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఔషధ రంగంలో అమలవుతున్న కొన్ని విధానాలవల్ల చిన్నవ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు >>2

# బాపట్ల యువకుడు అమెరికాలో దుర్మరణం

## ప్రమాదంలో అతడి తల్లిదండ్రులు, తమ్ముడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

**బాపట్ల,మే 20, ప్రభాతవార్తా ప్రతినిధి:** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాపట్ల పట్టణానికి చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందగా, అతని తల్లిదండ్రులు, తమ్ముడు తీవ్ర గాయాలపాలైన ఘటన పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది. బాపట్ల పట్టణంలోని 13వ వార్డు యాదవపాలెంకు చెందిన ఆవుల పూర్ణ గోపి అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు.వేసవి సెలవుల సందర్భంగా పూర్ణ గోపి తల్లిదండ్రులు శ్రీనివాసరావు దంపతులు, >>2



బుధవారం కుప్పం సమీపంలో రోడ్డు పక్కన తాటి ముంజలు తింటున్న సిఎం చంద్రబాబు దంపతులు

# రోడ్డుపై ఆగి తాటి ముంజలు తిన్న సిఎం దంపతులు

## కల్లుగీత కార్మికులతో ఆత్మీయ సంభాషణ

**కుప్పం, మే 20 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు దంపతులు కుప్పం పర్యటనలో భాగంగా రోడ్డుపై ఆగి తాటి ముంజలు తిని కల్లుగీత కార్మికులను ఆశ్చర్యంలో ముంచెత్తిన సంఘటన బుధవారం కుప్పంలో చోటు చేసుకుంది. సిఎం చంద్రబాబు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి కుప్పంలో జరుగుతున్న శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శివపురం వద్ద ఉన్న తమ స్వగృహంకు కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో తంజం కొటాలు గ్రామం వద్ద రోడ్డుపై కల్లుగీత కార్మికులు తాటి ముంజలు విక్రయిస్తుండగా సిఎం చంద్రబాబు తన కాన్వాయ్‌ను రోడ్డు పక్కన ఆపించేశారు. అనంతరం సిఎం దంపతులు కార్మికుల వద్దకువెళ్లి తాటి ముంజలు తీసిఇవ్వండి రుచి చూస్తాం అని అడిగారు. దీంతో కార్మికులు తాటి ముంజలు సిఎం దంపతులకు అందించారు. ఈసందర్భంగా వారితో సిఎం చంద్రబాబు కాసేపు ఆత్మీయంగా సంభాషించారు. వారి ఆదాయం, కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికులకు సిఎం చంద్రబాబు స్వయంగా నగదు ఇచ్చారు. అనంతరం తమ స్వగృహంకు బయల్దేరారు. సిఎం దంపతులు కారు ఆపి తమ వద్ద తాటి ముంజలు కొని ఆప్యాయంగా పలకరించడంతో వారు ఆనంద భరితులయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు. కాగా కల్తీలేదు, కార్బైడ్‌లేదు, పురుగుమందుల గోల లేదు, మా కుప్పం ప్రజల మనస్సుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటిముంజలు రోడ్డు పక్కన ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది. మన గ్రామీణ ఆహార ఉత్పత్తులను మించింది ఏముంటుందని సిఎం చంద్రబాబు నాయుడు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.



బుధవారం కుప్పంలోని శ్రీ తిరుపతి గంగమ్మతల్లి జాతరకు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సిఎం చంద్రబాబు దంపతులు

# కులగణన సమంజసమే

>> పేర్కొంది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ, 2027 జనాభా గణన నుండి కుల సమాచార సేకరణను తొలగించాలని కోరుతూ దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీం కోర్టు కొట్టివేసింది. పిటిషనర్‌గా స్వయంగా హాజరైన సుధాకర్ గుమ్ముల, 2027 జనాభా లెక్కలలో కుల గణనను చేర్చవద్దని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. "రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థలు కుల సమాచారాన్ని దుర్వినియోగం చేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. కులంపై ఇంత పెద్ద మొత్తంలో సమాచారాన్ని సేకరించడానికి ఎటువంటి సమర్థన లేదు. ఈ అంశం పూర్తిగా విధాన పరిధిలోకి వస్తుంది" అని వాదించారు.

గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఒక సమావేశంలో, రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ 2027 జనాభా లెక్కలలో కుల గణనను చేర్చాలని నిర్ణయించింది. అప్పటి నుండి 2027 జనాభా లెక్కలలో కుల గణన ఒక ముఖ్యమైన అంశంగా మారింది. 2011 జనాభా గణనకు ముందు, కేవలం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలను మాత్రమే క్రమపద్ధతిలో లెక్కించేవారు. 2027 జనాభా గణన రెండవ దశలో కులాల గణనను చేర్చనున్నట్లు పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటించింది.

# ఇటలీలో అరుదైన గౌరవం

>> జనరల్ డాక్టర్ క్యూ డాంగ్యూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రధాని మోడీకి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ క్యూ డాంగ్యూ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం మోడీ చేసిన కృషికి గుర్తింపుగానే ఈ అవార్డును అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, ఆహార భద్రత బలోపేతం, రైతుల సంక్షేమం కోసం మోడీ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను ప్రశంసించారు. అలాగే ఆకలి, పేదరిక నిర్మూలన, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత సాధనలో ఎఫ్ఎవో లక్ష్యాలకు భారత్ అందిస్తున్న మద్దతును కొనియాడారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో మోడీ చేస్తున్న కృషిని కూడా ఎఫ్‌యేవో డీజీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా భారత జీ20 అధ్యక్షత్వ కాలంలో వ్యవసాయాన్ని అంతర్జాతీయ అజెండాలో కీలక అంశంగా నిలిపిన విధానాన్ని అభినందించారు. భారత వ్యవసాయ రంగంలో రైతు కేంద్రిత సంస్కరణలు, వినూత్న విధానాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ద్వారా మోడీ చూపిన నాయకత్వాన్ని ప్రశంసించింది. మోడీ నాయకత్వంలో అమలైన భారీ ఆహార భద్రత పథకాలు, కోట్లాది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించడం, సహజ వ్యవసాయం ప్రోత్సాహం, చిరుధాన్యాల ప్రాచుర్యం వంటి కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని పేర్కొంది. అగ్రికోలా పతకం అందుకున్న తర్వాత మోడీమాట్లాడుతూ మా అద్భుతమైన స్వాగతానికి, నాకు అగ్రికోలా పతకంతో గౌరవించి నందుకు ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్‌యేవో) డైరెక్టర్‌కు నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. భారతదేశం పట్ల ఆయన స్నేహపూర్వక మాటలకు, ఆయన చేసిన సంవత్సరాల సేవలకు నేను ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం నాకు మాత్రమే కాకుండా భారతదేశంలోని కోట్లాది మంది రైతులకు, పశుపోషకులకు, మత్స్య పెంపకందారులకు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు, మన కార్మికులకు లభించిన గౌరవం. మానవ సంక్షేమం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధిని కేంద్రంగా చేసుకున్న భారతదేశ నిబద్ధతకు కూడా ఇది ఒక గౌరవం. నేను ఈ పతకాన్ని అత్యంత వినయంతో స్వీకరిస్తూ.. భారతదేశ అన్నదాతకు అంకితం చేస్తున్నానని మోడీ తెలిపారు.

# భారీ విద్యుత్ ప్రాజెక్టు

>> ఏపీ ప్రభుత్వం.. డేటా సెంటర్ కోసం 853.97 ఎకరాల భూమిని తాజాగా కేటాయించింది. ప్రాజెక్టు కోసం సేకరించే భూమి విలువపై రిలయన్స్ సంస్థకు 25 శాతం రాయితీ ఇస్తోంది. అలాగే కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుకు మరో ఎకరం భూమిని ప్రత్యేకంగా కేటాయించింది. డేటా సెంటర్ కోసం విద్యుత్ గ్రిడ్ మౌలిక సదుపాయాలు, 20 ఏళ్ల పాటు నీటి సరఫరా గ్యారెంటీని ప్రభుత్వం కల్పించనుంది. ప్రాజెక్టుకు 100 శాతం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపులు.. మెషినరీపై 6 శాతం క్యాపిటల్ సబ్సిడీ ఇవ్వనుంది. 10 ఏళ్ల పాటు నిర్మాణరంగం, లీజింగ్ ఖర్చులపైనా 100శాతం నెట్ రీయింబర్స్ మెంట్ చేయనుంది. యూనిట్ విద్యుత్‌పై రూ.1 చొప్పున 15 ఏళ్ల పాటు రాయితీ.. నీటి పన్నుపై 10 ఏళ్ల పాటు 15 శాతం సబ్సిడీ ఇవ్వనుంది. రూ.5 వేల కోట్ల పరిమితితో 20 ఏళ్ల పాటు ట్రాన్స్‌మిషన్/వీలింగ్ ఛార్జీల నుంచి 100 శాతం మినహాయింపు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రూల్స్ ప్రకారం ప్రాజెక్టుకు సింగిల్ విండో క్లియరెన్స్ సదుపాయం కల్పిస్తోంది.

# మండిపోతోంది..

>> 45.7 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొండపిలో 45.6 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 45.5 డిగ్రీలు, నెల్లూరు జిల్లా గూడూరులో 45.4 డిగ్రీలు, పోలవరం జిల్లా కూనవరంలో 45 డిగ్రీలు, గుంటూరు జిల్లా పాండ్రపాడులో 44.8, కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో 44.5, అనకాపల్లి(జి) మాకవరపాలెం, తిరుపతి జిల్లా పూలతోటలో 44.4, విశాఖ జిల్లా ములగాడలో 43.6, కాకినాడ జిల్లా కాజులూరులో 43.5, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 43.1 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.





బుధవారం రోమ్‌లో ఇటలీ ప్రధాని మెలొనీకి మెలొడీ చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇస్తున్న ప్రధాని మోడీ

# మెలొనీకి మోడీ 'మెలొడీ' గిఫ్ట్

## రోమ్‌లో కారులో ప్రయాణించిన ఇద్దరు ప్రధాన మంత్రులు

**రోమ్, మే 20:** భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్‌ను నెటిజన్లు సరదాగా మెలోడి అని పిలుస్తుంటారు. దీనిపై సోషల్ మీడియాలో ఎన్నో మీమ్స్ కూడా వచ్చాయి. అయితే ఈ క్రేజ్‌ను మోడీ భలే వాడుకున్నారు. తన ఇటలీ పర్యటనలో భాగంగా మెలోనికి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చి అందరినీ నవ్వించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా రోమ్ చేరుకున్నారు మోడీ. ఈ సందర్భంగా మెలోనిని కలిసిన ఆయన భారత్‌లో ఎంతో పాప్యులర్ అయిన పార్లే మెలోడీ చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇద్దరు నేతల పేర్లను కలిపి ఇంటర్నెట్‌లో నడుస్తున్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని మోడీ ఈ సరదా గిఫ్ట్ ప్లాన్ చేశారు. ఈ చాక్లెట్ ప్యాకెట్‌ను అందుకున్న మెలోని ప్రధాని మోడీతో కలిసి దిగిన ఒక చిన్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. బహుమతికి చాలా థాంక్స్ అని ఆమె రాశారు. మెలోని మాట్లాడుతూ ప్రధాని మోడీ నాకోసం చాలా మంచి టోఫీలు తెచ్చారు అనగానే, పక్కనే ఉన్న మోడీ నవ్వుతూ మెలోడీ అని అన్నారు. నెట్టింట వైరల్ అయిన విడియోకు గంట వ్యవధిలో లక్షకు పైగా లైక్స్, దాదాపు 9వేల కామెంట్స్, 25 వేలకు పైగా షేర్స్ వచ్చాయి. రోమ్ చేరుకున్న మోడీకి మెలోనీ ఘన స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి కార్‌లో ప్రయాణిస్తూ నగర వీధుల్లో సందడి చేశారు. తర్వాత రాత్రి పూట రోమ్‌లోని ప్రసిద్ధ చరిత్రాత్మక కట్టడం కొలోసియంను సందర్శించారు. అక్కడ కాసేపు నడుస్తూ ఇరు దేశాల మధ్య మైత్రిని మరింత బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఈ పర్యటనలో మోడీని ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు జాంపాలో టొమాసెట్టి కలిశారు. ఆయన స్వయంగా గీసిన వారణాసి పెయింటింగ్‌ను మోడీకి బహుమతిగా ఇచ్చారు. టొమాసెట్టికి భారతీయ సంస్కృతిపై ఉన్న ఇష్టాన్ని మోడీ ఎక్స్ వేదికగా అభినందించారు. రోమ్ నగరంలో కాశీ దృశ్యాలను చూడటం ఆనందంగా ఉందంటూ రాసుకొచ్చారు.

# మెలొనీతో కలిసి కోలోస్సియంను సందర్శించిన మోడీ

**రోమ్, మే 20:** ప్రధాని మోడీ యూరోప్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆయన ఇటలీ వెళ్లారు. ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు స్వాగతం పలికారు. రోమ్‌లో ఆ ఇద్దరూ కలిసి కొన్ని ప్రదేశాలకు వెళ్లారు. ప్రత్యేకంగా తన వాహనంలో మోడీని ఆమె తీసుకెళ్లారు. మోడీకి సాదర స్వాగతం లభించింది. మోడీకి వెల్కం చెబుతూ మెలోనీ తన ఎక్స్ అకౌంట్‌లో కొన్ని ఫోటోలు పోస్టు చేశారు. వాటితో పాటు రెండు దేశాలకు చెందిన జాతీయ జెండాలతో కూడిన ఎమోజీలను ఆమె పోస్టు చేశారు. మోడీ, మెలోని రోమ్‌లో ఉన్న కొలోస్సియంను విజిట్‌చేశారు. అతి ప్రాచీనమైన ఆ స్టేడియాన్ని ఫ్లావియన్ ఆంఫీ థియేటర్‌గా పిలుస్తారు. రోమ్ నగరం మధ్యలో ఈ కట్టడం ఉంటుంది. కొలోస్సియం వద్ద మోడీ, మెలోనీ దిగిన ఫోటోకు మిలియన్ల సంఖ్యలో ఫాలో అయ్యారు. 60 వేల లైక్స్ వచ్చాయి. వీరి స్నేహంపై సుమారు రెండు వేల మంది కామెంట్ చేశారు. ఇక మెలోనీతో కలిసి డిన్నర్ చేసిన ఫోటోలను మోడీ పోస్టు చేశారు. అనేక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించామన్నారు. ఇవాళ జరిగే చర్చలకోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఇండియా, ఇటలీ మధ్య బంధాన్ని ఎలా బలోపేతం చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

# మూతపడిన మెడికల్ షాపులు

>> న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా నాణ్యమైన మందుల విక్రయాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కోవిడ్ సమయంలో విధించిన యాక్టును రద్దు చేయకపోవడంతో అది ఆన్లైన్ విధానం కొనసాగుతూ ఉండడంవల్ల యువత ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అదేవిధంగా ఆన్లైన్ మందులు కొనుగోలు విధానం వలన ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అధిక డిస్కౌంట్ ఆశపడి ఆన్లైన్ విధానంలో మెడికల్ ఆర్డర్ ఇవ్వడం వలన మందులు మారిపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో ప్రజలకు డాక్టర్లు ఇచ్చే మందులు ఇవి ఒకటే అనుకుని వాడి ప్రాణాలపైకే తెచ్చుకుంటు న్నారన్నారు. అధిక డిస్కౌంట్‌కు మోసపోవద్దన్నారు. రాష్ట్రంలో 10 లక్షల మంది చిరు వ్యాపారుల కష్టాల్లోకి నెట్టే కార్పొరేట్ సెక్టార్ మెడికల్ పెత్తనం సాగుతుందన్నారు. ఇక షాపులను బంద్ చేసిన అత్యవరసర వైద్య చికిత్సలకు అవసరమైన మందులను మాత్రం రోగులకు ఇబ్బంది లేకుండా మందుల దుకాణాల వారు ఏర్పాట్లు చేసారు.

# 'ఆంధ్రకేసరి'కి సిఎం చంద్రబాబు నివాళులు

**విజయవాడ, మే20, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా సిఎం చంద్రబాబు నివాళులర్పించారు. తెలుగువారి ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి ప్రతీక ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని చంద్రబాబు కొనియాడారు. అచంచల దేశభక్తి, నిజాయితీ, నిబద్ధతలతో ప్రజల కోసమే జీవించిన మహనీయుడన్నారు. ఆ మహోన్నత నాయకుడి సేవలను స్మరించుకుందామని చంద్రబాబు ఆకాంక్షించారు.

**ఆంధ్రకేసరికి, మంత్రి నారా లోకేశ్ నివాళి**

దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని లోకేశ్ అన్నారు. ధైర్య సాహసాలు, ప్రజాసేవ, దేశభక్తికి ఆయన ప్రతీకగా నిలిచారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన తెగువ, పౌరుషం యువతకు ఆదర్శం కావాలన్నారు.

# ప్రపంచ శాంతికి గమ్యం

>> ఒత్తిడికి గురి చేస్తోందని.. ఈ నేపథ్యంలో ఒత్తిడిని ఎదుర్కొని సమర్థంగా జీవించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని ఆయన కోరారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసిన నేల ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం వంటి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను కలిగి ఉందని.. ఈ ఆధ్యాత్మికతను మరింత విస్తృతం చేసేలా అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. మరోవైపు దేశానికి ఐటీ మ్యాన్‌గా చంద్రబాబు సేవలకు కొలమానం లేదని.. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఐటీ నిపుణులుగా తెలుగు ప్రజలు కనిపిస్తారని అన్నారు. హైదరాబాద్ ను ప్రపంచ ఐటీ మేటి నగరంగా ఎదగటంలో సిఎం చంద్రబాబు పాత్ర కీలకమని శ్రీరవిశంకర్ గురూజీ వ్యాఖ్యానించారు. అనంతరం శ్రీరవిశంకర్ గురూజీ ఆధ్వర్యంలో కొద్దిసేపు ధ్యాన ప్రక్రియలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గోవా సిఎం ప్రమోద్ సావంత్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల మంత్రులు, మాజీ కేంద్ర మంత్రి సురేష్ ప్రభు తదితరులు హాజరయ్యారు.

# ఎరువుల అక్రమాలపై కొరడా

>> ఎరువుల డీలర్లు, గోదాములు, రవాణా కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీకి మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్, అనధికార విక్రయాలు, పరిశ్రమలకు, ఇతర అవసరాలకు ఎరువుల మళ్లింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. 2026-27 సంవత్సరంలో మే 4వ తేదీ నుండి ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అమలు విభాగం చేపట్టిన కఠినచర్యలను మంత్రి వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల డీలర్లకు 182 షోకాజ్ నోటీసులు జారీ చేశారు, 80 ఎరువుల లైసెన్సులను సస్పెండ్ చేశారు, 1 ఎరువుల లైసెన్సును రద్దు చేశారు,

రూ.707 లక్షల విలువైన 3372 మెట్రిక్ టన్నుల ఎరువులను నిర్బంధించారు, రూ.5 లక్షల విలువైన 2 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, రైతులకు అందకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరిం చారు. ఎరువులను పక్కదారి పట్టించినట్లు రుజువైతే సంబంధిత డీలర్ల లైసెన్సులు వెంటనే రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర

>> చేస్తామని పేర్కొన్నారు. సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డిఇఒలు, ఎపిసిలతో (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి లోకేష్‌మాట్లాడుతూ... క్వాలిటీ మెరుగు పర్చకపోతే నష్టపోయేది పిల్లలు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్‌తో పోటీపడాలి. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేశాం. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ నా లక్ష్యం, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు.

**బిడ్డల భవిష్యత్తు కేంద్రంగా నిర్ణయాలు**

ఈ సమావేశం కేవలం సమీక్ష కోసం కాదు, యాక్షన్ ప్లాన్ కోసం ఏర్పాటు చేశాం. నేను విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఏ పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారో రాష్ట్రస్థాయి విజిబిలిటీ, కనీస డేటా అందుబాటులో లేదు. పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేసినప్పుడే నేను కేవలం మూడునెలల్లో పూర్తిస్థాయి సమాచారంతో డ్యాష్ బోర్డు తయారుచేశాం. విద్యాశాఖలో కనీస డేటా బేస్ అందుబాటులో లేని పరిస్థితి నుంచి విద్యాశాఖలో నా ప్రయాణం ప్రారంభించాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేపిల్లలు మన సొంత బిడ్డల్లా భావించి నిర్ణయాలు తీసుకోవాలి. మనం తీసుకునే నిర్ణయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది పిల్లలు డ్రాపవుట్స్‌గా ఉన్నారు. నెవర్ ఎన్ రోల్డ్ పై కూడా ఫోకస్ చేయాలి. నూరుశాతం ఎన్ రోల్ మెంట్ పై అధికారులంతా దృష్టిపెట్టాలి అన్నారు.

**ఉద్యమంలా జిఎఫ్ఎల్ఎన్ చేపట్టాలి..**

లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్‌ను ఒక ఉద్యమంగా అమలు చేయాలి. వాస్తవాలు తెలుసుకున్నపుడే సరైన నిర్ణయాలు తీసుకోగలం. నిజం చేదుగా, అబద్ధంగా తీయగా ఉంటుంది. వాస్తవాన్ని అంగీకరిస్తేనే మన ప్రయాణం సరైన దిశగా సాగుతుంది. మేం సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే మీరు సరైన సమాచారం ఇవ్వాలి. ప్రస్తుతం 9వ తరగతికి క్లిక్కర్ టెక్నాలజీ అమలు చేస్తున్నాం, క్రోమ్ బుక్స్ అందించబో తున్నాం. నూరుశాతం జిఎఫ్ఎల్ఎన్ సాధనే లక్ష్యంగా పనిచేయాలి. 5శాతం వెనుకబడటం అంటే సాధారణమైంది కాదు. వాస్తవంలో అది లక్షల సంఖ్యలో ఉంటుంది. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 10శాతం ఎన్ రోల్ మెంట్ ఇంప్రూవ్ చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకోసం సమిష్టిగా పనిచేయాలి.

**ఇంటర్నేషనల్ స్కూలుగా నిడమర్రు పాఠశాల..**

మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు స్కూలును ఇంటర్నేషనల్ స్కూలుగా తీర్చిదిద్దుతున్నాం. అక్కడతొలిసారి నోఅడ్మిషన్ బోర్డుపెట్టారు. నెల్లూరులో కూడా రెండు స్కూల్స్‌ను మంత్రి నారాయణ అభివృద్ధి చేస్తున్నారు. ప్రతి జిల్లాలో ఒక పాఠశాలను మోడల్ స్కూలుగా తీర్చిదిద్దాలని అధికారులను కోరుతున్నా. నిడమర్రులో మేం కల్పించిన అత్యుత్తమ సౌకర్యాలవల్ల పక్క నియోజకవర్గాల వారు మా నియోజకవర్గానికి తమ బిడ్డల అడ్మిషన్ కోసం నివాసం మార్చుకుంటు న్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇదే పరిస్థితి కల్పించే లక్ష్యంతో పనిచేయాలన్నారు.

## వారం - వర్జ్యం

21-05-2026, అధికజ్యేష్ఠ గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
పంచమి ఉ.8.29
పుష్యమి రా.2.51
వర్జ్యం : ఉ.11.46-మ.1.16
దు.ఉ.9.54-ఉ.10.46, మ.3.06-3.58
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** దీర్ఘకాలిక సమస్యలకు తగిన చర్యలు తీసుకుంటారు. ఇందువల్ల కుటుంబంలో విభేదాలు వస్తాయి.

**వృషభం:** నూతన పురోగతి బాగుంటుంది. వాళ్ళకు మంచి అవకాశాలు వస్తాయి. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**మిథునం:** జీవిత భాగస్వామి, స్త్రీల ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. విదేశాల నుండి అరుదైన ఆహ్వానాలు.

**కర్కాటకం:** ప్రైవేటు వ్యక్తుల నుండి ఆర్థిక పరమైన ఒత్తిడి రావచ్చు. రాజకీయ యత్నాలు, చర్చలు ఫలిస్తాయి.

**సింహం:** మీరు అమితంగా ప్రేమించే వ్యక్తులు కీలక సమయంలో ఆదుకుంటారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. వస్త్రలాభం.

**కన్య :** అభివృద్ధి పథానికి మరొక మెట్టును మీరు నిర్మించుకోగలుగుతారు. సామాజిక కార్య క్రమాలలో పాల్గొంటారు. వాహన సౌఖ్యం.

**తుల:** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. పోటీపరీక్షలలో విజయం వల్ల ఇంట్లో ఆనందం కలుగుతుంది.

**వృశ్చికం:** అమ్మకాలలో తగిన రేటు రాకపోవచ్చు. అయినా లాభాలకు ఇబ్బంది లేదు. కొత్త పరిచయాలు కలుగుతాయి.

**ధనుస్సు:** అనుకోని ఆదాయం వచ్చే మార్గాలు అందుకు సంబంధించిన వ్యక్తులు అనుకూలం అవుతారు. వ్యాపారం అభివృద్ధి.

**మకరం:** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైలు మీద అధికార ఆమోద ముద్రలు పడ తాయి. ఊహించని ఈ పరిణామం సంతోషం కలిగిస్తాయి.

**కుంభం:** స్థాయి లేని వ్యక్తులకు సారధ్యం చేయాల్సి వస్తుంది. వాళ్ళ సలహాలు సంప్రదింపులు నిత్యం అవసరమవుతాయి.

**మీనం:** విలువైన వస్త్ర సామాగ్రి కొనుగోలు చేస్తారు. రాజకీయ పరంగా జరిగే మార్పులు కొంత ఊరట కలిగిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో సాక్షులను విచారించిన న్యాయమూర్తి

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, మే 20( ప్రభాతవార్త):** ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను రాజమహేంద్రవరం కోర్టులో న్యాయమూర్తి విచారించారు. ప్రధాన సాక్షులైన సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు కోర్టుకు హాజరుకాగా తల్లిని మాత్రమే బుధవారం కోర్టులో విచారణ జరిగింది. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం నాలుగు గంటల 40 నిమిషాల వరకు కొనసాగింది. ఈ కేసులో తల్లిని మాత్రమే విచారించి తండ్రిని విచారించ లేదు. కేసు విచారణ కొనసాగుతున్న సమయంలో ప్రముఖ న్యాయవాది ముప్పాల సుబ్బారావు అస్వస్థతకు గురై పడిపోవడంతో విచారణ రేపటికి వాయిదా పడింది.

# బాపట్ల యువకుడు అమెరికాలో దుర్మరణం



పూర్ణగోపి, కుటుంబ సభ్యులు (ఫైల్)

>> తమ్ముడు కొద్ది రోజుల క్రితం అమెరికాకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు పూర్ణ గోపి కారులో తీసుకెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మార్గమధ్యంలో కొంతసేపు తాను వాహనం నడుపుతానని తమ్ముడు కోరడంతో పూర్ణ గోపి రోడ్డుపక్కన కారును నిలిపినట్లు సమాచారం. అదే సమయంలో వెనుక నుంచి అత్యంత వేగంగా వచ్చిన మరో వాహనం వీరు నిలిపి ఉంచిన కారును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి కారు పూర్తిగా ధ్వంసమైందని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో పూర్ణ గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి శ్రీనివాసరావు, తల్లి, తమ్ముడు తీవ్ర గాయాలపాలయ్యారు. ఘటన అనంతరం స్థానిక అత్యవసర సిబ్బంది చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు సమాచారం. మృతుడు పూర్ణ గోపి తండ్రి శ్రీనివాసరావు భారత సైన్యంలో సేవలందించి విశ్రాంతి పొందిన మాజీ ఆర్మీ ఉద్యోగిగా స్థానికులు తెలిపారు. కుటుంబం ఎంతో కష్టపడి పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని, పూర్ణ గోపి కుటుంబానికి అండగా నిలుస్తూ అందరికీ ఆదర్శంగా ఉండేవాడని పరిచయస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో కుమారుడు మృతి చెందటం, తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడటం వంటి విషాదకర ఘటనతో బాపట్ల పట్టణంలోని యాదవపాలెంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ వార్త తెలిసిన వెంటనే బంధువులు, స్నేహితులు, స్థానికులు కుటుంబ సభ్యుల నివాసానికి చేరుకుని పరామర్శిస్తున్నారు. యువకుడి ఆకస్మిక మృతి స్థానికంగా కలకలం రేపింది.

# తిరుమల సమాచారం



## కుప్పం ప్రసన్న తిరుపతి గంగమ్మకు తిరుమల వెంకన్న సారె

**తిరుమల, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్తూరు జిల్లా కుప్పంలో కొలువైన ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా తిరుమల శ్రీవారి నుండి టిటిడి సారెను తీసుకెళ్ళి సమర్పించింది. ఆనవాయితీ ప్రకారం పట్టుచీరలు, పసుపు,కుంకుమ, పండ్లు, పూలు, శ్రీవారి లడ్డూలు ఇతరత్రాలతో కలిపిన సారెను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం తీసుకెళ్ళారు. అక్కడ ఈ సారెను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలసి శ్రీవారి సారెను గంగమ్మకు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ఈ జాతరలో అమ్మవారికి టిటిడి తరఫున శ్రీవారి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ముఖ్యమంత్రి అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, టిటిడి డిప్యూటీ ఇఒ లోకనాథం, టిటిడి ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



## 28నుండి నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**తిరుమల, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా నారాయణవనంలోని కల్యాణవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుండి జూన్ 5 వరకు జరగనున్నాయి. నారాయణవనంలోని పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను బుధవారం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈనెల 28 నుండి జూన్ 5 వరకు జరిగే కళ్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయని తెలిపారు. ఈనెల 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 27న అంకురార్పణం, జూన్ 4న దివ్య కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు సాంప్రదాయం, సంస్కృతి, ఆధ్యాత్మిక సమ్మేళనంగా ఏర్పాట్లు చేపట్టాలని, భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేపట్టేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో త్రాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, చలువ పందిళ్లు, వైట్ పెయింటింగ్, ఆలయ పరిసరాల్లో ఆహ్లాదకర రంగోలీలు, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సాంప్రదాయ పెయింటింగ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కల్యాణోత్సవానికి విచ్చేసే భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, ప్రసాదాల పంపిణీ, కూర్చునే ఏర్పాట్లు, భద్రతా చర్యలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## జూన్ 5న నాగలాపురంలో వేద నారాయణస్వామి పుష్పయాగం

**తిరుమల, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా నాగలాపురంలోని వేదనారాయణ స్వామి ఆలయంలో జూన్ 5వ తేదీన పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం పుష్ప సుగంధాలతో, భక్తిరస వాతావరణంతో ఆధ్యాత్మిక కాంతిని సంతరించుకోనుంది. ఇందుకోసం జూన్ 4వ తేదీ సాయంత్రం 6.15 గంటల నుండి రాత్రి 7.45 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రాహణం, సేనాధిపతి ఉత్సవం, పుష్పయాగ అంకురార్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. జూన్ 5న ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం జరగనుండగా, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు భక్తి శ్రద్ధల మధ్య పుష్పయాగం నిర్వహిస్తారు.ఈ మహోత్సవంలో వివిధ రకాల సుగంధ పుష్పాలు, పవిత్ర పత్రాలతో స్వామివారికి విశేష అభిషేకాలు సమర్పిస్తారు. అనంతరం సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు స్వామివారి వీధి ఉత్సవం భక్తులను అలరించనుంది.

## జనగణన-2027 విధుల్లో ఉన్న సిబ్బందికి బదలీలపై నిషేధం

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇళ్ల లెక్కింపు.గృహ జగనణన పనుల్లో నియమితులైన అధికారులను బదిలీ చేయకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వచ్చాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితర సిబ్బందికి ఈ నిషేదం వర్తిస్తుంది. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు వంటి ప్రధాన జనగణన అధికారులకు 30 జూన్ 2026 వరకు బదిలీలపై నిషేదం ఉంటుంది. మండల రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్లు/ జూనియర్ అసిస్టెంట్లకు 10 జూన్ 2026 వరకు బదిలీలు ఉండవు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు 7 జూన్ 2026 వరకు బదిలీలపై ఆంక్షలు విధించారు. ఈ ఉత్తర్వులను అన్ని శాఖలు కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# రైతు సంక్షేమమే లక్ష్యం

- హార్టికల్చర్‌లో ఎపికి కొత్త దిశ
- సిఎం చంద్రబాబు ముందు చూపుతో సేద్యంలో ఎపి కొత్త చరిత్ర: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి పాలనతో ఎన్నో యేళ్లుగా వెనుకబడిన రాయలసీమ ఇప్పుడు అభివృద్ధి దిశగా కొత్త అడుగులు వేస్తోందన్నారు. రాయలసీమ సమీకృత ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని రాయలసీమ ప్రాంతాన్ని దేశంలోనే ప్రముఖ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రాయలసీమలో హార్టికల్చర్ రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని గుర్తించిన సిఎం చంద్రబాబు, రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పండ్ల తోటలు, కూరగాయల సాగు, సుగంధ ద్రవ్య పంటలు, డ్రిప్ ఇరిగేషన్, కోల్డ్ స్టోరేజ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో ఈ ప్రాంత ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పు రానుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు జరుగుతుండగా, 2030 నాటికి దాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందులో భాగంగానే రాయలసీమ సమీకృత ఉద్యాన అభివృద్ధి ప్రణాళికకు రూపకల్పన చేసి, అమలుకు ఉత్తర్వులు జారీ చేయడం ప్రాంత అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వెనుకబడిన రాయలసీమను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికత, నీటి వనరుల సమర్థ వినియోగం, మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతులకు అనుకూల విధానాలతో రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాయలసీమలో హార్టికల్చర్ రంగ అభివృద్ధితో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే సంకల్పంతో సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. రాయలసీమ అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది" అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.
అభ్యర్థుల హెటిటిపిఎస్://ఐటిఐఅడ్మిషన్స్. ఎపి.జివోవి.ఇన్/ ఐటిఐ వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు 30 జూన్ 2026 రాత్రి 11:59 గంటల వరకు సమయం ఉంది.
దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 19 మే 2026 నుంచి 2 జులై 2026 సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత ప్రభుత్వ ఐటిఐలు కేంద్రాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.



ఎపిహెచ్‌డిసి అధికారులతో సమీక్షలో మంత్రి సవిత

## ఇళ్ల ముంగిటకే హస్త కళారూపాలు

- లేపాక్షి షో రూమ్‌లకు నూతన హంగులు: మంత్రి సవిత

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** లేపాక్షి షో రూమ్‌లను అభివృద్ధి చేయడంతో పాటు ఈ కామర్స్, సోషల్ మీడియా వేదికగా కళారూపాలను నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. హస్త కళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పనే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. లేపాక్షి షోరూమ్‌లు,హస్తకళారూపాల విక్రయాలపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హస్తక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో బుధవారం మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొని, రాష్ట్రంలో నూతన లేపాక్షి షో రూమ్‌ల ఏర్పాటుతో పాటు ప్రస్తుతమున్న షో రూమ్‌లను వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేసే అంశాలపై మంత్రి సవితకు వివరించారు. మరమ్మతులు పూర్తిచేసుకున్న ఢిల్లీ, కాకినాడ లేపాక్షి షో రూమ్‌లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మరమ్మతులు పూర్తిచేసుకున్న లేపాక్షి షో రూమ్ ఏర్పాటుకు కేంద్ర విమానయాన శాఖ అంగీకారం తెలిపిందని, త్వరగా ఆ షో రూమ్‌లను నూతన హంగులతో వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కామర్స్ ద్వారా హస్త కళారూపాల అమ్మకాలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికను హస్త కళారూపాల విక్రయాలకు అవకాశంగా వాడుకోవాలన్నారు. నేరుగా వినియోగదారుల ఇళ్లకే కళారూపాలను డోర్ డెలివరీ చేసేలా ఈ కామర్స్ వేదికలను వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే ఆప్కో షో రూమ్‌ల ద్వారా చేనేత వస్త్రాలను డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న హస్త కళాకారులకు ఏడాది పాటు ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా హస్త కళారూపాల అమ్మకాలు పెంచేలా అధికారులు ప్రణాళికలు అమలుచేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హస్తక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# 1,162.80 మెగావాట్ల సామర్థ్యంతో 228 ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ప్లాంట్లు

- డిసెంబర్ నాటికి పిఎం- కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పనులు పూర్తి చేయండి
- ఎఫ్ఎల్ఎస్ పనుల పురోగతిని సమీక్షించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 1,162 మెగావాట్ల సామర్థ్యంతో అమలులో ఉన్న 228 పిఎం కుసుమ్ ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ప్రాజెక్టుల పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయం నుండి డిస్కంల సిఎండిలు లోతేటి శివశంకర్, పృథ్వీతేజ్ ఇమ్మడి, పి.పుల్లారెడ్డి, నెడ్‌కాప్ ఎండి కమలాకర్ బాబుతో పాటు రాష్ట్రంలోని డిస్కమ్‌ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎస్ఇలు, ప్రాజెక్ట్ డెవలపర్స్‌తో రాష్ట్రంలో పిఎం- కుసుమ్ కాంపొనెంట్‌ది కింద అమల వుతున్న ఫీడర్ లెవల్ సోలరైజేషన్ ప్రాజెక్టుల పురోగతిపై విజయానంద్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పిఎం- కుసుమ్ పథకం కింద ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్‌ల పురో గతిపై ఈ సందర్భంగా ఆయన సమీక్షిం చారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పిఎం కుసుం కాంపోనెంట్‌సి కింద మొత్తం 1,162.80 మెగావాట్ల సామర్థ్యంతో 228 ఫీడర్ లెవల్ సోలరైజేషన్ ప్లాంట్లు అమలులో ఉన్నాయని తెలిపారు. నిర్ణీత గడువు లోగా పూర్తి చేసేందుకు సివిల్ పనులు, మెటీరియల్ మొబిలైజేషన్‌ను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని లేకుంటే కేంద్ర ప్రభుత్వం నుండి లభించే ఆర్థిక సహాయం లభించదని పేర్కొన్నారు. ప్రాజెక్టుల అమలులో ఎలాంటి ఆలస్యం లేకుండా వారానికోసారి సమీక్షలు నిర్వహించాలని, పెండింగ్ అనుమతులను వేగంగా పరిష్కరించాలని, డిస్కంలు, డెవలపర్ల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని కె.విజయానంద్ ఆదేశించారు. పిఎం కుసుమ్ కింద ఫీడర్ లెవల్ సోలరైజేషన్ ప్రాజెక్టుల పనులు విజయవంతంగా అమలు చేయడం ద్వారా గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహం, వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా, పారిశ్రామిక విద్యుత్ కొనుగోలు వ్యయాల తగ్గింపుతో పాటు రాష్ట్ర దీర్ఘకాలిక ఇంధన భద్రత బలోపేతం అవుతాయని విజయానంద్ పేర్కొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం కోసం ఏస్ అగ్రి బిజినెస్‌తో ప్రభుత్వం ఎంఒయు



మంత్రి టిజి భరత్ సమక్షంలో ఏస్ అగ్రి బిజినెస్ ప్రవేట్ సంస్థ ప్రతినిధులతో ప్రభుత్వ అధికారుల ఎంఒయు

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థ, రాష్ట్రంలోని రైతు ఉత్పత్తి ధారుల సంఘాల బలోపేతం, మార్కెటింగ్ నెటవర్క్ పై న్యూఢిల్లీలోని నోయిడాకు చెందిన ఏస్ అగ్రి బిజినెస్ ప్రవేట్ సంస్థతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ గుప్తా సమక్షంలో ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని రైతు ఉత్పత్తి దారుల సంఘాలను సంఘటితం చేసి వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం, ఆహార శుద్ధి యూనిట్స్ ఏర్పాటు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పాతులను ప్రోత్సహించడం, రైతులకు శిక్షణ కార్యక్రమాలు కల్పించడం జరుగుతుందని మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఈ సంస్థ అధిక విలువ ఆధారిత పంటలు అయిన కోకో, కాఫీ, కొబ్బరి, మిరప (ఎండు) పసుపు మరియు మిరియాలు మొదలగు వాటిపై రైతు ఉత్పత్తి దారుల సంఘాల ద్వారా ప్రతేక్యమైన మార్కెటింగ్ నెట్ వర్క్ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ (ఫుడ్ ప్రాసెసింగ్) చిరంజీవ్ చౌదరి, ఇండస్ట్రీస్ మరియు కామర్స్ శాఖ సెక్రటరీ డా. యువరాజ్, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా. శేఖర్ బాబు గెడ్డం, ఏపీఐఐసీ ఎం.డి దినేష్ కుమార్, ఏస్ అగ్రి బిజినెస్ ప్రవేట్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ త్రివేణి సతి పాల్గొన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన సచివాలయ కొత్తగా నియమితులైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు

## కొత్త ఎఎస్ఒలకు మంత్రి అభినందనలు

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్. స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సచివాలయం రెవెన్యూ శాఖలో కొత్తగా నియమితులైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు కలిసారు. కొత్తగా వెలగపూడి సచివాలయంలోని రెవెన్యూశాఖకు 25 మంది ఎఎస్ఓలను ఇటీవల నియమించారు. వారు కొత్తగా విధుల్లో చేరిన సందర్భంగా రెవెన్యూ మంత్రి అనగానిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఎయస్‌వోలను మంత్రి అనగాని అభినందించారు. ఉద్యోగ విధుల్లోనూ అదే విధంగా కష్టపడి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్న మంత్రి అనగాని ఆకాంక్షించారు. రెవెన్యూ శాఖలో పనిచేసే ఉద్యోగులు చెడ్డ పేరు తెచ్చుకోకుండా ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకొని పనిని పరుగులు పెట్టించాలన్నారు. 25 ఎయస్‌ఓ లందరినీ పేరుపేరునా పలకరించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అనగాని. 2026 రిక్రూట్మెంట్ ద్వారా మొత్తం 207 మంది ఎయస్‌ఓలం నియమితులయ్యారు. అందులోంది 25 మంది సచివాలయం లోని రెవెన్యూ శాఖకు కేటాయించారు.

# ప్రవాసాంధ్రుల కోసం ఎపిఎన్ఆర్‌టి అద్భుత సేవలు

- గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు



తెలంగాణ ఎన్నారై సలహా కమిటీతో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రవాసాంధ్రుల కోసం ఎపి ఎన్ఆర్‌టి అద్భుత సేవలు అందిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమమే ఎపి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ ఎన్నారై సలహా కమిటీతో గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమం కోసం ఒక సమగ్రమైన ఎన్నారై విధానాన్ని రూపొందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి ఎన్నారై సలహా కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు ఎపిలో పర్యటిస్తోంది. ఇక్కడ ప్రవాసాంధ్రుల కోసం ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ కార్యక్రమాలను మంత్రి కొండపల్లి వారికి వివరించారు. ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎపిఎన్ఆర్‌టిఎస్ సంస్థ ద్వారా అనేక విజయవంతమైన కార్యక్రమాలు చేపడుతోందని, ఈ క్రమంలోనే ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలనకోసమే వచ్చినట్టు తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ పేర్కొంది. ప్రసావాసాంధ్రులకు ఎపి ప్రభుత్వం అందిస్తోన్న సేవలు, అత్యవసర సహాయక చర్యలు, విదేశాల్లో సురక్షిత ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఓఎంకాప్ (ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) పాత్రను కమిటీ అధ్యయనం చేసింది. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వలస కార్మికుల సమస్యలు, మోసపూరిత ఏజెంట్లపై తీసుకుంటున్న చట్టపరమైన చర్యల గురించి మంత్రితో పాటు ఎపిఎన్ఆర్‌టి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గల్ఫ్ వలసదారుల భద్రత, బీమా సౌకర్యాలు, పునరావాస పథకాలపై ఎపి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ పర్యటన తర్వాత తెలంగాణలోని విదేశీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలోనే ఒక సమగ్రమైన ఎన్నారై విధానాన్ని రూపొందించడానికి తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ ప్రభుత్వానికి తుది నివేదికను సమర్పించనుంది. ఈ సమావేశంలో ఎపిఎన్ఆర్‌టి ప్రెసిడెంట్ డాక్టర్ వేమూరి రవి, ఎపిఎన్ఆర్‌టి సిఇఒ కృష్ణమోహన్, తెలంగాణ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ డా.బి.ఎం.వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకుల భూపతి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గాజువాకలో 'ఐటీ హబ్'

**గాజువాక, మే 20 ప్రభాతవార్త:** గాజువాక నియోజకవర్గాన్ని భవిష్యత్తులో ఐటీ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో బుధవారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలపై ఆయన సవివరంగా చర్చించారు.రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో విశాఖకు భారీ ఐటీ పెట్టుబడులు రానున్న నేపథ్యంలో.. గాజువాక పరిధిలోని యారాడ కొండపై ఉన్న 450 ఎకరాల ప్రభుత్వ భూమి, ఆగనంపూడి వద్ద 175 ఎకరాల భూమిని కలిపి మొత్తం 600 ఎకరాలను ఐటీ, నాలెడ్జ్ హబ్ కోసం పరిశీలించాలని అధికారులను కోరారు.ఉక్కు కర్మాగారం, గంగవరం పోర్టు, ఫార్మాసిటీ నిర్వాసితులకు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు, పరిహారం అంశాలపై తక్షణమే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

**PUBLIC NOTICE**

**M/s. Rajkumar Theatres Pvt Ltd.,** Chennai - 600 018 is the absolute owner of the Telugu Remake Rights (the said Rights) of the film "Drishyam 3", starring Mohanlal, Meena, etc., directed by Jeethu Joseph (the said Film).

M/s. Rajkumar Theatres Pvt Ltd., have filed a suit, vide C.S. (COMM DIV) No.144 of 2026, before the Hon'ble High Court, Madras, against M.J.Antony, of Aashirvad Cinemas, Mr. Jeethu Joseph, M/s.Panorama Studio and M/s. Pen Studios, for a permanent injunction restraining them, their servants, agents, employees, assignees, licensees and every one claiming under or through them from infringing the exclusive Copyright of M/s. Rajkumar Theatres Pvt Ltd., by remaking and exploiting the said Film "Drishyam 3" in Telugu language, anywhere in the World.

The Hon'ble High Court Madras, heard the suit on 20.05.2026 and was pleased to order notice returnable by 3 weeks.

In the meanwhile, anyone who may enter into any arrangement/agreement/contract with respect to the said Film, Dhrishyam 3 for Telugu language or exhibiting the same shall be doing so at their own risk and the same will be subject to the outcome of the said Suit.

CS. 144/2026.
A.No. 448/2026

R. AYSHWARYA
Counsel for Plaintiff



# ప్రధాని పిలుపునకు పల్లా ఫిదా

## బుల్లెట్ ప్రూఫ్ కారును సర్కార్‌కు తిరిగిచ్చేసిన గాజువాక ఎమ్మెల్యే!

**గాజువాక, మే 20 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన ఇంధన పొదుపు నినాదానికి స్పందిస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఒక ఆదర్శవంతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు.
ప్రభుత్వం తనకు భద్రతా రీత్యా కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఆయన స్వచ్ఛందంగా ప్రభుత్వానికి తిరిగి అప్పగించేశారు. ప్రజా ధనాన్ని ఆదా చేయడంతో పాటు, ఇంధన వినియోగాన్ని భారీగా తగ్గించాలనే ఉన్నతమైన ఆశయంతోనే గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.
ప్రజా ప్రతినిధులు ఆడంబరాలకు పోకుండా, ప్రజల సొమ్మును ఆదా చేసేందుకు ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



జూపూడి ప్రభాకర్‌ను అరెస్టు చేసిన పోలీసులు



చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వైకాపా శ్రేణులు

# మామిళ్లపల్లిలో ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ అరెస్ట్ • అరెస్టులకు భయపడం... రైతుల పక్షాన పోరాడుతాం
- జూపూడి, అంబటిలను చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలింపు • స్టేషన్ వద్ద వైకాపా శ్రేణులు ఆందోళన

**పొన్నూరు, మే 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో గత 15 రోజుల నుంచి ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. మామిళ్ళపల్లి గ్రామంలో కొంత మంది రైతులు తాము పండించిన మొక్కజొన్నలను ఒక రేకుల షెడ్డులో నిల్వ ఉంచారు. అయితే ఆ రేకుల షెడ్డులోని మొక్కజొన్నలు వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణవేనని, ఆయన రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి షెడ్డులో నిల్వ ఉంచారంటూ టిడిపి నాయకులు ఆరోపించడం, సదరు రేకుల షెడ్డు వద్దకు వెళ్ళి నిరసన తెలపడం జరిగింది. అయితే టిడిపి నాయకులు, కార్యకర్తలు రేకుల షెడ్డులోని మొక్కజొన్నలు మావని రైతులు చెప్తున్నప్పటికీ పట్టించుకోకుండా షెడ్డు షట్టర్లను పగులకొట్టారని తమపై దౌర్జన్యం చేశారంటూ పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు ఈ కేసులో టిడిపికి చెందిన 31మందిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో టిడిపికి చెందిన ఓ వ్యక్తి గ్రామంలోని రైతులు తమను కించపరిచారంటూ ఫిర్యాదు చేయడంతో 14మంది రైతులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. అయితే మొక్కజొన్నలు అంబటివేనని షెడ్డులో ఉన్నవాటిని సీజ్ చేయాలని టిడిపి నాయకులు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడి శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతుందని భావించిన తహశీల్దార్ సంబంధిత రేకుల షెడ్డుకు సీల్ వేయడం, సంబంధిత సరుకును మార్కెటింగ్ శాఖాధికారులకు అప్పగించడం జరిగింది. ఇక అప్పటి నుంచి వైకాపా శ్రేణులు రైతుల పక్షాన నిత్యం పోరాటం చేస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ రైతుల వద్ద నుంచి అతి తక్కువ ధరకు మొక్కజొన్నలను కొని సంగం డెయిరీలో నిల్వ చేశాడంటూ వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించడంతోపాటు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కూడా చేశారు. టిడిపి, వైకాపాకు చెందిన నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపించుకోవడంతో హీట్ పెరిగింది. అంబటి మురళీకృష్ణ ప్రతి నిత్యం ఒక రాష్ట్రస్థాయి నాయకుడిని రప్పించడం రైతులకు జరిగిన అన్యాయంపై వారు మాట్లాడడం వంటివి జరుగుతూ ఉన్నాయి. అందులో భాగంగానే ఈ నెల 14వ తేదీన జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుతో పాటు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన సమన్వయకర్తల, ఇతర రాష్ట్రస్థాయి నాయకులు వచ్చి రైతులకు సంఘీభావం తెలిపారు. ఆ తర్వాత 14వ తేదీన



అంబటి మురళీకృష్ణ వద్ద మోహరించిన పోలీసులు

మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) రావడంతో ఆయన రైతుల పక్షాన మాట్లాడడం జరిగింది. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కూడా ఈ నెల 15వ తేదీన గ్రామంలో బహిరంగ నిర్వహించడం, తాము మొక్కజొన్నలను 21వందలకు కొనుగోలు చేస్తే వైకాపా నాయకుడు అంబటి మురళీకృష్ణ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పెద్దేటమ్మ తల్లి సాక్షిగా నరేంద్రకుమార్ రూ.21వందలకు కొనుగోలు చేసినట్లు పలువురు రైతులు ప్రమాణం చేశారు. దీంతో ఇరు పార్టీ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 16వ తేదీన హైకోర్టు న్యాయవాది రజని వచ్చి సంఘీభావం తెలిపారు. 17న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వచ్చి సంఘీభావం తెలపడం వంటివి జరిగాయి. 18న మాజీ మంత్రి జోగి రమేష్ వస్తున్నారన్న వార్త తెలుసుకున్న పోలీసులు జోగి రమేష్‌ను చుండూరు ప్రాంతంలో అరెస్ట్ చేసి గ్రామంలో అడుగుపెట్టకుండా పోలీసులు అడ్డగించారు. పోలీసులను అడ్డగించిన మహిళలపై పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని మహిళా రైతులు ఆరోపించారు. ఇక బుధవారం మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ వంతు వచ్చింది. అయితే జూపూడి ప్రభాకర్ ఉదయాన్నే పోలీసుల కళ్ళుకప్పి మామిళ్ళపల్లి చేరుకున్నారు. మామిళ్ళపల్లిలోని అంబటి మురళీకృష్ణ ఇంట్లో గదిలో విశ్రాంతి తీసుకుంటున్న తరుణంలో ఈ విషయం పోలీసులకు చేరింది. దీంతో తెనాలి డిఎస్పీ జనార్ధనరావు నేతృత్వంలో పొన్నూరు పట్టణ, రూరల్ సిఐలు లావూరి వీరానాయక్, కృష్ణయ్యలు డివిజన్‌లోని పలువురు సిఐలు, ఎస్సైలు మామిళ్ళపల్లి చేరుకొని మురళీకృష్ణ ఇంట్లో ఉన్న జూపూడి ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జూపూడి ప్రభాకర్, కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. జూపూడి ప్రభాకర్‌ను అరెస్ట్ చేసి తీసుకెళుతున్న సందర్భంగా పోలీసు వాహనానికి కార్యకర్తలు, నాయకులు, మహిళలు అడ్డుపడ్డారు. పోలీసులు వారిందరినీ లాడిపడేసి జూపూడిని చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంబటి మురళీకృష్ణను కూడా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంలో అంబటికి, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. పోలీసులు పోలీసుల్లా ప్రవర్తించడం లేదని, గూండాలుగా, రౌడీలుగా ప్రవర్తిస్తున్నారంటూ వైకాపా శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అంబటిని, జూపూడిని చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారన్న వార్త విన్న వైకాపా శ్రేణులు భారీగా చేబ్రోలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఇక అక్కడి నుంచి జూపూడి, అంబటి ఇరువురు తాము జిల్లా కలెక్టర్‌ను కలవాలని మమ్మలను విడిచిపెట్టాలని కోరడంతో పోలీసులే వారిరువురిని గుంటూరులోని అంబటి నివాసం వద్ద వదిలేశారు. అనంతరం అంబటి, జూపూడి, పార్టీ నాయకులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు.

## ఘోస్ట్ సిం కార్డుల నెట్‌వర్క్‌పై సైబర్ క్రైం పోలీసుల ఆపరేషన ఆక్టోపస్ 3

# 13 రాష్ట్రాలలో దాడులు, 66 మంది నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఏరివేతకు వరుసగా ప్రత్యేక దాడులు చేస్తున్న సిటీ సైబర్ క్రైం పోలీసులు తాజాగా ఘోస్ట్ సిం కార్డుల నెట్‌వర్క్‌పై ఆపరేషన్ ఆక్టోపస్ 3 నిర్వహించింది. ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్లు, మ్యూల్ ఖాతాదారులను పట్టుకున్న సైబర్ క్రైం పోలీసులు తాజాగా దేశ వ్యాప్తంగా వారం రోజుల పాటు 13 రాష్ట్రాలలో దాడులు నిర్వహించి కేవలం అక్రమ సిం కార్డుల నెట్‌వర్క్ నిర్వహిస్తున్న నేరగాళ్ల భరతం పట్టారు.

సిటీ కొత్వాల్ సజ్జన్నర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం డిసిపి అరవింద బాబు ఆయన బృందం ఈ దాడులు నిర్వ హించాయి. జంట నగరాలలో ఇటీవల పట్టుబడ్డ సైబర్ నేరగాళ్ల వద్ద లభ్యమైన 1194 ఘోస్ట్ సిం కార్డుల నేపథ్యంలో వీరికి ఈ సిం కార్డు లు ఎలా వచ్చాయి ? ఎవరు ఇచ్చారు? వీరి వెనుక వున్న వారు ఎవరు ? అనే దానిని ఛేదించేందుకు జరిగిన దాడుల్లో 18 ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మొత్తం 66 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరంతా ఘోస్ట్ సిం కార్డుల నెట్‌వర్క్‌లో వున్నవారుగా తేలింది. వీరి వద్ద 544 సిం కార్డులు లభ్యమవగా ఇందులో 432 సీల్డ్ కవర్లోనూ, 112 ఓపెన్ గా వున్నాయి. అరెస్టయిన వారిలో 44 మంది ఘోస్ట్ సిం కార్డుల వినియోగదారులు 20



మీడియాతో మాట్లాడుతున్న కొత్వాల్ సజ్జన్నార్

మంది వీటిని అమ్మే వ్యాపారులు, ఇద్దరు సరఫరాదారులు వున్నారు. వీరం తా దేశ వ్యాప్తంగా వెలుగు చూసిన 76 సైబర్ నేరాలలో నిందితులుగా వున్నారు.

ఈ నేరాల ద్వారా సామాన్యులు పోగొట్టు కున్న నగదు 101.87 కోట్ల రూపాయలుగా తేలింది. అరెస్టయిన వారిలో వోడాఫోన్ ఐడియా కంపెనీకి చెందిన వారు 10 మంది ఎయిర్‌టెల్‌కు చెందిన వారు ఏడుగురు, జియో కంపెనీకి చెందిన వారు ముగ్గురు వుండగా తెలంగాణ, ఎపి, కర్నాటక, మహారాష్ట్ర యుపి, బెంగాల్, ఢిల్లీ, హరియాణా, గుజరాత్, మధ్య ప్రదేశ్, తమిళనాడు, ఒడిషా, పంజాబ్ రాష్ట్రాల్లో ఈ దాడులు జరిగాయి. సిం కార్డుల కోసం వచ్చే వినియోగదారులకు తెలియకుండానే వారి కెవైసిని వాడి నేరగాళ్ల కొత్త సిం కార్డులను సేకరిస్తున్నట్లు తేలింది.

దీంతో పాటు మారుమూల గ్రామాల్లో క్యాంప్‌లు ఏర్పాటు చేసి అక్కడి అమాయకులను టోకరా వేసి వారికి తెలియకుండా ఒకటికి మించి సిం కార్డులు తీసుకుంటూ వాటిని సైబర్ నేరగాళ్లకు ఈ నేరగాళ్లు విక్రయిస్తున్నట్లు తేలింది.

ఇందులో అనేక సిం కార్డులు విదేశాల్లో వుండే నేరగాళ్లకు చేరినట్లు తేలింది. తాజా ఘటనల నేపథ్యంలో సెల్‌ఫోన్‌ల కంపెనీ అధికారులతో సమావేశం కావాలని కొత్వాల్ సజ్జన్నర్ నిర్ణయించారు. ఈ సమావేశంలో సిం కార్డుల విక్రయాలపై ఆయన మార్గదర్శకాలు జారీ చేయనున్నారు.

# కేంద్ర మంత్రి ఖట్టర్‌తో మంత్రి నారాయణ భేటీ

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో మంత్రి నారాయణ భేటీ అయ్యారు. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని మంత్రి కోరారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుపై కేంద్రానికి రైట్స్ సంస్థ నివేదిక ఇచ్చింది. విశాఖ మెట్రో మార్గంలో 13 కి.మీ డబుల్ డెక్కర్ లైన్ ఏర్పాటు చేసేలా సంస్థ నివేదిక ఇచ్చింది. అనుమతులు ఇచ్చి త్వరగా ప్రాజెక్టులు ప్రారంభించేలా చూడాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. అంతకు ముందు స్వచ్ఛ భారత్ 2.0 కార్యక్రమాల అమలు తీరుపై ఢిల్లీ వేదికగా జాతీయ సదస్సు జరిగింది. జాతీయ స్థాయి సదస్సుకు ఏపీ మంత్రి నారాయణ హాజరయ్యారు. కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, పలు రాష్ట్రాల మున్సిపల్ శాఖ మంత్రులు సైతం హాజరయ్యారు. ఏపీ నుంచి మున్సిపల్ శాఖ డైరెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ హాజరయ్యారు. ఏపీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాల అమలును ఈ సందర్భంగా మంత్రి నారాయణ వివరించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు చేపట్టిన చర్యలను మంత్రి నారాయణ వివరించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పుతున్న విధానాన్ని సైతం తెలియజేశారు. స్వచ్ఛభారత్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి నెలా మూడో శనివారం కార్యక్రమాలను చేపట్టాలన్నారు.



# ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించాలి

## దాంతోనే విద్వేష రాజకీయాలకు ముగింపు

**జమియత్ ఉలేమా ఎ హింద్ అధినేత మౌలానా సయ్యద్ అర్షద్ మదాని డిమాండ్**

**న్యూఢిల్లీ, మే 20:** ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటిస్తే అది ఎంతో సంతోషించదగ్గ విషయమని జమియత్ ఉలేమాఎహింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదానీ డిమాండ్ చేశారు. ఈ పవిత్ర జంతువు చుట్టూ తిరుగుతున్న విభజన రాజకీయాలే మైనారిటీ వర్గంపై ద్వేషపూరిత వ్యాఖ్యలు, దాడులు జరగడానికి "మూల కారణం" అని ఆయన పేర్కొన్నారు. "ద్వేష రాజకీయాలు", ఆవు రక్షణ పేరుతో ఏర్పడిన మూకల చేతిలో ముస్లింలపై పెరుగుతున్న మూక దాడుల పట్ల మదానీ ఆందోళన వ్యక్తం చేశారు. పవిత్ర మైన ఆవును "జాతీయ జంతువు"గా ప్రకటించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు "శ్రీ"లో పోస్టు చేశారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించడానికి ప్రభుత్వాన్ని ఏది అడ్డుకుంటోందని ప్రశ్నించారు. మెజారిటీ వర్గం ఆవును కేవలం పవిత్రంగానే కాకుండా తమ తల్లిగా కూడా భావిస్తుందని ఆయన పేర్కొన్నారు. 'ఆవు పేరుతో జరిగే మూకదాడులు, అమాయక ప్రజల హత్యలు, ద్వేష రాజకీ యాలు, ముస్లింలను అప్రతిష్టపాలు చేసే ఈ కుట్రపూరిత ఆట ఇకనైనా ముగి యాలి' అని ఆయన డిమాండ్ చేశారు. మతం పేరుతో జరిగే రాజకీయాల వల్ల ఏ ఒక్క మానవ ప్రాణమూ బలికాకూడదని ఆయన అన్నారు. మతపం`మైన విభజనలు, ద్వేష రాజకీయాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన గట్టిగా కోరారు. ఆవుకు "జాతీయ జంతువు" హోదా కల్పించాలని ఆయన సూచించారు. తద్వారా ఈ సమస్యలన్నింటికీ శాశ్వతంగా ముగింపు లభిస్తుందని ఆయన తన వాదనను వినిపించారు. "ఈ ఉద్దేశంతో ఏ చట్టం రూపొందించబడినా, అది దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఎటువంటి వివక్ష లేకుండా ఏకరీతిగా అమలు చేయబడాలి" అని మదానీ డిమాండ్ చేశారు.

# పరిశ్రమలు నిబంధనలు పాటించాల్సిందే

- దేశ ప్రగతి ఎంత ముఖ్యమో... ప్రజల ఆరోగ్యం అంతే ముఖ్యం • గ్రీన్ బెల్ట్ నిర్వహణ, శబ్ద కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలు తప్పనిసరి • కాలుష్యాన్ని నియంత్రించి గోస్తని నదిని కాపాడుదాం • కాలుష్య నియంత్రణ మండలి తనిఖీల్లో బాధితులను భాగస్వామ్యం చేయాలి • అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష



**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ పురోగతికి పరిశ్రమలు ఎంత అవసరమో... ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతికల శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కొన్ని పరిశ్రమలు కేవలం లాభాల కోసమే చూస్తూ నిబంధనలను పక్కనబెట్టి జనావాసాల మధ్య కాలుష్యాన్ని వెదజల్లడం సరికాదన్నారు. పరిశ్రమలు చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలని, శబ్ద కాలుష్య నియంత్రణపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు కచ్చితంగా పాటించాలని అన్నారు. మతపరమైన, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట ఇతరుల ప్రశాంతతకు భంగం కలిగించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి కేవలం నివేదికలకే పరిమితం కాకుండా నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "కొన్ని ప్రాంతాల్లో జనావాసాలకు అత్యంత సమీపంలో మైనింగ్ కోసం పేలుళ్లు చేయడం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురవుతున్నామని, పేలుళ్లు దాటికి ఇళ్లకు బీటలు వారి ఆర్థికంగా నష్టపోతున్నామని బాధితుల నుంచి ఫిర్యాదు వస్తున్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన పర్యావరణ ప్రమాణాలను అన్ని మైనింగ్ సంస్థలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**బాధితుల భాగస్వామ్యంతో పరిష్కార మార్గాలు:** కాలుష్క నియంత్రణ మండలి తనిఖీ ప్రక్రియ ప్రజలకు అర్థం కాకుండా ఒక బ్రహ్మ పదార్థంలాగా మారిపోయింది. దీంతో క్షేత్ర స్థాయిలో కాలుష్య సమస్యలు పరిష్కారం కావడం లేదు. అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు బాధితులను కూడా తనిఖీ కమిటీలో భాగస్వామ్యం చేస్తే... తనిఖీలు పారదర్శకంగా జరగడంతోపాటు బాధితులకు న్యాయం జరుగుతుంది.

**ఎవరికీ మినహాయింపులు లేవు:** శబ్ద కాలుష్యం నియంత్రణలో సుప్రీం కోర్టు ఉత్తర్వులు, కేంద్ర పర్యావరణ నియంత్రణ మండలి నిబంధనలు పరిశ్రమలు, సంస్థలు, ప్రార్థనా మందిరాలు కచ్చితంగా పాటించాలి. ఇండస్ట్రియల్, కమర్షియల్, రెసిడెన్సియల్, సెన్సిటివ్ జోన్లలో నిర్దేశిత డెసిబెల్ పరిమితులను కచ్చితంగా పాటించాలి. ప్రార్థనా మందిరాలైనా జోన్ల వారీగా నిర్దేశించిన శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాల్సిందే... ఇందులో ఎవరికీ మినహాయింపులు లేవు.

**వైట్ కేటగిరి పరిశ్రమలు కూడా కాలుష్యం వెదజల్లుతున్నాయి:** నెల్లూరు జిల్లాలో కొన్ని పరిశ్రమలు వైట్ కేటగిరి కింద రిజిస్టర్ అయి, నిబంధనలకు విరుద్ధంగా దుర్వాసన, కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. బయటకు అస్సలు కాలుష్యం కలిగించని పరిశ్రమలు అని చెప్పుకుంటూ ఆర్గానిక్ వేస్ట్, రసాయన వ్యర్థాలను బయటకు వదులుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. దీనిపై విచారణ జరిపి పరిశ్రమల నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలి. అలాగే సాంకేతికతను వాడి దుర్వాసన తగ్గించే పద్ధతులను పాటించేలా చేయాలి.

**కాలుష్య కోరల్లో గోస్తనీ నది:** గోస్తనీ నది తీవ్రమైన కాలుష్యం బారిన పడింది. పాలకోడేరు మండలం వేంద్ర గ్రామ పరిధిలో సేకరించిన నీటి నమూనాలలో బయోలాజికల్ ఆక్సిజెన్ డిమాండ్ 15ఎంజిలు చేరడం అనేది పర్యావరణ అత్యవసర పరిస్థితిని సూచిస్తోంది. ఈ నమూనాల ప్రకారం కాలుష్యం అనుమతించదగిన స్థాయి కంటే ఐదు రెట్లు ఎక్కువగా ఉంది. పరిశ్రమల నుంచి నేరుగా నదిలోకి వచ్చే మురుగు, రసాయన వ్యర్థాలను డ్రోన్, వీడియో కెమెరాల ద్వారా రికార్డ్ చేసి సంబంధిత పరిశ్రమలను బాధ్యులను చేయాలి.

**నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం విజయవంతం చేద్దాం:** గాలి నాణ్యతను మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం. దేశంలో అత్యంత కాలుష్య పూరిత నగరాలలో ప్రమాదకరమైన సూక్ష్మ ధూళి కణాల స్థాయిలను 40శాతం వరకు తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో 13 నగరాలు ఎంపిక చేసి దాదాపు రూ. 400 కోట్ల నిధులను కేటాయించారు. వాటిని జాగ్రత్తగా వినియోగించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల"ని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలిలో సిబ్బంది కొరతపై అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకురాగా.. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్ కల్యాణ్ వెంటనే సంబంధిత ఫైలును ముందుకు తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించారు.

# దుర్గమ్మ ఆలయ ఇన్‌చార్జి ఇఒగా రంగారావు



భక్తుల సౌకర్యాలు పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఇఒ

**ఇంద్రకీలాద్రి, మే 21 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయ ఇన్‌చార్జి ఇఒగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ రంగారావు బాధ్యతలు స్వీకరించారు. ఇఒ శీనానాయక్ సెలవుపై వెళ్ళినందున బాధ్యతలు స్వీకరించిన రంగారావు బుధవారం ఆలయంలో భక్తులకు అందుతున్న సేవలను పరిశీలించారు.



**వేదపరిరక్షణ ట్రస్టుకు విరాళం:** దుర్గమ్మ ఆలయ వేదపరిరక్షణ ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన వేదాంతం షణ్ముఖ రామకృష్ణ బుధవారం రు.1లక్ష విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన 10మందికి రెండురోజుల జైలు శిక్ష

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త:** మందుబాబులు జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక నుండి మద్యం సేవించి వాహనం నడిపారో జైలు ఊసలు లెక్కపెట్టాల్సిందే. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి వేర్వేరు ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న 57మందిని పట్టుకుని బుధవారం విజయవాడలోని కోర్టుల్లో హాజరు పరచారు. కేసు విచారించిన న్యాయమూర్తి వీరిలో 10మందికి ఒక్కొక్కరికీ రెండురోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. 47మందికి రూ.10వేల జరిమానా విధించారు.

**కేర్‌టేకర్ అరెస్ట్:** నమ్మకంగా ఇంట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తూ ఆఇంటికే కన్నం వేసిన మోసగాడిని పోలీసులు అరెస్ట్‌చేసారు. విజయనగరం జిల్లా, ధర్మపురి, బిసికాలనీకి చెందిన ఉప్పలాడ సురేష్(25) చిన్నతనం నుండి చెడువ్యసనాలకు బానిసై మోటారుసైకిళ్ళ ఎత్తుకుపోయి వాటిని విక్రయించగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుండేవాడు. విజయవాడ బృందావన్ కాలనీలో ఓ ఇంటికి కేర్‌టేకర్‌గా వెళ్ళాడు. విధుల్లో చేరిన రెండురోజులకే 32 గ్రాముల బంగారు గొలుసు అపహరించి ఉద్యోగం మానేసాడు. అనంతరం ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున అదే ఇంటికి వెళ్ళి నిద్రిస్తున్న వృద్ధుని చంపుతానని బెదిరించి మెడలోని 5తులాల గొలుసు లాక్కుని పారిపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు విచారణ చేపట్టి నిందితుడ్ని బుధవారం అరెస్ట్‌చేసి అతని వద్ద నుండి రూ.10 లక్షల విలువచేసే 75గ్రాముల బంగారు ఆభరణాలు, పల్సర్ బండిని స్వాధీనం చేసుకున్నారు.



# కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త:** కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మికులకు భరోసా ఇచ్చారు. శ్రవశక్తి, ఉత్తమ యాజమాన్య పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి ఈసందర్భంగా ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేత ృత్వంలోని తమ ప్రభుత్వానికి కార్మికులు, యాజమాన్యాలు రెండు కళ్ళువంటి వారని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. కార్మికుల భద్రత కోసం యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వ హాయాంలో కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసారని, భవన నిర్మాణ కార్మికులకు అమలులో ఉన్న పథకాలను రద్దుచేసి వారి జీవనోపాధిని దెబ్బతీసారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావటంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నట్లు మంత్రి వివరించారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20లక్షల ఉద్యోగాల కల్పనకు కృషిచేస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గతప్రభుత్వంలో నిలిచిపోయిన వివాహకానుక రూ.20 వేలు, ప్రసూతి సహాయంగా రూ.20 వేలు, సహజమరణం రూ.60 వేలు, అంత్య క్రియల ఖర్చుకు రూ.20 వేలు అందిస్తున్నట్లు సుభాష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భవననిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి తెలియచేసారు. తిరుపతి, విశాఖపట్నం, అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఆధునిక ఈఎస్ఐ వైద్యశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 30 ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సుభాష్ ఈసందర్భంగా పిలుపునిచ్చారు.

మేడే సందర్భంగా ఇవ్వాల్సిన అవార్డులు ఈరోజు ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం అవార్డులు అందచేసారు. ఈకార్యక్రమంలో మెడికల్‌సర్వీస్ డిపార్టుమెంట్ కార్యదర్శి వి.శేషగిరిబాబు, ఏపి భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు చైర్మన్ వి.మల్లిఖార్జునరావు, కార్మికుల సంక్షేమ సలహా కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఏపి కార్మిక సంక్షేమబోర్డు ఉపాధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్, 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, కార్మికశాఖ కమీషనర్ గంధం చంద్రుడు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు.



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిపి రాజశేఖరబాబు

# డ్రగ్స్ రహిత నగరంగా విజయవాడ

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త:** రాష్ట్రం నడిబొడ్డున ఉన్న విజయవాడ నగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దటమే పోలీస్‌ల లక్ష్యమని విజయవాడ సిపి రాజశేఖరబాబు తేల్చిచెప్పారు. డ్రగ్స్‌పై దండయాత్ర-2లో భాగంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్ వచ్చిన యువకులను బుధవారం సిపి ఎదుట హాజరుపరచారు. ఈమేరకు తొలితప్పుగా భావించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సిపి మాట్లాడుతూ చిన్నవయసులోనే డ్రగ్స్‌కు బానిసలై బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. తప్పుడు మార్గాలను ఎంచుకోవటం తేలికే నని కాని వాటి వల్ల కలిగే నష్టం ఒక వ్యక్తితో ఆగిపోదనని కుటుంబాలు, సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. డ్రగ్స్‌పై దండయాత్ర-2లో బాగంగా వివిధ ప్రాంతాల్లో అనుమానితులను పరిక్షించగా 1220మంది పాజిటివ్ వచ్చిందన్నారు. వీరందరికీ మార్పు కోసం మరో అవకాశం ఇస్తున్నామని, వీరికి వివిధ రకాలుగా కౌన్సిలింగ్ ఇవ్వటంతోపాటు, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ విక్రేతలను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించినట్లు రాజశేఖర్‌బాబు వివరించారు. విజయవాడ నగరం మొత్తం సిసికెమెరా పర్యవేక్షణలో ఉందని, ఎక్కడెక్కడ ఏం జరుగుతుందో ప్రతిక్షణం అంతా పోలీసులు గమనిస్తున్నారని హెచ్చరించారు. అందర్నీ మరోసారి ఆకస్మిక తనిఖీ చేస్తామని ఈసారి పట్టుబడితే జైలు తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## వచ్చే నెల ఫ్రాన్స్‌లో జి-7 శిఖరాగ్ర సదస్సు భేటీ కానున్న అగ్రనేతలు ట్రంప్, మోడీ

**న్యూఢిల్లీ, మే 20:** ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి రేకెత్తించే అతికొద్ది సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల భేటీ ఒకటి. గతేడాది వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాల తర్వాత ఇప్పుడు మళ్లీ వారిద్దరూ ముఖాముఖి కలుసుకుంటారని సమాచారం వెలుగులోకి వచ్చింది. ఫ్రాన్స్‌లో వచ్చే నెలలో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సు ఈ కలయికకు వేదిక కానుంది. ఈ భేటీతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గుతాయో లేదోనని సర్వత్రా చర్చకు దారితీసింది.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. జూన్ 15 నుంచి 17 వరకు ఎవియన్‌లెస్‌బెయిన్స్‌లో జరిగే ఈ సదస్సులో జీ7 సభ్య దేశాలు కాకపోయినా, ప్రత్యేక ఆహ్వానిత దేశంగా భారత్ పాలుపంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సదస్సు సందర్భంగా మోడీ, ట్రంప్‌ల మధ్య అధికారికంగా కాకపోయినా, కనీసం అనధికారికంగానైనా ఒక చిన్న సమావేశం జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అనూహ్య శైలిని బట్టి చూస్తే, ఈ భేటీని కొట్టిపారేయలేమని నిపుణులు చెపుతున్నారు. మోడీ, ట్రంప్ చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఆయన్ను కలిసిన తొలి ప్రపంచ నేతల్లో మోడీఒకరు. ఆ సమయంలో మోడీని తన "గొప్ప స్నేహితుడు" అని అభివర్ణించిన ట్రంప్, 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా ఉన్నట్లు చెప్పారు.

ఆ తర్వాత కొద్ది నెలలకే మే నెలలో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో తానే కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించుకున్నారు. నోబెల్ శాంతి బహుమతిని ఆశించి, తాను వాణిజ్యపరమైన బెదిరింపులతోనే అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధాన్ని ఆపానని ప్రతిచోటా ప్రచారం చేసుకున్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు పాకిస్థాన్ వంత పాడగా, భారత్ మాత్రం తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఇస్లామాబాద్‌తో నేరుగా జరిపిన చర్చల ఫలితమేనని, ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏడాది తర్వాత జరగబోయే ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# మోడీ, అమిత్‌షా దేశ ద్రోహులు

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు
- అరాచక మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది: బిజెపి మండిపాటు
- ప్రజా ఆగ్రహానికి ప్రతిబింబం: సమర్థించుకున్న కాంగ్రెస్

**రాయ్‌బరేలీ, మే 20:** దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాలపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి కొత్త వివాదాన్ని రేకెత్తించారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన బహుజన్ స్వాభిమాన్ సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి, హోం మంత్రి ఇద్దరినీ "దేశద్రోహులు"గా అభివర్ణించారు. వారు దేశాన్ని అమ్ముకున్నారని ఆరోపించారు. "ఆప్కే ప్రధానమంత్రి ఔర్ గృహ మంత్రి గద్దర్ హై (మీ ప్రధానమంత్రి, హోం మంత్రి దేశద్రోహులు)" అని అన్నారు. అలాగే 'రాబోయే ఆర్థిక తుఫాను' గురించి ప్రజలను హెచ్చరిస్తూ, కేంద్ర ప్రభుత్వ లోపభూయిష్టమైన విధానాల కారణంగా దేశం ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తోందని పేర్కొన్నారు. అంతేకాకుండా, కేంద్రం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని దెబ్బతీస్తోందని ఆరోపించారు. "కొద్ది నెలల్లోనే ద్రవ్యోల్బణం పెరగడం, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటడం, ఎల్పీజీ గ్యాస్ కనుమరుగవడం మీరు చూస్తారు" అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి ఖర్చుల కోతకు పిలుపునిస్తూ, తానే ఐదు దేశాల పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో, ప్రజలు తమ గళం విప్పాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ప్రజలకు బంగారం కొనవద్దని, విదేశాలకు వెళ్లవద్దని సలహా ఇస్తూనే, తాను మాత్రం విలాసవంతమైన విమానాల్లో విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో రైతులు ఎరువుల వంటి నిత్యావసర వస్తువులను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన హెచ్చరించారు.





### అరాచక మనస్తత్వాన్ని, స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది: నితిన్ నబిన్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) తీవ్రంగా విరుచుకుపడింది. ఆయన వ్యాఖ్యలు దేశాన్ని అవమానించడమేనని పేర్కొంటూ, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రంగా స్పందిస్తూ, 'ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన అరాచక మనస్తత్వాన్ని, స్వభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఎన్నికలలో తన పార్టీ ఓటమి పాలవ్వడం పట్ల ఆయనకున్న నిరాశ, నిస్పృహలను కూడా ఆ వ్యాఖ్యలు ప్రతి బింబిస్తున్నాయి" అని అన్నారు. "ఆయన మానసిక సమతుల్యతను కోల్పోతున్నారని కూడా తాను నమ్ముతున్నాను,' అని పేర్కొన్నారు. బిజెపి జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి, మాట్లాడుతూ, 'రాహుల్ గాంధీ ఆలోచనా విధానం అరాచకమైనది. రాహుల్ గాంధీ అచ్చం పట్టణ నక్సల్స్ లాగే మాట్లాడతారు. రాహుల్ గాంధీ 140 కోట్ల మంది దేశ ప్రజలను దేశద్రోహులుగా పిలిచారు. ఇవన్నీ రాహుల్ గాంధీ విధానం, ఉద్దేశం... తుక్డేతుక్డే గ్యాంగ్‌ను పోలి ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలన్న, జెన్‌జెడ్‌ను రెచ్చగొట్టాలన్న తన ఉద్దేశం విఫలమవడంతో ఆయన నిరాశ చెందారు' అని అన్నారు.

### ప్రజా ఆగ్రహానికి ప్రతిబింబం: సమర్థించుకున్న కాంగ్రెస్

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు రాజకీయ చర్చకు దారితీయగా, కాంగ్రెస్ పార్టీ గాంధీ ప్రకటనలను సమర్థించుకుంటూ, దేశవ్యాప్తంగా ప్రజలు అనుభవిస్తున్న ఆగ్రహానికి, అసహనానికి అవి ప్రతిబింబమని నొక్కి చెప్పింది. న్యూఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వానికి ఓటు వేసినవారితో సహా పౌరులందరిలోనూ విస్తృతమైన అసంతృప్తి నెలకొని ఉందని పేర్కొన్నారు. "సమాజంలోని ప్రతి వర్గంలోనూ దేశం పట్ల ఒక గాఢమైన ఆందోళన నెలకొని ఉంది. ప్రజలు, ముఖ్యంగా ఈ ప్రభుత్వానికి ఓటు వేసినవారు, తాము తీవ్రంగా మోసపోయామనే భావనతో ఉన్నారు. వారిలో తీవ్రమైన నిరాశ, విచారం, ఆగ్రహం అలుముకున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పార్టీగా, ఆ ఆగ్రహాన్ని తాము తప్పక వెలిబుచ్చాల్సి ఉంటుంది. ప్రభుత్వం గురించి వీధుల్లో ప్రజలు మాట్లాడుకుంటున్న మాటలతో పోలిస్తే, గాంధీ చెప్పిన మాటలు చాలా తక్కువ" అని ఖేరా అన్నారు. కాగా, ఇండియా బ్లాక్‌లో కాంగ్రెస్‌కు మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఆచితూచి స్పందించింది. రాజకీయ ప్రసంగంలో అటువంటి భాషను తాము ఆమోదించబోమని స్పష్టం చేసింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి అవధేష్ ప్రసాద్ మాట్లాడుతూ, 'అది ఆయన సిద్ధాంతం. తాము అటువంటి భాషను ఉపయోగించలేము' అని అన్నారు.

## టివికె కూటమి ప్రభుత్వంలో తెరపైకి లుకలుకలు



అన్నాడిఎంకెను కేబినెట్‌లోకి తీసుకుంటే మేం బయటకు వెళతాం:సిపిఎం

విశ్వాసపరీక్షలో వారిచ్చిన మద్దతును మాత్రమే స్వీకరించామన్న టివికె

అవినీతి ప్రక్షాళనపై విజయ్‌ఫోకస్.. లంచం అడిగిన విడియో అందిస్తే లక్ష బహుమతి

**చెన్నై, మే 20:**తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి పట్టుమని పది రోజులు కూడా కాకముందే, దాని స్థిరత్వంపై ఆందోళనలు మొదలయ్యాయి. అధికార కూటమిలోని కీలక మిత్రపక్షమైన సీపీఎం చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత బలాన్నిచ్చాయి. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను కూటమిలో చేర్చుకుంటే తమ మద్దతుపై పునరాలోచించాల్సి వస్తుందని సీపీఎం స్పష్టంగా హెచ్చరించింది. బుధవారం మీడియాతో మాట్లాడిన సీపీఎం నేతలు, అన్నాడీఎంకే వర్గాన్ని ప్రభుత్వంలో భాగం చేయడం ప్రజాతీర్పునకు విరుద్ధమని అన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు డీఎంకే, అన్నాడీఎంకే రెండు పార్టీలనూ తిరస్కరించారని గుర్తుచేశారు. అన్నాడీఎంకేను చేర్చుకోవడం విజయ్ ఇచ్చిన క్లీన్ గవర్నెన్స్ హామీకి కూడా వ్యతిరేకమని తెలిపారు. తమిళనాడు మరో ఎన్నికను ఎదుర్కోకూడదని, గవర్నర్ పాలన ద్వారా బీజేపీ వెనుక దారిలో అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతోనే మేము టీవీకేకు మద్దతిస్తున్నామని సీపీఎం వివరించింది. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు మే 4న వెలువడగా విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం 234 స్థానాలకు గానూ 108 స్థానాలు గెలుచుకుంది. మెజారిటీకి 10 సీట్లు తక్కువయ్యాయి. ఆ తర్వాత కాంగ్రెస్ 5, లెఫ్ట్ ఫ్రంట్, వీసీకే, ఐయూఎంఎల్ (8) పార్టీల మద్దతుతో విజయ్ ప్రభుత్వం ఏర్పడింది. ఈనెల 13న జరిగిన విశ్వాస పరీక్షలో విజయ్‌కు 144 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించింది. ఇందులో పార్టీ అధినేత పళనిస్వామి విప్‌ను ధిక్కరించి 24 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు విజయ్‌కు ఓటు వేశారు. వారిపై అనర్హత వేటు వేయాలని అన్నాడీఎంకే చర్యలు చేపట్టింది. విశ్వాస పరీక్షకు ముందు విజయ్ ఈ రెబల్ ఎమ్మెల్యేలతో సమావేశం కావడం గమనార్హం. ఇప్పుడు వారి మద్దతే అధికార కూటమిలో సీపీఎం రూపంలో కొత్త తలనొప్పికి కారణమైంది.

**అన్నాడిఎంకెను ప్రభుత్వంలోకి తీసుకురావడంలేదు!**

విశ్వాసపరీక్షలో టివికెకు మద్దతు పలికిన అన్నాడిఎంకె ఎమ్మెల్యేలను కేబినెట్‌లోకి తీసుకోవడం లేదని విజయ్ పార్టీ టివికెప్రకటించింది. ఇందుకు సంబంధించి మంత్రి అధవ్ అర్జున్ స్పష్టత ఇచ్చారు. ఇప్పటికిప్పుడు ఆప్రతిపాదన ఏదీలేదని, ముందుగా మద్దతు ప్రకటించిన పార్టీలతోనే తమ అధినేత ముందుకు వెళతారని, ఇదే తమ పార్టీ నిర్ణమని అధవ్ అర్జున్ ప్రకటించారు.

**అవినీతిపై ఫిర్యాదుచేస్తే రూ.1లక్ష బహుమతి..**

ఇదిలా ఉంటే విజయ్ తన సరికొత్తపంథాలో ముందుకు పోతున్నారు. అవినీతిని సమూలంగా ప్రక్షాళనచేసే లక్ష్యంతో ఎవ్వరైనా సరే ప్రభుత్వశాఖల్లో కనీసం రూ.1000 లంచం అడిగినా ఫిర్యాదు చేయాలని కోరారు. ఇలా ఫిర్యాదుచేసిన వారికి విచారణలో లంచం రుజువైతే వారికి లక్ష రూపాయలు బహుమతి ఇస్తామని ప్రకటించడంతో ఇపుడు ప్రభుత్వశాఖల్లో వణుకు ప్రారంభం అయింది. ప్రభుత్వ అధికారి కనీసం వెయ్యి రూపాయల లంచం డిమాండ్ చేసినా సరే, బాధితులు ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. బాధితులు చేయాల్సిందల్లా లంచం అడుగుతున్న అధికారి వీడియోను రహస్యంగా చిత్రీకరించి, దానిని ఆధారంగా చూపిస్తూ అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) రిపోర్ట్ చేయడమే. ఫిర్యాదులో నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాత సమాచారం అందించిన వారికి లక్ష రూపాయల బహుమతిని అందజేస్తారు.

## మంత్రులకు శాఖలు కేటాయించిన సిఎం సతీశన్!



**తిరువనంతపురం,మే 20:** కేరళంలో కొత్తగా ఏర్పాటైన యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం క్యాబినెట్ మంత్రులకు శాఖలను కేటాయించింది. ముఖ్యమంత్రి వి.డి.సతీశన్ ఆర్థిక, న్యాయ, సాధారణ పరిపాలన, ఓడరేవుల వంటి ప్రధాన శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేశ్ చెన్నితాలకు కీలకమైన హోంశాఖ, విజిలెన్స్ శాఖలతో పాటు మరో మూడు శాఖలను కేటాయించారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)కు చెందిన పి.కె.కున్హాలికుట్టికి పరిశ్రమలు, సమాచార సాంకేతికత, వస్త్ర పరిశ్రమలు సహా ఏడు శాఖలను అప్పగించారు. కేరళం కాంగ్రెస్ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు విద్యుత్, పర్యావరణ శాఖలను కేటాయించగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె.మురళీధరన్‌కు ఆరోగ్య, దేవస్వం శాఖలను ఇచ్చారు. రోజి ఎం.జాన్‌కు ఉన్నత విద్యా శాఖను అప్పగించగా ఎ.పి.అనిల్ కుమార్‌కు ల్యాండ్, రెవెన్యూ శాఖలను అప్పగించారు. రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎమ్మెల్యే శిబు బేబీ జాన్‌కు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి శాఖలను కేటాయించారు. నీటిపారుదల, భూగర్భ జలాలు, నీటి సరఫరా, పారిశుద్ధం, గృహనిర్మాణ శాఖలను కేరళ కాంగ్రెస్ (జోసెఫ్) శాసనసభ్యుడు మోన్స్ జోసెఫ్‌కు అప్పగించారు. ఈ నెల 18న కేరళం కొత్త ముఖ్యమంత్రిగా వి.డి.సతీశన్ ప్రమాణస్వీకారం చేయగా ఆయనతోపాటు మరో 20 మంది మంత్రులుగా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే.



## బ్రిటన్ రాయల్ సొసైటీలో సౌమ్యస్వామినాథన్‌కు అరుదైన గౌరవం

**బ్రిటన్, మే 20:**భారత రత్న ఎంఎస్ స్వామినాథన్ అడుగుజాడల్లోనే ఆయన కూతురు సౌమ్య స్వామినాథన్ వెళుతున్నారు. తండ్రికి తగ్గ తనయగా అవతరించారు. బ్రిటన్‌కు చెందిన ద రాయల్ సొసైటీలో ఆమె అత్యంత అరుదైన గౌరవం దక్కింది. ఫెలో ఇన్ రాయల్ సొసైటీగా సౌమ్య స్వామినాథన్ ఎంపికయి భారతీయ ప్రఖ్యాత శాస్త్రవేత్తల్లో ఆమె నిలిచారు. రాయల్ సొసైటీ ఫెలోగా ఆమెను మంగళవారం ఎంపిక చేశారు. రాయల్ సొసైటీ ప్రపంచంలోనే ఓల్డెస్ట్ సైంటిఫిక్ అకాడమీ. అత్యంత ప్రతిభావంతులైన సైంటిస్టులకు మాత్రమే ఆ సొసైటీలో ఫెల్లోగా ఎంపికయ్యే అవకాశం దక్కుతుంది. రాయల్ సొసైటీలో సౌమ్య తండ్రి ఎంఎస్ స్వామినాథన్ కూడా ఫెలోషిప్ అర్హత సాధించారు. ఐజాక్ న్యూటన్ లాంటి శాస్త్రవేత్తలు ఉన్న రాయల్ సొసైటీ లీగ్‌లో సౌమ్య చేరారు. రాయల్ సొసైటీ ఫెలోషిప్‌కు సౌమ్య ఎంపికైన విషయాన్ని సీఎస్ఐఆర్ మాజీ అధ్యక్షుడు రఘునాత్ మస్లేకర్ ప్రకటించారు. ఎఫ్ఆర్ఎస్‌గా డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. శాస్త్రవేత్తలకు లభించే అత్యంత ఉన్నత గౌరవం ఇదే అని ఆయన అన్నారు. సౌమ్య తండ్రి భారత రత్న ఎంఎస్ స్వామినాథన్ కూడా ఎఫ్ఆర్ఎస్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. భారత్‌కు చెందిన తండ్రీకూతుళ్లు రాయల్ సొసైటీ ఫెలోషిప్ సాధించడం ఇదే మొదటిసారి అన్నారు. రాయల్ సొసైటీ 1660లో స్థాపించారు. శాస్త్రవేత్తలను గుర్తించడం, సైన్స్‌ను ప్రమోట్ చేయడం, ఆ రంగంలోని నిష్ణాతులను గౌరవించడం లాంటి కార్యక్రమాలను రాయల్ సొసైటీ చేస్తోంది. మానవాళికి ఉపయోగపడే సైన్సును వృద్ధి చేస్తోంది. సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ సొసైటీలో అర్హత సాధించిన భారతీయ రెండో మహిళా శాస్త్రవేత్తగా సౌమ్యా స్వామినాథన్ నిలిచారు. ఎఫ్ఆర్ఎస్ పొందిన తొలి మహిళా శాస్త్రవేత్తగా ప్రొఫెసర్ గగన్‌దీప్ కంగ్‌కు ఉంది. 2019లో ఆమె ఆ సొసైటీకి ఎంపికయ్యారు. ప్రఖ్యాత సైంటిస్టులు, ఇంజినీర్లు, టెక్నాలజిస్టులకు రాయల్ సొసైటీలో ఫెలోషిప్ కల్పిస్తారు.

## సంక్షిప్తంగా..

### విజయవంతంగా 'సూర్యాస్త్ర' పరీక్ష



**న్యూఢిల్లీ, మే20:** స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. ప్రైవేట్ రంగ రక్షణ సంస్థ అయిన నిబె లిమిటెడ్ తన సుదూర రాకెట్ వ్యవస్థ సూర్యాస్త్ర ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఒడిశాలోని చాందీపుర్ టెస్టింగ్ రేంజ్ నుంచి ఈ పరీక్షను చేపట్టింది. 150-300 కి.మీ. దూరంలోని లక్ష్యాలపై దాడి చేయగల రెండు రకాల సూర్యాస్త్ర రాకెట్ వేరియంట్లను పరీక్షించింది. 1.5 మీటర్ల నుంచి 2 మీటర్ల కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేధించినట్లు అధికారులు వెల్లడించారు. దీనిని కొనుగోలు చేయడానికి భారత సైన్యం ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. సూర్యాస్త్ర అనేది సుదూర గైడెడ్ రాకెట్ ఫిరంగి వ్యవస్థ. శత్రు భూభాగంలోని స్థావరాలు, కమాండ్ సెంటర్లు, రాడార్ కేంద్రాలు లాజిస్టిక్స్ హాబ్‌లపై దాడులు చేయడానికి దీనిని రూపొందించారు.

### డ్రోన్ ద్వారా యుఎల్‌పిజిఎం-వి3 క్షిపణి పరీక్ష



**న్యూఢిల్లీ, మే 20:** డిఆర్డీవో కీలక పరీక్ష చేపట్టింది. యుఎల్‌పిజిఎం-వి3 క్షిపణిని విజయవంతంగా టెస్ట్ చేసింది. గగనతలం నుంచి భూమిపై, గగనతలం నుంచి గగనతలంలో ఉన్న టార్గెట్లను ఆ డ్రోన్ మిస్సైల్ ద్వారా పేల్చేశారు. కర్నూలు జిల్లాలోని డిఆర్‌డీవో రేంజ్ సెంటర్‌లో ఈ పరీక్ష చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ గ్రౌండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఈ పరీక్ష నిర్వహించారు. యుఎల్‌పిజిఎం వెపన్ సిస్టమ్‌ను జిసిఎస్ కమాండ్, కంట్రోల్ ద్వారా వినియోగించనున్నట్లు రక్షణశాఖ ప్రతినిధి తెలిపారు. జిసిఎస్ టెక్నాలజీతో లాంచ్ ఆపరేషన్స్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీ లిమిటెడ్ కంపెనీలతో కలిసి డిఆర్డీవో పనిచేసింది.

### పాక్ రాజకీయాలు అక్కడి ప్రజలకు సంబంధించినవే: అమెరికా

**న్యూఢిల్లీ, మే 20:** పాకిస్థాన్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందంటూ ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే వీటిపై తాజాగా అమెరికా విదేశాంగశాఖ స్పందించింది. ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించిన విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. పాక్ దౌత్యవేత్త అసద్ మజీద్‌ఖాన్, అమెరికా నాటి అసిస్టెంట్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డొనాల్డ్ లూ మధ్య జరిగిన సంభాషణను పాక్ ఇన్వెస్టిగేటివ్ పత్రిక ప్రచురించింది. దీనిపై అమెరికా విదేశాంగ ప్రతినిధి ఒకరిని మీడియా ప్రశ్నించగా ఇమ్రాన్ తొలగింపు వెనుక అమెరికా హస్తం ఉందనే వార్తలను ఆయన తోసిపుచ్చారు. పాక్ రాజకీయాలు అక్కడి ప్రజలకు సంబంధించివేనని స్పష్టం చేశారు.

### పార్లే ఇండస్ట్రీ షేర్లు పెంచేసిన మోడీ 'మెలోడి' గిఫ్ట్!

**న్యూఢిల్లీ, మే 20:** ప్రధాని నరేంద్ర మోడీ ఇటలీ ప్రధాని మెలోనికి పార్లే మెలోడీ చాక్లెట్ గిఫ్ట్ ఇచ్చిన వీడియో సోషల్ మీడియాను కుదిపేసింది. అయితే ఈ వైరల్ వీడియో స్టాక్ మార్కెట్‌లో ఊహించని అలజడి సృష్టించింది. ఒకేలా ఉన్న పేరును చూసి ఇన్వెస్టర్లు తొందరపడి తప్పుడు కంపెనీ షేర్లను కొనేశారు. మోడీ చాక్లెట్ ప్యాకెట్ ఇచ్చిన వీడియో బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే దలాల్ స్ట్రీట్‌లో హల్‌చల్ మొదలైంది. పార్లే ఇండస్ట్రీస్ అనే కంపెనీ షేర్లు ఇంట్రాడేలో దాదాపు 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. గత వారం రోజులుగా ఈ పెన్నీ స్టాక్ ఏకంగా ఏడు శాతం లాభపడింది. అంతా బానే ఉన్నా ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ ఉంది. కంపెనీ వేరు చాక్లెట్ వేరు, మనందరికీ తెలిసిన ఫేమస్ మెలోడీ చాక్లెట్‌ను తయారు చేసేది పార్లే ప్రొడక్ట్స్ అనే ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ.

### ట్రంప్ అధికారాలకు కత్తెరవేసే తీర్మానానికి ఆమోదం!

**వాషింగ్టన్, మే 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సొంత పార్టీలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై సైనిక చర్యలకు దిగే విషయంలో అధ్యక్షుడి అధికారాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన వార్ పవర్స్ తీర్మానాన్ని అమెరికా సెనేట్ ఆమోదించింది. ముందురోజు జరిగిన ఓటింగ్‌లో 55-45 ఓట్ల తేడాతో ఈ తీర్మానం నెగ్గింది. అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన 8 మంది సెనేటర్లు డెమోక్రాట్లతో కలిసి ఈ తీర్మానానికి మద్దతు పలకడం అధ్యక్షుడికి పెద్ద షాక్‌గా మారింది. ఇరాన్ టాప్ జనరల్ ఖాసీం సులేమానీపై డ్రోన్ దాడికి ట్రంప్ ఏకపక్షంగా ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇరాన్‌తో యుద్ధానికి దిగకుండా అధ్యక్షుడిని నిరోధించాలనే లక్ష్యంతో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

## మైనార్టీలు, చిరువ్యాపారులను టార్గెట్‌చేస్తున్న బిజెపి

### మాజీ సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కత్తా, మే 20:** బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ త్వరలోనే కేంద్రంలో అధికారం కోల్పోవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. మంగళవారం తన నివాసంలో టీఎంసీ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలు, వీధి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటోందని మమత ఆరోపించారు. మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వీధి వ్యాపారుల దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాజ్యాంగ విలువలను కాలరాస్తోందని ఆమె విమర్శించారు. ఇదే సమావేశంలో పాల్గొన్న టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ కూడా బీజేపీకి సవాల్ విసిరారు. తన ఇంటిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన నోటీసులపై ఆయన ఘాటుగా స్పందించారు. వారు నా ఇల్లు కూల్చినా సరే ఇలాంటి బెదిరింపులకు నేను తలొగ్గేది లేదు. ఏదేమైనా బీజేపీపై నా పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నోటీసులు జారీ చేసిన కేఎంసీ ఇప్పటికీ టీఎంసీ నియంత్రణలోనే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా సీఎం సువేందు అధికారిపై అభిషేక్ పరోక్షంగా విమర్శలు చేశారు. కెమెరా ముందు డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారని 2014 నాటి నారద స్టింగ్ ఆపరేషన్‌ను ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం సృష్టిస్తున్న బుల్డోజర్ వ్యతిరేకంగా భారీ నిరసన.

## జమిలి ఎన్నికలతో రూ.7లక్షల కోట్ల ప్రజాధనం ఆదా :జెపిసి ఛైర్మన్ ఎంపి పిపి చౌదరి!

**గాంధీనగర్, మే 20:** దేశంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని అమలు చేస్తే సుమారు రూ.7 లక్షల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జేపీసీ) ఛైర్‌పర్సన్, లోక్‌సభ ఎంపీ పీపీ చౌదరి తెలిపారు. ఈ విధానం వల్ల దేశ జీడీపీ వృద్ధి రేటు 1.5 శాతం నుంచి 1.6 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. మంగళవారం గాంధీనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.దేశంలో నిరంతరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండటంతో దేశం ఖిఎన్నికల మోడ్ఖిలోనే ఉంటోందని, దీనివల్ల పాలన, అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని చౌదరి అన్నారు. 1967 వరకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగేవని, కానీ కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు ముందుగా రద్దు కావడంతో ఈ క్రమం తప్పిందని గుర్తుచేశారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించి, ఆ తర్వాత 100 రోజుల్లోగా పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలను పూర్తి చేయాలని తమ కమిటీ సిఫార్సు చేస్తోందని వివరించారు. తరచూ ఎన్నికల వల్ల ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు కేటాయించాల్సి వస్తోందని, దీనివల్ల పాలనాపరమైన పనులు, విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకంపై ఆధారపడిన ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఎన్నికల వల్ల నష్టపోతోందని పేర్కొన్నారు. జమిలి ఎన్నికల ప్రతిపాదన రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గానీ, సమాఖ్య వ్యవస్థకు గానీ విరుద్ధం కాదని మాజీ ప్రధాన న్యాయమూర్తులు, సీనియర్ న్యాయ నిపుణులు అభిప్రాయపడినట్లు చౌదరి తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తృత సంప్రదింపుల తర్వాత 18వేల పేజీలకు పైగా నివేదికను సిద్ధం చేస్తున్నామని, పార్టీ రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ ప్రయత్నం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## ఈశాన్యంలోని 'చికెన్‌నెక్' భూమి కేంద్రానికి బదలీ!

### పశ్చిమబెంగాల్ ప్రభుత్వం సంచలన నిర్ణయం




**కోల్‌కత్తా, మే 20:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చికెన్స్ నెక్‌గా పిలిచే సిలిగురి కారిడార్‌లోని 120 ఎకరాల భూమిని కేంద్రానికి బదిలీ చేయాలని నిర్ణయించింది. దేశంలోని మిగిలిన ప్రాంతాలను ఈశాన్య భారత్‌తో కలిపే ఏకైక భూమార్గం సిలిగురి కారిడార్. సంఘర్షణ లేదా సంక్షోభ సమయాల్లో భారతదేశానికి కాకుండా బంగ్లాదేశ్‌కు ఇది మద్దతుగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని బెంగాల్ ప్రభుత్వం ఏడు జాతీయ రహదారులను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా,నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించాలని నిర్ణయించింది. క్యాబినెట్ సూత్రప్రాయంగా ఆమోదం తెలపడంతో పలు జాతీయ రహదారి ప్రాజెక్టులపై దీర్ఘకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. హైవే 31,32,32తో సహా కీలక రహదారుల బాధ్యత ఇకపై హైవే అథారిటీ పరిధిలోకి వెళ్తాయి. సేవక్-కరోనేషన్ బ్రిడ్జ్ మార్గం, హాసిమారా-జైగావ్ మార్గం, చాంగ్రాబంధా కారిడార్ వంటి ప్రాజెక్టులను హైవే అథారిటీ పర్యవేక్షిస్తుంది. ఈ ప్రాజెక్టులు దాదాపు ఏడాదిగా రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయని సమాచారం. ఇప్పుడు అనుమతి లభించడంతో కేంద్ర సంస్థలు రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయగలవు.

21-5Pg6exHMNWJQE.qxd:21-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:15 AM Page 1





# శ్రీరాంపురంలో దారుణం

**● ప్రేమ పెళ్లి చేసుకున్న జంటను, వారి కుటుంబాలను వెలివేసిన గ్రామ పెద్దలు**

**● నిబంధనలు ధిక్కరిస్తే రూ.2 లక్షల జరిమానా విధిస్తామని ఊరిలో చాటింపు**

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లాలో శ్రీరాంపురం సంచలనం చోటు చేసుకుంది. ప్రేమ పెళ్ళి చేసుకున్న జంటను వాళ్ళకుటుంబాలని సామాజిక బహిష్కరణ (వెలివేత) గ్రామపెద్దల ముసుగులో కొన్ని అరాచకశక్తులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన తేజ, నాగలక్ష్మి అనే యువతీయువకులు ప్రేమ వివాహం చేసుకున్నారు,. వీరి పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించిన గ్రామ కుల పెద్దలు, సదరు జంటతో వెలివేసారు. వారి ప్రేమను అంగీకరించినందుకు తల్లిదండ్రుల కుటుంబాలను సామాజికంగా వెలివేస్తూ అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. ఆ కుటుంబాలతో గ్రామంలో ఎవరూ మాట్లాడకూడదని, వారి ఇళ్లకు వెళ్లకూడదని, నిబంధనలు ధిక్కరిస్తే ఏకంగా రూ.2 లక్షల భారీ జరిమానా విధిస్తామని ఊరిలో చాటింపు వేయించారు. పెద్దల వేధింపులు భరించలేక ప్రేమ జంట ఊరు విడిచి వెళ్లిపోయినప్పటికీ, ఇక్కడ మిగిలిపోయిన అమ్మాయి కుటుంబానికి మాత్రం కష్టాలు తీరలేదు. ఇటీవల ఆ జంటకు బాబు పుట్టడంతో కుటుంబ సభ్యులు బారసాల వేడుక నిర్వహించారు. అయితే ఆ వేడుకకు ఎవరూ వెళ్లకూడదని గ్రామ పెద్దలు మరోసారి ఆంక్షలు విధించారు. చివరికి శుభలేఖలు ఇవ్వడానికి వెళ్లిన కుటుంబ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గ్రామ తీర్పును ఉల్లంఘించారనే నెపంతో రూ.2 లక్షలు జరిమానా కట్టాలని హుకుం జారీ చేశారు. ఈ అన్యాయంపై బాధితులు మైలవరం పోలీసులను ఆశ్రయించినా సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోరంపై సామాజిక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, గ్రామాల్లో ఇలాంటి సమాంతర న్యాయస్థానాలు నడుస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాయడంపై మానవ హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనాగరిక చర్యలకు పాల్పడిన గ్రామ పెద్దలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రేమ పేరుతో వివాహితకు వేధింపులు

# యువకుడికి దేహాశుద్ధి

**● అరగుండు గీయించి చెప్పుల దండతో ఊరేగింపు**

**● అనంతపురం జిల్లా గడేకల్లులో ఘటన**



**ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో వివాహితను వేధిస్తున్నాడంటూ గ్రామస్థులు కొందరు అదే గ్రామానికి చెందిన యువకుడికి దేహాశుద్ధిచేసి అరగుండు గీయించి చెప్పుల దండవేసి గ్రామంలో ఊరేగించిన ఘటన విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామంలో చోటు చేసుకోగా సంచలనం రేకెత్తిస్తోంది. ఊరేగింపు ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లో వెళితే...గ్రామానికి చెందిన వివాహితను ప్రేమ పేరుతో గత కొంత కాలంగా వేధిస్తున్నాడంటూ మంగళవారం గ్రామస్థులు కొందరు యువకుడికి దేహాశుద్ధి చేసి అతనికి బలవంతంగా అరగుండు గీయించి మెడలో చెప్పుల దండవేసి డప్పుల నడుమ గ్రామంలో ఊరేగించారు. ఈ ఘటనను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్‌గా మారి సర్వత్రా చర్చకు దారి తీసింది. యువకుడిని ఇలా శిక్షించడం ఎంతవరకు సమంజమని కొందరు ప్రశ్నిస్తుండగా ఇది సమంజసమేనని మరికొందరు నెటిజన్లు చెబుతున్నారు. నిజంగా అతను తప్పుచేసి ఉంటే పోలీసులకు పిర్యాదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని ఇలా అమానుషంగా వ్యవహరించ రాదని మానవతా వాదులు అంటున్నారు. ఈ విషయమై విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుసేన్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా ఘటన తమ దృష్టికి రాగా విచారణ జరుపుతున్నామన్నారు. ఇప్పటివరకు తమకు ఎవరూ పిర్యాదు చేయలేదని బాధితుడు పిర్యాదు చేస్తే కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

# ఉపాధి కోసం వెళ్తే... విక్రయించాడు

**● నా బిడ్డను రక్షించి ఇండియాకు తీసుకురండి ● పీలేరు చిన్నబ్బను కఠినంగా శిక్షించండి ● బాధిత తల్లిదండ్రులు వేడుకోలు**



**చంద్రగిరి (తిరుపతి జిల్లా), మే 20 ప్రభాతవార్త:** బ్రతుకుదెరువు కోసం కన్నవాళ్ళను వదలి కువైట్‌లో పని కోసం వెళ్ళాలని కోరిన తమ కుమార్తె భాగ్యవతిని పీలేరుకు చెందిన ఏజెంట్ చిన్నబ్బ ఓ షేట్‌కు విక్రయించినట్లు బాధిత మహిళ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తొండవాడ పంచాయతీ, గోపాల పురంకు చెందిన టి.తులశమ్మ, చెంగయ్యల కుమార్తె భాగ్యవతి కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా కువైట్‌లో పని కోసం చిన్నబ్బను సంప్రదించగా, ఓ సేట్ ఇంట్లో పనిమనిషిగా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికాడు. అవసరమైన అన్ని వెరిఫికేషన్స్ పూర్తి చేసుకుని కువైట్‌కు వెళ్ళిన భాగ్యవతికి ఇంట్లో పనికాకుండా వేర్వేరు పనులు చెబుతూ, సేట్లు ఆమెను ఇల్లులు మార్చుతూ 6 మాసాలుగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు వీడియో ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఎంఎల్ఏ పులివర్తి నాని తనను రక్షించాలని వేడుకున్నారు. ఈ సేట్ నుండి విడిపించి ఇండియాకు తీసుకెళ్ళమని బాధితురాలు కన్నీటిపర్యంతమయ్యారు. తమ కుమార్తెను రక్షించి, చిన్నబ్బపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**నిందితుడి కోసం ముమ్మర గాలింపు:** బాధిత మహిళ తల్లిదండ్రుల నుండి ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. లభించిన ఆచూకీ మేరకు ప్రత్యేక బృందాన్ని పంపి విస్తృతంగా తనిఖీ చేపట్టారు. నిందితుడిని అరెస్ట్‌చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## కువైట్‌లో చిక్కుకున్న చంద్రగిరి మహిళకు అండగా ప్రభుత్వం

**● బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని సిఎం చంద్రబాబు ఆదేశం**

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన భాగ్యవతి కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే మీడియా కథనాలపై ముఖ్యమంత్రి కార్యాలయం తక్షణం స్పందించింది. బాధిత మహిళను సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి అత్యవసర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఉపాధి కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో కువైట్‌కు వెళ్లిన భాగ్యవతి అక్కడ గృహ సహాయకురాలిగా పనిచేస్తుండగా, ఉద్యోగ వీసా కల్పించకుండా ఏజెంట్లు నిర్లక్ష్యం చేసినట్టు తెలిసింది. అంతేకాకుండా తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్టు కుటుంబ సభ్యులకు, సోషల్ మీడియా ద్వారా బాధితురాలు సెల్ఫీ వీడియో ద్వారా తెలియజేశారు. స్వదేశానికి తిరిగి పంపించాలని కోరితే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆమె ఆ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో ఏపీ ఎన్ఆర్టీ వెంటనే స్పందించి, కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపింది. బాధితురాలి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ఆమెను తక్షణం స్వదేశానికి రప్పించే దిశగా ప్రయత్నిస్తోంది. అదేవిధంగా సంబంధిత ఏజెంట్ల పాత్రపై విచారణ చేపట్టాలని, అవసరమైతే న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. తిరుపతి జిల్లా యంత్రాంగం, చంద్రగిరి పోలీస్ స్టేషన్ అధికారులు కూడా భాగ్యవతి కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ భరోసా ఇచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, భాగ్యవతి సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చే వరకు అన్ని విధాల సహకారం అందిస్తామని ఆమె కుటుంబ సభ్యులకు అధికారులు తెలిపారు.

# ప్రజల ప్రాణాలతో జగన్ మద్యం కుట్ర సిగ్గుచేటు

**● ప్రాణాలు తీసి ప్రభుత్వంపై బురద జల్లాలనుకున్నారు ● మంత్రి కొల్లు రవీంద్ర**



**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** చిత్తూరు జిల్లా మొలకల చెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం కల్తీ మద్యం తయారీ వైసీపీ అరాచకానికి, క్షుద్ర రాజకీయానికి నిలువెత్తు నిదర్శనమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పారదర్శకమైన మద్యం పాలసీని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కుట్రలు చేయడం సిగ్గుచేటు. సిట్ విచారణలో గొడ్డలి పార్టీ బండారం మొత్తం బట్టబయలైంది. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రలో భాగంగానే కల్తీ మద్యం తయారు చేసి, మద్యం షాపులకు అమ్మినట్లు దర్యాప్తు సంస్థలు తేల్చాయి. మనిషి ప్రాణం కంటే రాజకీయమే ముఖ్యం అనేలా జోగి రమేష్‌ను అడ్డం పెట్టుకుని జగన్ రెడ్డి నీచానికి తెగబడ్డాడు. అద్దేపల్లి జనార్ధన్, జగన్మోహన్ ద్వారా జోగి రమేష్ కల్తీ మద్యం తయారు చేసి ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టారు. గతంలో సొంత బాబాయిని గొడ్డలిపోటు పొడిచిన జగన్ రెడ్డి.. ఆ నిందను చంద్రబాబుపై నెట్టేందుకు ప్రయత్నించాడు. నారాసుర రక్త చరిత్ర అంటూ చంద్రబాబు గారి చేతిలో భారీ కత్తి పెట్టి ఫోటోలు వేశారు. అధికారంలోకి వచ్చాక కేసు విచారణను నీరు గార్చారు. 2019 ఎన్నికల్లో మద్య నిషేధం పేరుతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక కల్తీ మద్యం తీసుకొచ్చి ప్రజల జేబులు కొల్లగొట్టారు. వేలాది మంది ప్రాణాలు తీశారు. లక్షలాది మంది కిడ్నీ, లివర్, బ్రెయిన్ సమస్యలతో ఆస్పత్రుల్లో ప్రాణాలతో కొట్టుమిట్టాడేలా చేశారు. గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణం జరిగినట్లు కోర్టులు కూడా నిర్ధారించాయి. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పారదర్శకమైన మద్యం పాలసీ తీసుకురావడంతో కడుపు మంటతో జగన్ రెడ్డి కుట్రలకు తెరలేపాడు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఐదు ఖండాల్లోనూ అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించిన జగన్ రెడ్డి.. ఇప్పుడు ఐదు రాష్ట్రాల సంబంధాలతో కల్తీ మద్యాన్ని రూపొందించాడు. పాస్టర్లతో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. జోగి రమేష్ అక్రమ కల్తీ మద్యం వ్యవహారం మొత్తం తాడేపల్లి ప్యాలెస్ నుండే జరిగింది. గతంలో ప్రతి నాలుగు మద్యం బాటిళ్లలో ఒకటి కల్తీ అన్న జగన్ రెడ్డి.. ఇప్పుడు జోగి వ్యవహారంపై ఎందుకు నోరు మెదపడం లేదు? గతంలో చంద్రబాబు గారి ఇంటిపై దాడి చేసిందుకు మంత్రి పదవి ఆఫర్ చేశాడు. ఇప్పుడు ఏ ఆఫర్ ఇచ్చి జోగి రమేష్‌ను అడ్డం పెట్టుకుని కల్తీ మద్యం పన్నాగం పన్నారో సమాధానం చెప్పాలి. జగన్ రెడ్డి లాంటి రక్త పిశాచాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఐదేళ్ల అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో చేయాల్సిన అరాచకాలన్నీ చేశారు. ఇప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నాడు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారదర్శకమైన మద్యం పాలసీని అమలు చేశాం. ట్రాక్ అండ్ ట్రేస్ విధానంతో ప్రతి మద్యం బాటిల్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించాం. ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడుతూ.. మద్యం పాలసీని అమలు చేస్తున్నాం. కల్తీ అనే మాటకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. జగన్ రెడ్డికి ఏ మాత్రం బాధ్యత ఉన్నా జోగి రమేష్ విషయంలో సమాధానం చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు.

# డబుల్ ఇంజిన్ సర్కారు దగా చేస్తోంది

**● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు**



**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, మత్స్యకారులు, పొగాకు రైతుల సమస్యలు, జనాభా పాలసీ వంటి అంశాలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మీడియా సమావేశం నిర్వహించారు. వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డబుల్ ఇంజన్ సర్కార్ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వలన ప్రజలపై ప్రత్యేక్షంగా, పరోక్షంగా భారాలు పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికే లారీ, ఆటో, ప్రైవేటు ట్రాన్స్పోర్ట్ ట్రాన్స్ వాహనదారులు నిరసనలకు పిలుపు నిచ్చాయని పేర్కొన్నారు. వారి నిరసనలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. వామపక్షాలు, సాధారణ ప్రజలు వివిధ రూపాల్లో నిసనలు వ్యక్తం చేశామని, అయినా ప్రభుత్వాలు ధరలు పెంచుతూనే ఉన్నాయని మండిపడ్డారు. ధరల పెంపుకు కారణం యుద్ధం అని చెబుతున్నారని, కానీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల వలనే ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. రష్యా, ఇరాన్ దగ్గర ఆయిల్ కొనకుండా, అమెరికా కంపెనీల నుండి కొనుగోలు చేయడం వలనే ఈ దుస్థితి వచ్చిందని తెలిపారు. రష్యా 56డాలర్లకు ఆయిల్ ఇస్తుంటే అమెరికా కంపెనీల నుండి 120డాలర్లు పెట్టి ఆయిల్ ను కేంద్రం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇది అమెరికాకు మోడీ ప్రభుత్వం లొంగిపోవడం వలనే జరుగుతుందని ఆగ్రహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పన్నుల పేరుతో భారీగా పన్నులు విధిస్తున్నారని శ్రీనివాసరావు మండిపడ్డారు. లీటర్ పెట్రోల్ రూ.113 అయితే రూ.59 పన్నులేనని, ఇది తుగ్లక్ పన్నుల విధానాన్ని సూచిస్తుందని మండిపడ్డారు. వెంటనే ప్రజలపై భారాలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. రమాదేవి మాట్లాడుతూ కోస్తాతీరంలో మత్స్యకారుల రక్షణే ప్రభుత్వ విధానంగా ఉండాలని డిమాండ్ చేశారు. మోసకారి విధానాలకు ముగింపు పలికి మత్స్యకారులకు మేలు చేసే విధానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు దగా చేస్తుందన్నారు.

# చంద్రబాబు పాలనంతా అబద్దాలు, అప్పులు, మోసాలు

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల సమయంలో రాష్ట్రంలోనే పెట్రో ధరలు అధికమని తాము అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తామని ప్రకటించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ వెంటనే ఆ పని చేయాలని విశాఖ జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు కెకె రాజు డిమాండ్ చేశారు. నాడు పెట్రో ధరలు ప్రస్తావిస్తూ, నానా హంగామా చేసిన తండ్రీ కొడుకులు, ఇప్పుడు ఆనాటి మాదిరిగా పెట్రోల్ లింక్‌ల ముందు సెల్ఫీ దిగే దమ్ముందా? అని ఆయన సవాల్ చేశారు. రెండేళ్ల చంద్రబాబు పాలనంతా అబద్దాలు, అప్పులు, మోసాలే. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక, పాలన చేత కాక రెండేళ్లలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, అందుకే చెప్పుకోవడానికి ఏమీ లేక, డ్రామాలు రీల్స్‌తో సీఎం చంద్రబాబు కాలక్షేపం చేస్తున్నారని కెకె రాజు ఆక్షేపించారు. చంద్రబాబుకి 28 జిల్లాల ఏపీ కన్నా 29 గ్రామాల అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారమే ముఖ్యమని, అక్కడి నిర్మాణాలకు డీజిల్ కొరత రాకూడదని ఏకంగా రాష్ట్ర వ్యాప్తంగా డీజిల్ కొరత సృష్టించారని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కెకె రాజు దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ప్రజలకు మాయమాటలు చెప్పి, వారిలో భ్రమలు కల్పించి తప్పుడు హామీలతో చంద్రబాబు ఎలాగైతే అధికారంలోకి వచ్చాడో ,గడిచిన రెండేళ్లుగా అవే అబద్దాలను మోసాలతోనే పాలన సాగిస్తున్నాడు, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి జగన్‌పైనా, పార్టీపైనా దుష్ప్రచారంతో కాలక్షేపం చేస్తున్నాడు. రెండేళ్ల పాలనలో చేసిందేమీ లేకపోయినా మీడియా పబ్లిసిటీతో హడావుడి చేస్తున్నాడు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ ఛార్జీల భారంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే చంద్రబాబు మాత్రం పబ్లిసిటీ కోసం వీడియోలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని కెకె రాజు మండిపడ్డారు.

# నిధులు బొక్కి... ఎం-బుక్‌లు దహనం

**● కోట్లాది రూపాయల అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ**

**● సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర కమిషనర్ అధికారులకు ఆదేశం**

**సచివాలయం, మే 20 ప్రభాతవార్త:** గత వైసీపీ ప్రభుత్వంలో అధికారం ఉందని ప్రజల సొమ్ములను ఇష్టారాజ్యంగా పంచుకుతిన్నారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండల పరిధిలో దొరికిన కాడికి దోచుకొని అడ్డదిడ్డంగా వ్యవహరించారు. లేని పనులను ఉన్నట్లు భ్రమలు కల్పిస్తూ కనిపించని పనులకు కాగితాలను సృష్టించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి కోట్లాది రూపాయలను దిగమింగి, తీరా వాటాల పంపకాల్లో వచ్చిన తేడాలతో ఒకరి మీద మరోకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై రాష్ట్ర కమిషనరేట్లో ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు విచారణ వస్తున్నారని తెలిసి, దొంగచాటుగా సృష్టించిన ఎం-బుక్‌లు, రికార్డులను రాత్రికి రాత్రి దొంగలు పడి ఎత్తుకెళ్ళారని, వాటిని కాల్చివేసినట్లు నాటకాలు ఆడారు. 2019-24మద్య చిల్లకూరు మండలంలో జరిగిన అవినీతి, ఎం-బుక్‌లు, మినిట్స్ బుక్‌ల దహనం ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. వర్క్స్ కమిటీలను ఏర్పాటు చేయకుండా, అధికారికంగా ఎలాంటి తీర్మానాలు చేయకుండా, ఇష్టారాజ్యంగా చిల్లకూరు మండలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రస్తుత పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ కృష్ణతేజ ప్రత్యేక విచారణకు ఆదేశించారు. గత ప్రభుత్వంలో దోచుకుతిన్న అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు నాడు చిల్లకూరు ఎంపిడీవో కార్యాలయంలో పనిచేసిన పరిపాలనాధికారి, సీనియర్ అసిస్టెంట్, పీఆర్ ఇంజనీరింగ్, ఉపాధి అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయి.

**అసలేం జరిగిందంటే ..:** గత వైసీపీ ప్రభుత్వంలో 2019-24 మద్య చిల్లకూరు మండలంలో దాదాపు రూ.4.76 కోట్లకు పైగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. పంచాయితీ రాజ్ శాఖ అంతర్గత విచారణలోనూ, విజిలెన్స్ అధికారులు సైతం ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. గత ప్రభుత్వంలోని ఐదేళ్ళలో ఆ మండలంలో నలుగురు ఎంపిడివోలు విధులు నిర్వర్తించారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడీవో కార్యాలయం సిబ్బందిపై సైతం చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్ళకు లొంగి నామమాత్రపు చర్యలను మాత్రమే తీసుకున్నారు. పలువురు అధికారులకు మెమోలు ఇచ్చి వివరణ తీసుకొని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఎం-బుక్‌లు దొంగలెత్తుకెళ్ళి కాల్చేసారటా:** చిల్లకూరు మండలంలో జరిగిన అవినీతికి పరాకాష్ట ఎం-బుక్‌ల దొంగతనం, దహనం, మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది కలసి చేసిన కోట్లాది రూపాయల అవినీతికి సంబంధించిన ఎం-బుక్‌లు, మినిట్స్ బుక్‌లు కనిపించడకుండా పోయాయి. ఎప్పుడంటే వైసీపికే చెందిన నాటి ఎంపిపి వర్గీయులు జెడ్పీటీసీ వర్గీయుల మధ్య విభేదాలు రావడంతో అవినీతి గురించి ఒకరిపై మరోకరు ఫిర్యాదులు చేసుకున్నారు. నువ్వు ఇంత తిన్నావంటే, నువ్వేఅంత తిన్నావు అంటూ ప్రత్యక్ష దాడులకు తెగబడ్డారు. ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకోవడంతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడం, విచారణ కమిటీకి చెందిన అధికారులు వస్తున్నారని తెలిసి రాత్రికి రాత్రే రికార్డులు,ఎం-బుక్‌లను దొంగలు పడి దోచుకెళ్ళారని ఎంపిడివో కార్యాలయ సిబ్బంది ఫిర్యాలు చేయడం ఒక పక్కా ప్రణాళికతో సాగాయనే విమర్శలు నాటి వైసీపీ ప్రజాప్రతినిధులే ఒకరిపై మరోకరు విమర్శలు గుప్పించుకున్నారు. ఎంపిడివో కార్యాలయంలో పనిచేసే ఓ పరిపాలనాధికారి, మరో సీనియర్ అసిస్టెంట్‌లు ఈ రికార్డుల మాయం వెనుక హస్తం ఉందని నాడు తీవ్ర విమర్శలు వచ్చాయి.

**ఎఇ మృతి, డిఇపై చర్యలు తప్పవా?:** ఇంజనీరింగ్ విభాగంలో పనులు జరగకుండానే చేసినట్లు ప్రధాన ఆరోపణ, అయితే పనులను పర్యవేక్షించాల్సిన పీఆర్ ఇంజనీరింగ్ ఎఇ, డిఇలు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ళతో అడ్డదిడ్డంగా ఎం-బుక్‌లను తయారు చేశారనే విమర్శలు ఉన్నాయి. పనులు చేయకుండానే ఎం-బుక్‌లు తయారు చేసి ఎంపిడివో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్, పరిపాలనాధికారి అండతో ఎంపిడివోల ద్వారా కోట్లాది నిధులను డ్రా చేశారని విచారణలో వెల్లడైంది. అరోపణలు ఎదుర్కొన్న ఎఇ విచారణ సమయంలో మృతి చెందారు. అయితే డిఇపైన చర్యలకు పీఆర్ కమిషనర్ రంగం సిద్ధం చేస్తున్నారని సమాచారం. అవినీతికి పాల్పడటమే కాకుండా దొంగచాటుగా సృష్టించిన రికార్డులను సైతం మాయం చేసి వాటిని దహనం చేయడంపై కమీషనర్ సీరియస్‌గా ఉన్నారు. ఇలా బరితెగించే వారిని ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరికలు జారీ చేసేందుకు అవినీతికి పాల్పడిన ఎంపిడీవోలు, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది,పీఆర్ ఇంజనీరింగ్ అధికారులపై గట్టి చర్యలు తీసుకోవాలని కృతనిశ్చయంతో ఉన్నారు. అందుకు నిధులు బొక్కి..ఫైల్స్ దహనం చేసిన ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

# మహానాడులో అండమాన్‌పై తీర్మానం

**● 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని కమిటీ భేటీలో నిర్ణయం: సోమిరెడ్డి వెల్లడి**



**విజయవాడ, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ మహానాడులో 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. మంత్రి నారా లోకేశ్ టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత నిర్వహిస్తున్న తొలి మహానాడు కావడంతో ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ క్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే ఈ వార్షిక పండుగలో మొత్తం 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని కమిటీ నిర్ణయించినట్లు తీర్మానాల కమిటీ సభ్యుడు కూడా అయిన సోమిరెడ్డి వివరించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలతో పాటు తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు, అలాగే మహానాడు చరిత్రలోనే తొలిసారిగా అండమాన్ తెలుగు ప్రజల సమస్యలపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతుండటం విశేషం. ఈ సందర్భంగా వైసిపి పాలనపై సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విధ్వంసానికి మారుపేరుగా మారిందని, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో పౌరులందరూ పూర్తి స్వేచ్ఛతో జీవిస్తున్నారని అన్నారు. సిఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి లోకేశ్ కృషి, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తోడ్పాటు, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఎపికి భారీగా పెట్టుబడులు సాధించామని కొనియాడారు. వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో ఘనంగా నిర్వహించాలని అకున్నప్పటికీ, ప్రభుత్వం అనుసరిస్తున్న పొదుపు చర్యల్లో భాగంగానే ఎన్టీఆర్ భవన్ వేదికగా హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానంలో నిర్వహించనున్నామని సోమిరెడ్డి వివరించారు.

# వైయస్ జగన్‌తో శోభ హైమావతి భేటీ



**విజయనగరం, మే 20 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైయస్ఆర్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. బుధవారం ఎస్ కోట మాజీ శాసనసభ్యురాలు అనకాపల్లి పార్లమెంటు పరిశీలకురాలు శోభ హైమావతి. ఆమె కుమార్ విజయనగరం జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మరియు చీపురుపల్లి నియోజకవర్గ పరిశీలకరాలు డాక్టర్ శోభ స్వాతిరాణి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశామని తెలియజేశారు. ఈ కలయిక భవిష్యత్తు ప్రణాళికని పలు ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. మున్ముందు ఏమి జరుగుతుందో వేచి చూడవలసి ఉంది.




# తిరుపతి జిల్లాలో మందుల షాపులు బంద్

**తిరుపతి, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలభారత డ్రగ్గిస్టు కెమిస్టు దేశవ్యాప్త బంద్‌లో భాగంగా తిరుపతి జిల్లాలోని అన్ని ప్రధాన కేంద్రాల్లో అధికశాతం మందులషాపులు మూతబడ్డాయి. కెమిస్టు జీవనాధారం ప్రజారోగ్య పరిరక్షణ కోసం బుధవారం ఆలిండియా బందుకు పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా తిరుపతి జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, చంద్రగిరి, రేణిగుంట ప్రాంతాల్లో మెడికల్ అసోసియేషన్ కార్యవర్గ కార్యవర్గ సభ్యులందరూ ఏకతాటిపై కొచ్చి ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఫార్మా వ్యాపార రంగాన్ని ప్రభావితం చేస్తున్న కీలక అంశాలపై పలుమార్లు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామని, ప్రభుత్వాలు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అందుకు నిరసనగా ఈ దేశ వ్యాప్తంగా నిర్వహించాల్సి వచ్చిందని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల యజమానులు హాజరై నిరసన తెలిపారు.

## ఎర్రచందనం ముద్దాయిపై పిడి యాక్ట్

**తిరుపతి, మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న తమిళనాడుకు చెందిన రామకృష్ణన్ ముత్తు అనే రామకృష్ణపై టాస్క్‌ఫోర్స్ అధికారులు పిడి యాక్ట్ అమలు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కులశేఖర్ మార్గ నిర్దేశకత్వంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ అతనిపై పిడి యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. ఇతనిపై ఏడు ఎర్రచందనం కేసులు ఉండగా, టాస్క్ ఫోర్స్‌లో నాలుగు, సుండుపల్లి, కలికిరి పోలీసు స్టేషన్లుతో పాటు, పీలేరు ఫ్లయ్యింగ్ స్క్వాడ్‌లో ఒక కేసు ఉంది. పిడి యాక్ట్ అమలులో భాగంగా నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

## మండుతున్న ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**విజయవాడ, మే 20 ప్రభాతవార్త:** రోజురోజుకీ పెరుగుతున్న ఎండ తీవ్రతకు ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు ఎండవేడిమి నుండి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు. మరో నాలుగు రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్న వాతావరణశాఖా హెచ్చరికల నేపధ్యంలో వృద్దులు, చిన్నారులు, మహిళలు, గర్భిణీస్త్రీలు, అనారోగ్య సమస్యలతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఉదయం 11గంటల నుండి మద్యాహ్నం 4గంటల వరకు ఇంటి నుండి బయటకు రావద్దని హితవు పలికారు. సురక్షిత తాగునీరు, మజ్జిగ, కొబ్బరినీరు, నిమ్మరసం వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. తలనొప్పి, అధికంగా చెమటలు పట్టడం, అసలట, వాంతులు, వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యశాలకు వెళ్ళాలని కలెక్టర్ సూచించారు.



# గాజువాకలో 'ఐటీ హబ్'..

యారాడ కొండపై 450 ఎకరాలు -కలెక్టరేట్‌లో అధికారులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రెండు గంటల సుదీర్ఘ సమీక్ష -ఉక్కు, గంగవరం, ఫార్మా నిర్వాసితుల సమస్యలపై కలెక్టర్ సమక్షంలో నిలదీత -నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం.. -ఆక్రమణల క్రమబద్ధీకరణపై ప్రత్యేక ఫోకస్

విశాఖ పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా

## జె.ఎస్. బింద్రా బాధ్యతల స్వీకరణ

రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో విశేష అనుభవం కలిగిన ఐఆర్‌టీఎస్ అధికారి




(ప్రభాతవార్త-విశాఖపట్నం)

విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్‌పర్సన్‌గా జె.ఎస్. బింద్రా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఐఆర్‌టీఎస్ అధికారి అయిన ఆయనకు రైల్వే ఆపరేషన్స్, కమర్షియల్, సేఫ్టీ, లాజిస్టిక్స్ రంగాల్లో విశేష అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించే ముందు బింద్రా బిలాస్‌పూర్‌లోని సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేశారు. 2023 నుంచి 2025 వరకు రాంచీ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సేవలందించిన ఆయన, అనంతరం న్యూఢిల్లీలోని రైల్వే బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (గతి శక్తి)గా బాధ్యతలు నిర్వర్తించారు. అదనంగా, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖలో డైరెక్టర్‌గా ఐదేళ్లపాటు పనిచేసిన ఆయన, ఎంసీఎల్, ఎస్‌సీసీఎల్ సంస్థల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ప్రభుత్వ ప్రతినిధిగానూ వ్యవహరించారు. విద్యార్హతల పరంగా కూడా బింద్రా విశిష్ట గుర్తింపు పొందారు. జలంధర్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జలంధర్ నుంచి ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆయన, అమృత్‌సర్‌లోని గురు నానక్ దేవ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. అలాగే అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఝుశ్రీఅటశీతీఅఝు కాలఫోర్నియా, బేర్కెలేయ్‌కు చెందిన గోల్డ్‌మన్ స్కూల్ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ సాధించారు. లాజిస్టిక్స్, రవాణా రంగాల్లో విస్తృత అనుభవం కలిగిన బింద్రా అనేక జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు, సెమినార్లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఆయన నాయకత్వంలో విశాఖ పోర్ట్ మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# నర్సీపట్నంలో 'తృప్తి క్యాంటీన్' ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



8లో

## ప్రధాని పిలుపునకు పల్లా ఫిదా

బుల్లెట్ ప్రూఫ్ కారును సర్కార్‌కు తిరిగిచ్చేసిన గాజువాక ఎమ్మెల్యే



గాజువాక, మే 20,ప్రభాతవార్త

ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన ఇంధన పొదుపు నినా దానికి స్పందిస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఒక ఆదర్శవంత మైన నిర్ణయాన్ని తీసుకున్నారు. ప్రభుత్వం తనకు భద్రతా రీత్యా కేటా యించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఆయన స్వచ్ఛందంగా ప్రభు త్వానికి తిరిగి అప్పగించేశారు. ప్రజా ధనాన్ని ఆదా చేయడంతో పాటు, ఇంధన వినియోగాన్ని భారీగా తగ్గించాలనే ఉన్నతమైన ఆశయంతోనే ఎమ్మెల్యే ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ప్రజా ప్రతినిధులు ఆడంబరా లకు పోకుండా, ప్రజల సొమ్మును ఆదా చేసేందుకు ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## గ్రంథాలయాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



గాజువాక,మే 20,ప్రభాతవార్త

గాజువాక ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాజువాక నియోజకవర్గ పరిధిలోని గ్రంథాలయాల స్థితిగతులు, నూతన భవనాల నిర్మాణం, పుస్తక నిక్షిప్త కేంద్రాల ఏర్పాటుపై వారు సుదీర్ఘంగా చర్చించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత, విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయాల్లో కంప్యూటర్లు, ఉచిత వై-ఫై ఇ-లైబ్రరీ వంటి ఆధునిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సతీష్ కుమార్ వివరించారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందిస్తూ.. నియోజకవర్గంలో నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు, డిజిటలైజేషన్ ప్రక్రియకు తన వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

స్మార్ట్ సిటీ అంటారు..

# వార్డు మ్యాప్ చూపించలేరా!

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) వార్డుల పునర్విభజన వ్యవహారం నగరవాసులను తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. ఒకవైపు విశాఖను "స్మార్ట్ సిటీ"గా ప్రచారం చేస్తూ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న అధికారులు, మరోవైపు ప్రజలకు తమ వార్డు ఏదో కూడా సులభంగా తెలుసుకునే వ్యవస్థను ఏర్పాటు చేయలేకపోవడం తీవ్ర విమర్శ లకు దారితీస్తోంది. వార్డుల పునర్విభజన అనంతరం ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన జీవీఎంసీ అధికారులు, 120 వార్డులకు కలిపి ఒకే మ్యాప్‌ను వెబ్‌సైట్‌లో పెట్టి బాధ్యత ముగిసినట్టుగా వ్యవహరించడంపై ఆగ్రహం 8వ పేజీలో

జీవీఎంసీ వార్డుల పునర్విభజనలో ఘోర గందరగోళం -120 వార్డులకు ఒకే మ్యాప్.. ప్రజలకు చుక్కలు చూపిస్తున్న అధికారులు -గూగుల్ టెక్నాలజీ యుగంలోనూ 'జమానా కాలం' విధానాలే!



## జీవీఎంసీకి రూ.1501 కోట్ల మెగా ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

8లో

నక్కపల్లికి జూనియర్ సివిల్ జడ్జి,

## జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంజూరు

జిఒ విడుదల.. సంతోషం వ్యక్తం చేసిన పేట నియోజకవర్గం ప్రజలు




8లో

నర్సీపట్నం ఆసుపత్రిలో రక్త నిల్వల పెంపునకు

# స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవ



నర్సీపట్నం, మే 20,ప్రభాతవార్త

నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పడిన తీవ్ర రక్త నిల్వల కొరతను అధిగమించేందుకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తక్షణ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కేవలం 20 బ్లడ్ ప్యాకెట్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో, బుధవారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆయన అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మే, జూన్ నెలల్లో తక్షణమే 200 నుంచి 250 బ్యాగుల రక్తాన్ని సేకరించాలని స్పీకర్ లక్ష్యంగా నిర్దేశించారు. నియోజకవర్గంలోని 101 పంచాయతీల నుంచి గ్రామానికి కనీసం ఒక్కరి చొప్పున, అలాగే వాకర్స్ క్లబ్, సిటీ క్లబ్ సభ్యులు, ఉద్యోగ సంఘాలు, పట్టణ ప్రజల భాగస్వామ్యంతో రక్తాన్ని సేకరిస్తామని వెల్లడించారు. జూలైలో కళాశాలలు తిరిగి ప్రారంభమయ్యాక మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి మరో 500 నుంచి 600 8వ పేజీలో



# ఏమి'టీ'.. ఈ అనుభూతి

ఆంధ్రా లోను టీ సాగుకు అనుకూలం
మే 21 ఇంటర్నేషనల్ టీ డే సందర్భంగా ప్రత్యేకం



**టీ తాగితే ఆ అనుభూతే వేరబ్బా.. టీ తాగితే మనిషికి ఉత్సాహం.. మనసుకు ఉల్లాసం కలుగుతుంది. అందుకే ప్రపంచంలో టీ ప్రియులు అధికంగా ఉన్నారు. మంచినీళ్ల తర్వాత ఎక్కువగా తాగేది టీ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రపంచంలో ఒక్కరోజు 370 కోట్ల టీ కప్పులు ఖాళీ అవుతున్నాయని అంచనా. ఇండియాలో రోజుకు 120 కోట్ల కప్పుల టీ ఆస్వాదిస్తున్నట్లు కొన్ని సర్వేలలో తేలింది....**

విశాఖపట్నం, మే 20,ప్రభాతవార్త

టీకి చాలా ఏళ్ల నాటి చరిత్ర ఉంది. చైనాలో ప్రారంభమై భారత దేశంలో విస్తరించింది. ఇది ఒక సంస్కృతి, స్నేహం, ఆరోగ్యానికి ప్రతీక. లక్షలాది మందికి ఉపాధి ఇస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న ప్రపంచవ్యాప్తంగా టీ ప్రేమికులు ఆనందంగా జరుపుకునే రోజు ఇంటర్నేషనల్ టీ డే. చాయ్ అంటే చాలా మందికి ఇష్టం. ఉదయం లేచిన వెంటనే.. సాయంత్రం రిలాక్స్ అవ్వాలంటే టీ తప్పనిసరిగా ఉండాలి. ఈ ప్రత్యేక రోజున టీకి ఉన్న ప్రాముఖ్యతను ఒక్కసారి గుర్తు చేసుకుందాం.

### టీ చరిత్ర

టీ కి చాలా ఏళ్ల నాటి చరిత్ర ఉంది. సుమారు క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల ముందు ఆసియాలో టీ మొదలైంది. మొదట్లో ఇది ఒక ఔషధంగా వాడేవారు. ఆ కాలంలో టీ అంటే ఇప్పటిలా కాకుండా మసాలాలు కలిపిన రుచి ఉండేది. తర్వాత చైనా చక్రవర్తి షేన్ సంగ్ టీ ఆకులు ఉపయోగించడంతో ప్రారంభమైంది. అడవి లో తాగునీరు మరగబెడుతుండగా దగ్గరలో ఉన్న చెట్ల నుండి టీ ఆకులు ఆ నీటిలో పడగా మరిగిన ఆ నీరు రుచిగా ఉండటంతో పాటు ఉత్సాహాన్ని కలిగించటంతో అక్కడి నుంచి టీ ప్రపంచానికి పరిచయం అయింది. మొదట్లో ఔషధంగా వాడిన ఈ టీ కాలక్రమం లో అలవాటుగా మారింది. భారతదేశంలో బ్రిటిష్ పాలన కాలంలో టీ సాగు ప్రారంభమైంది. ఆ తర్వాత భారతదేశం.. ప్రపంచంలో పెద్ద టీ ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా మారింది. స్వాతంత్ర్యం తర్వాత కేఫేలు పెరగడంతో టీ తాగే అలవాటు ఇంకా ఎక్కువైంది. టీ ఒక సంస్కృతి, సంప్రదాయం, అనుబంధాలకు 8వ పేజీలో

## గాజువాకలో 'ఐటీ హబ్'..

గాజువాక,మే 20,ప్రభాతవార్త

గాజువాక నియోజకవర్గాన్ని భవిష్యత్తులో ఐటీ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో బుధవారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలపై ఆయన సవివరంగా చర్చించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో విశాఖకు భారీ ఐటీ పెట్టుబడులు రానున్న నేపథ్యంలో.. గాజువాక పరిధిలోని యారాడ కొండపై ఉన్న 450 ఎకరాల ప్రభుత్వ భూమి, ఆగనంపూడి వద్ద 175 ఎకరాల భూమిని కలిపి మొత్తం 600 ఎకరాలను ఐటీ, నాలెడ్జ్ హబ్ కోసం పరిశీలించాలని అధికారులను కోరారు. ఉక్కు కర్మాగారం, గంగవరం పోర్టు, ఫార్మాసిటీ నిర్వాసితులకు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు, పరిహారం అంశాలపై అధికారులను నిలదీస్తూ తక్షణమే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే, గెడ్డలు, వాగుల పరిసరాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న 6 వేల పేద కుటుంబాల ఇళ్లను క్రమబద్ధీకరించాలని కలెక్టర్‌ను కోరారు. ఇదే క్రమంలో, గాజువాకలో ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలను మీడియా ముసుగులో కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు పల్లా శ్రీనివాసరావు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

## నర్సీపట్నంలో 'తృప్తి క్యాంటీన్' ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాఖపట్నం, మే 20,ప్రభాతవార్త

నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 'తృప్తి క్యాంటీన్'ను బుధవారం రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి లాంఛనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం క్యాంటీన్ పరిసరాలను వారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా వినూత్న ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,000 మంది డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించేలా 750 తృప్తి క్యాంటీన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదిగి పది మందికి ఉపాధి కల్పించాలని ఆయన ఆకాంక్షించారు. మెప్మా ఆధ్వర్యంలో నర్సీపట్నం పురపాలక సంఘంలో ఏర్పాటైన ఈ ఫుడ్ కోర్ట్‌కు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రూ.13.75 లక్షల ఆర్థిక సాయం అందించిందని స్పీకర్ వివరించారు. అనకాపల్లి జిల్లాలో తొలి క్యాంటీన్‌గా ఎంపికైన దీనిని శ్రీలక్ష్మి ఎస్ఎల్ఎఫ్ సభ్యురాలు ఎన్. రహీనా భాను నిర్వహిస్తారని, ఇక్కడ నాణ్యమైన టిఫిన్స్, వెజ్, నాన్ వెజ్ భోజనం అందుబాటు ధరల్లో లభిస్తాయని పేర్కొన్నారు. ఈ క్యాంటీన్ విజయవంతమైతే మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వివి రమణ, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ నాగరాజు, మెప్మా డీపీఎంయూ టీఈ సందీప్, డీఆర్పీ రాజశేఖర్, మార్కెట్ చైర్మన్ గవిరెడ్డి రమణ, టిడిపి పార్టీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్, స్థానిక నాయకులు బంగారు రాజు, రుత్తల కృష్ణ, క్యాంటీన్ రాజు, మధు, చింటూ, శ్రీకాంత్, లాలం మురళి, పైలా రమణ, మార్కెట్ రాజా, రాజ్ కుమార్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ అంటారు..

7వ పేజీ తరువాయి ..

వ్యక్తమవుతోంది. ఆ మ్యాప్‌లో తమ ఇల్లు, వీధి, కాలనీ ఏ వార్డు పరిధిలోకి వస్తుందో తెలుసుకోవడం సామాన్య ప్రజలకు అసాధ్యంగా మారింది. టెక్నాలజీ వేగంగా మారుతున్న కాలంలో, ప్రపంచం మొత్తం గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్, జియో ట్యాగింగ్, డిజిటల్ లొకేషన్ సేవలను ఉపయోగిస్తున్నప్పటికీ, జీవీఎంసీ మాత్రం ఇప్పటికీ పాత ఫైల్ మ్యాప్‌ల స్థాయిలోనే ఉండిపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. స్మార్ట్‌ఫోన్‌లో ఒక్క క్లిక్‌తో ప్రపంచ మ్యాప్ కనిపించే రోజుల్లో, విశాఖవాసులు మాత్రం తమ వార్డు కోసం పెద్ద మ్యాప్‌లో సూది వెతికినట్లుగా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### "ఇది స్మార్ట్ సిటీనా... లేక పాత మున్సిపాల్టీనా?"

ప్రజల్లో ఇప్పుడు ఇదే ప్రశ్న వినిపిస్తోంది. స్మార్ట్ సిటీ పేరుతో భారీగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, ప్రాథమిక పౌర సమాచారాన్ని కూడా ఆధునిక పద్ధతిలో అందించలేకపోవడం జీవీఎంసీ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని నగరవాసులు మండిపడుతున్నారు. కొత్త వార్డు సరిహద్దులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉన్నాయో తెలియక ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఎన్నికల జాబితాలు, పన్నులు, పౌర సేవలు, ఫిర్యాదులు--- అన్నింటికీ వార్డు సమాచారం కీలకం. అలాంటి కీలక సమాచారాన్నే స్పష్టంగా అందించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### గూగుల్ ఎర్త్‌తో నిమిషాల్లో సాధ్యమయ్యేది... జీవీఎంసీకి ఎందుకు కష్టమైంది?

సాంకేతిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతి వార్డును విడివిడిగా గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్‌తో అనుసంధానం చేస్తే ప్రజలు తమ మొబైల్‌లోనే తాము ఏ వార్డులో ఉన్నారో సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. జియో-ఫెన్సింగ్ టెక్నాలజీ ద్వారా వార్డు సరిహద్దులను ఖచ్చితంగా చూపించవచ్చు. కానీ ఇలాంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించకపోవడం అధికారుల నిర్లక్ష్యమే కాకుండా, ప్రజల అవసరాలపై ఉన్న నిర్లిప్త వైఖరికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### "ఒక్కో వార్డుకు విడిగా మ్యాప్ పెట్టలేరా?"

ప్రస్తుతం విడుదల చేసిన భారీ మ్యాప్ కంటే, ఒక్కో వార్డుకు విడివిడిగా డిజిటల్ మ్యాప్‌లు, కాలనీ వారీ వివరాలు, సెర్చ్ ఫీచర్లు అందుబాటులో ఉంచితే ప్రజలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని నగరవాసులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి, వార్డుల పునర్విభజనను ప్రజలకు అర్థమయ్యే విధంగా ఆధునిక సాంకేతికతతో అందుబాటులోకి తీసుకురావాలని, లేకపోతే "స్మార్ట్ సిటీ" అన్న పేరు కేవలం ప్రచారానికే పరిమితమవుతుందని నగరవాసులు హెచ్చరిస్తున్నారు.

## నర్సీపట్నం ఆసుపత్రిలో రక్త నిల్వల పెంపునకు..

7వ పేజీ తరువాయి ..

బ్యాగుల రక్తాన్ని సేకరించి నిల్వలను పెంచేలా ఆయన కార్యాచరణ సిద్ధం చేశారు. రక్తాన్ని కృత్రిమంగా ఉత్పత్తి చేయలేమని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తేనే ఆపదలో ఉన్న ప్రాణాలను నిలబెట్టగలమని స్పీకర్ ఉద్ఘాటించారు. ఈ సున్నితమైన అంశంపై కేవలం విమర్శలు చేయడం మాని, ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సహకరించాలని కోరారు. ప్రాణదానం కంటే గొప్ప దానం మరొకటి లేదని, వైద్య సేవలకు సంబంధించిన ఈ సమస్యను ఎవరూ రాజకీయం చేయవద్దని స్పష్టం చేశారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి పౌరుడితో పాటు, పత్రికా ప్రతినిధులు సైతం ముందుకొచ్చి రక్తదానం చేయాలని అయ్యన్నపాత్రుడు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, ఎంపీడీవో, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు తాతయ్య బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్, ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వాకర్స్ క్లబ్, సిటీ క్లబ్, ఎన్జీవోఎస్, వైద్యాధికారులు సూపరింటెండెంట్ సుధా శారద, డా.అపర్ణ పాల్గొన్నారు.

## కాపులుప్పాడలో అనుమానాస్పద స్థితిలో వివాహిత

భీమిలి, మే 20 ప్రభాతవార్త

జీవీఎంసీ 4వ వార్డు పరిధిలోని కాపులుప్పాడ ఉడా లేఅవుట్ సమీపంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో ప్రాణాపాయంతో పడి ఉండటం కలకలం రేపింది. స్థానికులు గమనించి 108 వాహనంలో ఆమెను ఆస్పత్రికి తరలించారు.బాధితురాలిని వైఎస్సార్ కాలనీకి చెందిన ఆశ (27)గా గుర్తించారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు అగ్రస్థానం తీసుకురావాలి

### సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌కు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపు

### -ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సూచన

విశాఖపట్నం, మే 20, ప్రభాతవార్త



జీవీఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2025-26పై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నగర పరిశుభ్రతపై కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నాన్ని దేశంలోనే ఉత్తమ పరిశుభ్ర నగరంగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా విశాఖ పరిశుభ్రత పరంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. ఈసారి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశస్థాయిలో అగ్రస్థానం సాధించేందుకు ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ కీలక పాత్ర పోషించాలని కోరారు. ఇంటి వద్దే తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా విభజించి జీవీఎంసీ వాహనాలకు అందించాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే తడి వ్యర్థాలతో ఎరువుల తయారీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిరోధించడం, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే బృందాలు నగర ప్రజలను నేరుగా కలిసి పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, పారిశుధ్య నిర్వహణపై అభిప్రాయాలు సేకరిస్తాయని కమిషనర్ తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలను స్వచ్ఛత యాప్ లేదా స్వచ్ఛ భారత్ మిషన్ రూపొందించిన ఆన్‌లైన్ లింక్ ద్వారా తెలియజేయాలని సూచించారు. "ది డిజిటల్ వాయిస్ అఫ్ వైజాగ్" ట్యాగ్‌లైన్‌తో రూపొందించిన "వైజాగ్ సోషల్ మీడియా అసోసియేషన్" లోగోను కమిషనర్ ఆవిష్కరించారు. నగర అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా అవగాహన కార్యక్రమాల్లో జీవీఎంసీకి సహకరించాలని సోషల్ మీడియా ప్రతినిధులను కోరారు. జీవీఎంసీ అధికారులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, డిజిటల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నక్కపల్లికి జూనియర్ సివిల్ జడ్జి..

# జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు" మంజూరు

నక్కపల్లి/ ప్రభాతవార్త

జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధితోపాటు అన్నిరంగాల్లోనూ అత్యంత వేగంగా అభివృద్ధి విషయంలో దూసుకుపోతున్న నక్కపల్లి మండల కేంద్రంగా "జూనియర్ సివిల్ జడ్జి తో పాటు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు" మంజూరు కావడం పట్ల పేట నియోజకవర్గం ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు విశాఖపట్నం జిల్లా జడ్జి ఈ నెల 18 న జి ఒ విడుదల చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కోర్టు నక్కపల్లికి వస్తుందని ఎదురు చూసిన ప్రజలకు ఈనాటికీ సాధ్యం కావడంతో చర్చనీయాంశం అవుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నక్కపల్లి మండల కేంద్రంగా కోర్టులు మంజూరు కావడం జాతీయ రహదారి ఆనుకొని ఉన్న అడ్డరోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు జరగడం కొద్ది రోజుల్లో డిఎస్పి కార్యాలయం కూడా ఏర్పాటు కానున్న సందర్భంగా ఒకప్పుడు అభివృద్ధికి నోచుకోని పాయకరావుపేట నియోజకవర్గం ఒక అభివృద్ధి వెనుక మరో అభివృద్ధి చకా చకా రూపురేఖలు దిద్దుకోవడంతో పాయకరావుపేట నియోజకవర్గం ప్రజలు ఆనందానికి హద్దులు లేకుండా పోతున్నాయి. ఈ ఉమ్మడి కోర్టులు మంజూరుతో సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు ఏ చిన్న కేసుకైనా పాయకరావుపేట నుంచి ఎలమంచిలి వరకు వెళ్లాల్సి వచ్చేదని, అటువంటిది అటు ఎలమంచిలికి ఇటు పాయకరావుపేటకు మధ్య మార్గమైన నక్కపల్లికి మంజూరు కావడం చెప్పుకోదగ్గ విషయమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా పాయకరావుపేట, తుని నియోజకర్గాలకు చెందిన సీనియర్, జూనియర్ అడ్వకేట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వీరంతా సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన పనులు పై యలమంచిలిలోని ఉన్న కోర్టులకు వెళ్ళిరావాల్సి వస్తున్న విషయం తెలిసినదే.! దీంతో తుని రైల్వే స్టేషను, పాయకరావుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి నిత్యం ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుతూ రాకపోకలు సాగిస్తున్న న్యాయవాదులకి ఈ కోర్టు మంజూరుతో ఊరట కలిగింది. ప్రస్తుతం నక్కపల్లిలో కొత్తగా మంజూరైన కోర్టు తమకు ఎంతగానో ఉపయోగ పడుతుందని నియోజకవర్గంలోని న్యాయవాదులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నక్కపల్లికి కొత్తగా కోర్టు మంజూరు చేయించేందుకు విశేషంగా కృషి చేసిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు పాయకరావుపేట నియోజకవర్గంలోని ప్రజలు , న్యాయవాదులు, , ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## జీవీఎంసీకి రూ.1501 కోట్ల మెగా ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

విశాఖపట్నం, మే 20, ప్రభాతవార్త



గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రతిపాదించిన రూ.1501.03 కోట్ల విలువైన మూడు మెగా మౌలిక వసతుల ప్రాజెక్టుల కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద జాతీయ అపెక్స్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు. మధురవాడ జోన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు, 24ఇ7 స్మార్ట్ వాటర్ సప్లై వ్యవస్థకు రూ.725.18 కోట్లు, బల్క్ వాటర్ సప్లై వ్యవస్థ ఆధునీకరణకు రూ.117.24 కోట్లు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్టులతో విశాఖలో తాగునీటి సరఫరా, యూజీడీ వ్యవస్థలు ఆధునీకరణ చెందడంతో పాటు నగర మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయని అధికారులు తెలిపారు.

## ఏమి'టీ'.. ఈ అనుభూతి

7వ పేజీ తరువాయి ..

ప్రతీక. ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో టీతో ప్రత్యేకమైన ఆచారాలు ఉన్నాయి. జపాన్‌లో టీ కార్యక్రమాలు చాలా ముఖ్యమైనవి. ఇంగ్లాండ్‌లో టీ పార్టీలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇంగ్లాండ్ చార్లెస్ రాజ్ టీ ని ఎంతో ఇష్టపడే వారట. టీ ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతుంది. ఇది శరీరాన్ని ఉల్లాసంగా ఉంచుతుంది. అలసట తగ్గిస్తుంది. అలాగే మనుషులను కలుపుతుంది. కుటుంబం, స్నేహితులు కలిసి కూర్చొని టీ తాగడం ఒక మంచి అనుభూతి ఇస్తుంది. మసాలా టీ, ప్రీమియం టి,అల్లం టీ,ఇరానీ టీ,పుదీనా టీ, గ్రీన్ టీ, ఇలా పరివిధాలుగా దీనిని ఆస్వాదిస్తారు. కమ్మని తేనీరు..ఎంతోమంది ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది. లక్షలాది మంది రైతులు, కార్మికులు టీపై ఆధారపడి జీవిస్తున్నారు. టీ వ్యాపారం దేశాల మధ్య వాణిజ్యాన్ని కూడా పెంచుతుంది.మన రోజువారీ జీవితంలో భాగమైన ఈ చిన్న కప్పు టీ ఎంత గొప్పదో తెలియజేసేందుకు మే 21న వరల్డ్ టీ డే ను జరుపుకుంటారు. భారతదేశంలో టీ సాగు కు ప్రాముఖ్యత భారతదేశంలో అస్సాం, డార్జిలింగ్, నీలగిరి ప్రాంతాల్లో ఎక్కువగా తేయాకు పంటను వేస్తారు. దేశంలో 50 శాతానికి పైగా టీ పంట ఒక్క అస్సాం రాష్ట్రంలోనే దిగుబడి అవుతుంది. అస్సాంలో ఎక్కువగా దిగుబడి కాగా డార్జిలింగ్ లో అంతకంటే తక్కువగా దిగుబడి వస్తుంది. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 17% టీ దిగుబడి కాగా కాంగ్రా, హిమాచల్ ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో కేవలం ఒక్క శాతం మాత్రమే టీ పంట దిగుబడి అవుతుంది. సముద్ర నీటిమట్టానికి 1000 నుండి 2000 అడుగుల ఎత్తులో ఉన్న కొండవాలు ప్రాంతాల్లో ఆమ్ల నేలలు టీ పంటకు అనుకూలం. 25 నుండి 30 డిగ్రీల సెంటిగ్రేడ్ల మధ్య ఉష్ణోగ్రత ఉండాలి. అస్సాం బ్రహ్మపుత్ర వ్యాలీలో ఎక్కువగా టీ పంట పండుతుంది. అస్సాంలో అధికంగా 651.8 మిలియన్ కేజీల టీ ఉత్పత్తి రాగా, రెండో స్థానంలో పశ్చిమబెంగాల్లో 0.4% తో 5.30 మిలియన్ కేజీల ఉత్పత్తి జరిగింది. ఇది తక్కువ పరిమాణమే అయినప్పటికీ ప్రీమియం క్వాలిటీ గల ఉత్పత్తి కావడంతో మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. పశ్చిమబెంగాల్ డార్జిలింగ్ లో టీ పంట పండుతుంది, దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో 23.8 మిలియన్ కేజీల ఉత్పత్తి వచ్చింది. 2025 లో ప్రభుత్వ లెక్కల ప్రకారం టీ దిగుబడి 1,368,980 టన్నులు. సరిగ్గా వర్షాలు పడకపోవడం, పురుగుల మందుల ప్రభావం తో కొంత పంట నష్టం జరిగినా గత ఏడాది కంటే తేయాకు సాగు లో ఐదు శాతం పెరుగుదల నమోదయింది. టీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం 2024తో పోలిస్తే 2025లో మూడు శాతం అదనంగా టీ పంట దిగుబడి వచ్చింది. సహజంగా హెక్టార్ కు 1600 నుండి 3వేల కేజీల వరకు దిగుబడి వస్తుంది. దేశంలో 20 మిలియన్ కేజీల టీ ఎగుమతి ఇరాన్, ఇరాక్, చైనా లకు అవుతుంది. స్వతంత్రానంతరం 1947 లోనే భారతదేశంలో టీ బోర్డు ఏర్పాటు కాబడింది. టీ పంటకు ఆంధ్రప్రదేశ్ లోను అవకాశాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా టీ సాగు కు అవకాశాలు ఉన్నాయి. అరకు కాఫీకి ప్రపంచ గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. కాఫీ తరహాలోనే టీ సాగుకు కూడా ప్రోత్సాహం,సహకారం అందిస్తే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. కాఫీ సాగు జరిగిన చోట టీ పంటకు కూడా సానుకూల పరిస్థితులు ఉంటాయని చెబుతున్నారు. తూర్పు కనుమలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకు, చింతపల్లి, అనంతగిరి, గూడెం కొత్త వీధి వంటి ప్రాంతాల్లో ఐదు దశాబ్దాలుగా కాఫీ సాగు కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో టీ పంట వేయటానికి కూడా అవకాశం ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా కొంత కొండ ప్రాంతం టీ పంటకు అనుకూలమని చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో తక్కువ స్థాయిలో పలుచోట్ల టీ సాగు కొనసాగిస్తున్నారు. అయితే వాణిజ్యం జరిపే స్థాయిలో టీ సాగు జరగటం లేదు. దేశంలో పలుచోట్ల టీ బోర్డుల ఏర్పాటు ను , ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారాన్ని ప్రభుత్వాలు అందిస్తున్నాయి. ఇదే తరహాలో మన రాష్ట్రంలో కూడా టీ సాగు విస్తరించేందుకు ప్రభుత్వం ప్రోత్సాకాలను ప్రకటించాలి. టీ సాగు కోసం ఇప్పటివరకు ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహక పథకాలను అమలు చేయకపోవడం గమనార్హం. మన కాఫీ కి మంచి క్రేజ్ ఉన్నప్పటికీ ఆధునిక సదుపాయాలతో కూడిన ప్రాసెసింగ్ యూనిట్లు లేవనే విమర్శ ఉంది. ఈ నేపథ్యంలో కాఫీ పాటు టీ ఆకు సాగు కోసం తగిన ప్రోత్సాహకాలను ప్రకటించడంతోపాటు పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలి. కాఫీ తాగే వారి శాతం తక్కువ, టీ తాగేసి వారి శాతం ఎక్కువ. గిరిజన ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా సేవించేది టీ. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, ఉద్యానవన శాఖ, టీ బోర్డు సమన్వయంతో రాష్ట్రంలో ముఖ్యంగ తూర్పు కనుమల్లో టీ ఆకు సాగుకు కూడ ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని డా.యం.అర్.యన్.వర్మ, సీనియర్ జర్నలిస్ట్, విశాఖపట్నంప తెలిపారు.

## గృహ వ్యర్థాలను సంపదగా మార్చుకోవాలి

### జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సత్యవేణి

విశాఖపట్నం, మే 20, ప్రభాతవార్త



దక్షిణ జోన్ పరిధి, 30వ వార్డులో ఇంటింటా కంపోస్టింగ్‌పై బుధ వారం ప్రత్యేక అవగాహన కార్య క్రమం నిర్వహిం చారు. ఈ సందర్భం గా జీవీఎం సీ అడిషనల్ కమిషనర్ పీఎం. సత్యవేణి మాట్లాడు తూ, గృహ తడి వ్యర్థాలతో కంపోస్టింగ్ అలవాటు చేసుకుంటే పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన నగర నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు. వంటింటి తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువును ఎలా తయారు చేయాలో ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. గృహ స్థాయిలో తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం ద్వారా వ్యర్థాల పరిమాణం తగ్గుతుందని ఆమె వివరించారు. ప్రతి కుటుంబం ఇంటి వద్దే కంపోస్టింగ్‌ను అలవాటు చేసుకోవాలని, దీంతో పరిశుభ్రమైన పరిసరాలు నెలకొంటాయని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలపై సిపి రివ్యూ



విశాఖపట్నం, మే 20 ప్రభాతవార్త

నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీలు నుండి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ల పనితీరును పరిశీలించారు. ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ లకు నిర్వహించిన ఈ నెల రివ్యూ నందు ఆయా విభాగాల పనితీరును సీపీ పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్ గా ఉన్న రౌడీ షీటర్లు,వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు, ఇప్పటి వరకూ నమోదు చేసిన ఎన్ డి పి ఎస్ కేసు వివరాలను సమీక్షించి, నగరం గుండా ఏటువంటి ఎన్ డి పి ఎస్ రవాణా జరగకుండా పూర్తిగా నిరోధించాలని తెలిపారు. నగరంలో పోలీస్ స్టేషన్లో చాలాకాలంగా ఉండిపోయిన కేసులు యొక్క వివరాలు, కేసు పెండింగ్ ఉండడానికి గల కారణాలు తెలుసుకొని సదరు పెండింగ్లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించివలసిందిగా ఆదేశించారు, కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ప్రతీ స్టేషన్ పరిధిలో యెటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా పూర్తిగా నివారించాలని, ఆయా స్టేషన్ పరిధిలో గల నిర్మానుష్యప్రాంతాలను, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పికేట్, అవసరం మేరకు డికొయ్ టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పూర్తి అదుపులో ఉండాలనీ, గంజాయి ఎక్కడా ఉండరాదని, ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ వంటి ఏ స్టేషన్ పరిధిలోనూ చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, అందుకు అదనంగా వెహికల్, మెన్ ఇతర అవసరాలు ఏమైనా ఉన్నచో తనకు తెలియజేయాలని తెలిపారు. నగరంలో అన్ని పోలీస్ స్టేషన్ల లో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరు పై ఆరా తీసి, తగు ఆదేశాలు జారీ చేశారు. పొక్సో కేసుల పైన ఆరా తీశారు, నగరంలో క్రైమ్ రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలనీ తెలిపారు. విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ ను పూర్తిగా లా అండ్ ఆర్డర్ క్రైమ్ సిబ్బంది అందరూ వినియోగిస్తూ నిందితులను మరింత వేగముగా గుర్తించాలని తెలిపారు. సైబర్ క్రైమ్ పై మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు, ప్రజలకు పూర్తి అవగాహన అయ్యేలా మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు, పలు కొత్త సాఫ్ట్ వేర్ లను తీసుకొని వినియో గించాలని సూచించారు. ఉమెన్ సేఫ్టీ కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళల పైన వేదింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసులలో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలన్నారు,పొక్సో కేసుల పైన ఆరా తీశారు. కోర్టు నందు కేసులు ఎటువంటి జాప్యం లేకుండా, కన్విక్షన్ పడే కేసులు సంఖ్య పెరిగే విధముగా చేయుటకు, అధికారులు సిబ్బంది సందేహాలను నివృత్తి చేసేందుకు లోక్ ఆధాలత్ నందు గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల ని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆహ్వానించి పలు న్యాయ సంబంధిత అంశాలపై పరస్పరం చర్చించి, పోలీసు అధికారులు పలు న్యాయ సంబంధిత అంశాలలో తమ సందేహాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ను అడిగి నివృత్తి చేసుకున్నారు. వచ్చే నెల నిర్వహించబోవు రివ్యూ మీటింగ్ నందు ప్రతి పోలీస్ స్టేషన్ గత నెల కంటే మెరుగ్గా, క్రైమ్ తగ్గు ముఖం పట్టే విధముగా పోలీసింగ్ ఉండాలని తెలిపారు. నగర పోలీసు అధికా రులు సిబ్బంది పూర్తి పారదర్శకముగా తమ విధులు నిర్వర్తించాలని, విధులలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా, అవినీతికి పాల్పడినా తక్షణమే వారిపై కఠిన చర్యలు ఉంటాయనీ తెలిపారు. ఈ సమావేశంలో డి.సి.పి-01(ఎల్ అండ్ ఓ) వి.ఎన్. మణికంఠ చందోలు, ఐ.పీ.ఎస్., డి.సి.పి-02(ఎల్ అండ్ ఓ) డి.మేరీ ప్రశాంతి, డి.సి.పి(క్రైమ్స్) లతా మాధురి, నగర ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, స్టేషన్ ఎస్.హెచ్.ఓ లు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించిన సిపి



విశాఖపట్నం, మే 20 ప్రభాతవార్త

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రాత బాగ్చి పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించారు. బుధవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నగర పోలీసు కమిషనరేట్ కు చెందిన ముగ్గురికి పదోన్నతులు అందజేశారు, సీనియర్ అసిస్టెంట్, సూపరెండెంట్‌గా, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ గా, కానిస్టేబుల్ కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక ప్రాధాన్యం ఎల్లప్పుడూ ఇచ్చే సిపి పోలీసు శాఖ నందు పదోన్నతి పొందిన సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో పాటుగా ఉడా చిల్డ్రన్ ఎరీనాకు ఆహ్వానించి, నూతన పదోన్నతి సంబంధించిన ర్యాంకులను, పోస్టింగ్ ఆర్డర్లను ఇతర ఉన్నతాధికారులతో కలిసి స్వయముగా అందజేశారు.

## ఆర్ ఆర్ ఆర్ సెంటర్లను మరింత పటిష్ట పరచండి.

### వ్యర్థాల పునర్వినియోగ ప్రక్రియ దిశగా ప్రజలకు అవగాహన పరచండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, మే 20 ప్రభాతవార్త

నగరంలో ఉన్న "రిడ్యూస్ రియూజ్ రీసైకిల్" సెంటర్లను మరింత పటిష్టపరిచి ఇండ్లలో ఉపయోగించని పాత వస్తువులు, వ్యర్థాలను పునర్వినియోగం లోనికి తీసుకువచ్చేందుకు ప్రజలకు అవగాహన పరిచి తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సౌత్ జోన్ 31వ వార్డు సిఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక ఉన్న రిడ్యూస్ రియూజ్ రీసైకిల్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఆర్.ఆర్.ఆర్ సెంటర్ ద్వారా ఎటువంటి వ్యర్థాలు సేకరిస్తున్నారని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్ ను ఆరా తీశారు. కార్డు బోర్డు వేస్టు, వేస్ట్ క్లాత్, మిక్స్డ్ వేస్ట్, పెట్ బాటిల్ వేస్ట్ ను నాలుగు డబ్బాలుగా సేకరించి వీటిని పునర్వినియోగ ప్రక్రియ చేయడం జరుగుతుందని కమిషనర్ కు వివరిస్తూ చూపించారు. ఆర్ ఆర్ ఆర్ సెంటర్లను మరింత పటిష్ట పరచాలని ప్రతి జోన్ లో ఇటువంటి సెంటర్లను మరిన్ని ఏర్పాటు కు అవసరమయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రధాన వైద్యాధికారిని ఆదేశించారు. త్రిబుల్ ఆర్ సెంటర్ లపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇంటిలో ఉపయోగించని లేదా పనికిరాని వస్తువులను ఆర్ ఆర్ ఆర్ సెంటర్లకు ప్రజలు తీసుకువచ్చేలా వారికి అవగాహన పరచాలని ప్రధాన వైద్యాధికారిని ఆదేశించారు. అనంతరం ఆర్ ఆర్ ఆర్ సెంటర్ కు ఆనుకొని ఉన్న హోటల్ మహతి గ్రాండ్ ను తనిఖీ చేసి అచ్చట వ్యర్థాలు అధికంగా ఉన్నాయని వ్యర్థాలు సేకరణకు వచ్చే జీవీఎంసీ వాహనానికి ఎందుకు అందించడం లేదని హోటల్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇకపై వ్యర్థాల సేకరణకు వచ్చే వాహనానికి అందించని పక్షంలో హోటల్ కు ఫైన్ వేయడంతో పాటు సీజ్ చేయాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణం రాజును ఆదేశించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ వెనక ఉన్న ఆవరణలో వ్యర్థాలు అస్తవ్యస్తంగా ఉండడం గమనించి శానిటరీ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే ఆ వ్యర్థాలు వారిచే శుభ్రం చేసుకునేలా సీఎంఆర్ సెంట్రల్ కు నోటీసులు జారీ చేసి 25 వేల రూపాయలు జరిమానా వేయాలని సహాయ వైద్యాధికారిని ఆదేశించారు. వ్యర్థాలు బహిరంగ ప్రదేశాలలో వేస్తే సహించేది లేదని వ్యర్థాలు బయటవేసిన వారికి వెంటనే జరిమానా వేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్ కు కమిషనర్ ఆదేశించారు. తద్వారా వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేయడం నియంత్రించవచ్చున్నారు. జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు ప్రతిరోజు ఫీల్డ్ విజిట్ చేస్తూ పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచే చర్యలు చేపట్టాలన్నారు. దుకాణాలు ప్రతి ఇంటి నుండి వ్యర్థాల సేకరణలో వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులు అలసత్వం వహించకుండా నిత్యం పరివేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.



## కేజీహెచ్‌లో ఓపి టికెట్ల జారీ జాప్యానికి సిబ్బంది కొరతే అసలు కారణం



విశాఖపట్నం మే 20 ప్రభాతవార్త

కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీ హెచ్) అవుట్ పేషెంట్ (ఓపీ) టికెట్ల జారీ విభా గంలో బుధవారం ఉదయం రోగులకు ఆన్లైన్ ఓపీ టిక్కెట్లు ఇచ్చే విషయంలో జరిగిన ఆలస్య మునకు ఆసుపత్రి పాలకులు సర్వరు లో సాంకేతిక సమస్య తలెత్తి నట్టు బయటకు చెబుతున్నప్పటికీ అసలు కారణం సిబ్బంది కొరతేనని తెలిసింది. ఆసుపత్రి ఓపీ ఆన్లైన్ టిక్కెట్ల జారీ విభాగంలో కొంతమంది పర్మనెంట్ సిబ్బంది విధులకు రాక పోవడంతోపాటు ప్రధానంగా రోజు ఆన్లైన్ ఆధార్ లుకప్ టోకెన్లు ఇచ్చేశీదుకు ఆసుపత్రి సూపరింటెం డెంటెంట్ నియమించిన ట్రయినింగ్ నర్సింగ్ విద్యార్థినులు గతవారం రోజులుగా ఓపీ విధులకు రాకపోవ డం వల్ల ఓపీ ఆన్లైన్ టోకెన్లు జారీ నిలిచిపోయింది. సాధారణంగా వీరు ఇచ్చే ఆధార్ లుకప్ టోకెన్ నెంబర్‌లలోని నిక్షిప్తమైన రోగుల సమాచారం ఓపీ సిబ్బందికి ఎంతో సహాయకారిగా మారి ఓపీ టికెట్‌ల జారీ సులభతరం అయ్యేది. గతవారం రోజులుగా ఆన్లైన్ ఓపీ టోకెన్లు ఇచ్చే ట్రైనింగ్ నర్సింగ్ విద్యార్థులు సెలవులు వల్ల ఓపీ విధులకు రాకపోవడం ఓపీ టిక్కెట్ల జారీలో జాప్యానికి రోగుల ఇక్కట్లకు అసలు కారణంగా నిలుస్తుంది. ఇక ఇంపేషెంట్ కేసు షీట్ల జారీ కౌంటర్లులోని సిబ్బందిని సైతం ఆన్లైన్ టోకెన్ల జారీ నిలిచిన పరిస్థితులు ఇబ్బందులుకు గురి చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు ఓపీ టికెట్‌ల జారీ విభాగంలో ఉన్న ఏసీలు ఫ్యాన్‌లు సరిగా పని చేయక పోవడం కూడా కంప్యూటర్ సర్వర్‌ల మోరాయింపుకు దారితీస్తున్న సందర్భాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఓపీ టిక్కెట్ల జారీలో జాప్యం రోగులు క్యూ లైన్లలో ఉక్కపోతతో అవస్థలు నిత్య కృత్యంగా మారుతోంది ఇదిలా ఉండగా బుధవారం ఉదయం ఓపీ టోకెన్లు జారీ జరగని కారణంగా ఓపీ టిక్కెట్ల జారీ ఆలస్యంగా జరగడం ఫలితంగా ఓపీ లైన్లలో రోగులు పడ్డ అవస్థలు పడ్డ దృశ్యలను సాంఘిక మాధ్యమాల్లో చుసిన ఆసుపత్రి యాజమాన్యం వెను వెంటనే రంగంలోకి దిగి మధ్యాహ్నం ఒంటి గంటకల్లా ఓపీ విభాగంలోని రోగులందరికి ఓపీ టిక్కెట్‌లను అందజేసే విధంగా చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం సమయానికి 2500ఓపీ టికెట్‌లు జారీ చేయగా 135 ఇన్ పేషెంట్ లకి కేసు షీట్ ఇచ్చి ఆసుపత్రిలో చేర్చు కొన్నారు. వారంలో మూడు రోజులు ఇదే పరిస్థితి. కింగ్ జార్జ్ ఆసుపత్రిలో కొనసాగుతుఅందని ఓపీ వైద్య వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా సోమవారంతో పాటు బుధ, శనివారాల్లో ఓపీ విభాగంకు రెండు వేల నుంచి మూడు వేల మంది వరకు అన్ని విద్యా విభాగాలకు సంబందించిన రోగులు వస్తున్నట్టు ఓపీ విభాగపు గణాంకాలును బట్టి తెలుస్తుంది. వారంలోని పైన పేర్కొన్న మూడు రోజుల్లో ఓపీ విభాగంకు వచ్చే రోగుల రద్దీని దృష్టలో పెట్టుకొని రోగులు ఇబ్బందులు పాలు కాకుండా ఇప్పటికైనా తగుచర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర వాసులు ప్రభుత్వంను కోరుకుంటున్నారు.

## దబ్బంద టిడ్కో కాలనీ సందర్శించిన గంటా

ఆనందపురం, మే 20, ప్రభాతవార్త



ఆనందపురం మండలం దబ్బంద గ్రామంలో నిర్మించిన టిడ్కో గృహాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. కాలనీ ప్రజల సమస్యలను ఆయన అడిగి తీసుకున్నారు. టిడ్కో కాలనీలో 1,920 యూనిట్లు ఉండగా.. సరైన సౌకర్యాలు లేకపోవడంతో కేవలం 10–15 శాతం మంది నివాసముంటున్నా రని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద సబ్సిడీ ధరకు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను కేటాయించారు. బ్యాంకులకు ఈ.ఎం.ఐ.లు కట్ట లేక, కనీస వసతులు లేని దబ్బంద టిడ్కో ఇళ్లల్లో ఉండలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ.. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు రద్దు చేయాలని కోరారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పార్కు, ఆరోగ్య కేంద్రం, రేషన్ డిపో, ప్రజా రవాణా వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళ్లలో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల మహిళలకు రక్షణ కరువవుతోందని, చెత్తా చెదారం పేరుకుపోవడంతో విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. అలాగే స్మశాన వాటిక నిర్మించాలని విన్నవించారు. త్వరలో జరిగే జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సమావేశంలో టిడ్కో కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన గురించి చర్చించి, పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని గంటా హామీ ఇచ్చారు. అంతకుముందు కాలనీలో టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనుబాబు, డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, టిడ్కో ఎస్.ఈ. రామిరెడ్డి, ఈఈ సుధాకర్, డీఈ రాజేష్, ఏఈ అనూష, సి.ఎల్.టి.సి. దేముడు బాబు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, గంట్రెడ్డి సోమినాయుడు, లొడగల వెంకట్రావు, బలిరెడ్డి మల్లికార్జునరావు, మదపాటి శ్రీను, గంట్రెడ్డి రమేష్, కాళ్ల నగేష్ కుమార్, అప్పలరాము, ఎర్ర రాజు, బోని ప్రసాద్, శివ, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీ వారి సన్నిధిలో సాయికృష్ణ



విశాఖపట్నం, మే 20, ప్రభాతవార్త

వేకువ జామున తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని టీడీపీ యువ నాయకులు, శ్రీ ధర్మ ఫౌండేషన్ ఛైర్మన్ కర్రి సాయికృష్ణ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారి దివ్య ఆశీస్సులు పొందిన అనంతరం రాష్ట్ర ప్రజలందరూ సుఖ శాంతులతో, ఆయురారోగ్యాల తో ఉండాలని ప్రార్థించారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయురా రోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని సాయికృష్ణ ఆకాంక్షించా రు. సాయికృష్ణ మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృప ప్రజ లందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.

## దబ్బంద టిడ్కో కాలనీ సందర్శించిన గంటా

ఆనందపురం, మే 20, ప్రభాతవార్త



ఆనందపురం మండలం దబ్బంద గ్రామంలో నిర్మించిన టిడ్కో గృహాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. కాలనీ ప్రజల సమస్యలను ఆయన అడిగి తీసుకున్నారు. టిడ్కో కాలనీలో 1,920 యూనిట్లు ఉండగా.. సరైన సౌకర్యాలు లేకపోవడంతో కేవలం 10– 15 శాతం మంది నివాసముంటున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద సబ్సిడీ ధరకు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను కేటాయించారు. బ్యాంకులకు ఈ.ఎం.ఐ.లు కట్టలేక, కనీస వసతులు లేని దబ్బంద టిడ్కో ఇళ్లల్లో ఉండలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ.. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు రద్దు చేయాలని కోరారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పార్కు, ఆరోగ్య కేంద్రం, రేషన్ డిపో, ప్రజా రవాణా వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళ్లలో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల మహిళలకు రక్షణ కరువవుతోందని, చెత్తా చెదారం పేరుకుపోవడంతో విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. అలాగే స్మశాన వాటిక నిర్మించాలని విన్నవించారు. త్వరలో జరిగే జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సమావేశంలో టిడ్కో కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన గురించి చర్చించి, పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని గంటా హామీ ఇచ్చారు. అంతకుముందు కాలనీలో టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనుబాబు, డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, టిడ్కో ఎస్.ఈ. రామిరెడ్డి, ఈఈ సుధాకర్, డీఈ రాజేష్, ఏఈ అనూష, సి.ఎల్.టి.సి. దేముడు బాబు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, గంట్రెడ్డి సోమినాయుడు, లొడగల వెంకట్రావు, బలిరెడ్డి మల్లికార్జునరావు, మదపాటి శ్రీను, గంట్రెడ్డి రమేష్, కాళ్ల నగేష్ కుమార్, అప్పలరాము, ఎర్ర రాజు, బోని ప్రసాద్, శివ, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెన్నేటినగర్ పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవంలో విష్ణుకుమార్ రాజు



మాధవధార, మే 20 ప్రభాతవార్త

నగరపాలక సంస్థ తెన్నేటినగర్ పార్కులో వివిధ అభివృద్ధి పనులు దాదాపు 20 లక్షలు రూపాయల అభివృద్ధి పనులుఉత్తర నియో జకవర్గం శాసనసభ్యులు ఎపి బిజెపి శాసన సభ పక్షనాయకులు విష్ణు కుమార్‌రాజు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డ్ తెదేపా అధ్యక్షులు ఎపి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల వరప్రసాద్ అధ్యక్షత వహించారు. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ మాధవదార చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి తాను ఎంతైనా క్రృషిచేస్తానని అన్నారు. అలాగే విశాఖ పట్నాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం క్రృషిచేస్తుందని అన్నారు.తదనంతరం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల వితరణ విష్ణుకుమార్ రాజు చేతులు మీదుగా ఇచ్చారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యేని తెన్నేటినగర్ నివాసులు గజమాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ, విశాఖ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు సురేష్ బాబు, 50వ వార్డ్ బిజెపి అధ్యక్షుడు కూన వెంకట్రావు, యు.అప్పలకొండ యాదవ్, వ్యవసాయ మార్కటింగ్ డైరెక్టర్ టి.పద్మజా తెన్నేటినగర్ అధ్యక్షుడు నంబాళ్ళ ఈశ్వరరావు, కార్యదర్శి పాన రాము, సనపల విజయ్ పాల్గొన్నారు.

### దాడి చిత్రీకరణ కుట్రలో దారా అభినయ దర్శన్‌తో పాటు

## ఎనిమిది మంది అరెస్ట్

### జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడి



పాడేరు,మే20, ప్రభాతవార్త

భరోసా పార్టీ వ్యవస్థాపకుడు, పాస్టర్ దారా అభినయ దర్శన్‌పై జరిగిన దాడి ముందస్తు పథకం ప్రకారం చిత్రీకరించి దానిని సోషల్ మీడియా, ఫేస్‌బుక్‌లో విస్తృతంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసి మత విద్వేషాలు, అశాంతి సృష్టించడం లక్ష్యంగా కుట్రపన్నినట్టు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. బుదవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దారా అభినయ దర్శన్ సానుభూతి సంపాదించడానికి పన్నిన దాడి చిత్రీకరణ కుట్ర కోణాన్ని ఎస్పీ అమిత్ బర్దర్ వివరించారు. కడప ప్రకాశ నగర్‌కు చెందిన సుందర రాజు కుమారుడు దారా అభినయ దర్శన్(38) పై జరిగినట్టు ప్రచారం చేసిన దాడి ఘటన ముందస్తుగా పన్నిన కుట్రలో భాగమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. అభినయ దర్శన్‌పై ఈ ఘటన ముందుగానే ప్రణాళిక బద్దంగా చిత్రీకరించి అనంతరం సోషల్ మీడియా ఇతర మీడియా వేదికలు ద్వారా ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం మత సామరస్యాన్ని దెబ్బ తీయడం అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్తతలు రేకెత్తించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ దాడి చిత్రీకరణ కుట్రలో పాల్గొన్న పల్నాడు జిల్లా సత్తెనపల్లి బిల్లా కిరణ్ అలియాస్ కిరణ్ జార్జ్34), ఏలూరు కే.బెల్వార్(49), భాను ప్రసాద్ కాగా ఈ చిత్రీకరణలో దాడి చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న డూంబ్రిగూడ మండలం పోతంగిబైలు వలస గ్రామానికి చెందిన తాంగుల వసంత కుమార్,హుకుంపేట మండలం తితంగివలస గ్రామానికి చెందిన కుమాడ ప్రేమ్ కుమార్, డుంబ్రిగూడ మండలం పోతంగి బెయిలు వలస గ్రామానికి చెందిన కిందంగి ఇంద్రకుమార్ అభినయ దర్శన్ దాడి చిత్రీకరణలో పాల్గొనట్టు గుర్తించడం జరిగిందనీ ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు.ముందస్తు ఈ దాడి చిత్రీకరణ అల్లూరి జిల్లా జీకే వీధి మండలం నీరుతోటపాలెం జరిగిందని ఎస్పీ తెలిపారు.ఈ దాడి చిత్రీకరణలో ప్రధాన నిందితుడు అభినయ దర్శన్‌పై గతంలో విజయనగరం టౌన్ పోలీస్ స్టేషన్లో బెదిరింపు కేసు నమోదు అయి ఉందని అలాగే కడప జిల్లా చిన్న చౌక్ యూపీఏస్‌లో వరకట్నం నిషేధిత కేసు నమోదు అయి ఉందని ఎస్పీ తెలిపారు. ఈ దాడి కుట్ర అభినయ దర్శన్, కిరణ్ జార్జ్ కొంత మంది ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ దాడి చిత్రీకరణ కుట్రకు సంబంధించి డుశ్రీబ్రిగూడ మండలం సమీప ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులకు డబ్బులు ప్రలోభాలకు గురిచేసి ఈ దాడి ఘటనలో భాగ స్వామ్యం చేసినట్టు దర్యాప్తులో తేలినట్టు ఎస్పీ తెలిపారు. ఈ దాడి చిత్రీకరణ ఘటనలో కేసులో మరికొంత మంది వ్యక్తుల పాత్ర, ఆర్థిక సహాయం తదితర అంశాలపై విచారణ కొనాసాగుతుందని ఎస్పీ అమిత్ బర్దర్ స్పష్టం చేసారు. అభినయ దర్శన్ అల్లూరి జిల్లాలో కార్యకలాపాలు వివరాలు ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నుండి 3వ తేదీ వరకు అనంతగిరి మండలం పెద్దబయలు గ్రామంలో పాస్టర్లతో సమావేశాలు నిర్వహించి, ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటుకు చర్చలు జరిపినట్లు సమాచారం ఉందన్నారు. 6వ తేదీన అనంతగిరి మండలం సుంకరిమెట్ట గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించడం, ఈ నెల 11న జీకే వీధి మండలం మొండిగడ్డ పంచాయతి గ్రామ సమస్యలపై జీకే వీధి ఎంపిడివోకు అభినయ దర్శన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. నీరుతోటపాలెం గ్రామంలో జరిగిన ఘటనపై న్యాయం చేయాలంటూ సుమారు 100 మంది గ్రామస్తులు, యేసుక్రీస్తు సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుపర్తి తిమోతి నాయకత్వంలో ర్యాలీ నిర్వహించారు.

### రాజకీయ కార్యకలాపాలు

క్రైస్తవులు, మైనారిటీలను సమీకరించడం, ఏఎస్ఆర్ జిల్లాలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం, యూట్యూబ్, ఫేస్ బుక్ వేదికల ద్వారా ప్రచారం, పాస్టర్లు, స్థానిక మద్దతుదారులతో సమావేశాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో రాజకీయ విస్తరణ కార్యక్రమాలు, భరోసా పార్టీ ఈ ఏడాది మార్చి 26న కాకినాడలో జరిగిన ప్రారంభ సభలో పార్టీని ప్రకటించారు. ఈ కార్యక్రమం పాస్టర్ ప్రవీణ్ పగడాల మొదటి వర్ధంతి సందర్భంగా నిర్వహించినట్లు తెలిసిందనీ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. ఈ దాడి చిత్రీకరణలో 8 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్పీ వెల్లడించారు.

## హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కో ఆర్డిరేటర్‌గా నరేశ్‌కుమార్



విశాఖపట్నం, మే 20 ప్రభాతవార్త

హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సింబియోసిస్ టెక్నాలజీ సీఈఓ. ఓరుగంటి నరేష్ కుమార్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ తరపున ట్రస్ట్ ఛైర్మన్ దాసరి శ్రీని వాసులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో హిందూ ధర్మ వ్యాప్తికి నిర్వహించే ధార్మి" కార్యక్రమాలు, సమావేశాలను సమన్వయం చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

## ప్రతిభ కనబరిచిన 203 మందికి రివార్డులను అందజేసిన సిపి

విశాఖపట్నం, మే 20 ప్రభాతవార్త

సిబ్బంది సంక్షేమంతో పాటుగా వారు అందించిన సేవల యందు ప్రతిభను గుర్తిస్తూ, ఉన్నతాధికారుల సమక్షంలో 203 మందికి రివార్డులను నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి అందజేశారు . బుధవారం క్రైమ్ రివ్యూ మీటింగ్ నందు గత నెల ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. నగర పోలీసు శాఖ నందు హోంగార్డు నుండి సిఐ స్థాయి అధికారుల వరకూ వారు నిర్వహిస్తున్న విధులకు తగ్గా గుర్తింపు ఇస్తూ, ప్రతి నెలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి తగు రివార్డులు అందజేసి, వారు సమర్ధవంతముగా విధులు నిర్వహిస్తూ తోటి సిబ్బందికి ప్రేరణ ఇస్తూ అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం మరింత సురక్షితముగా ఉండే దిశగా సిపి చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ నగరం గుండా రవాణా అవుతున్న గంజాయిని సీజ్ చేసిన పలు కేసులలో, చోరీ కాబడిన సొత్తు,ఇతర వస్తువులను రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసిన పలు కేసులలో, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన కేసులో, సైబర్ క్రైమ్ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, హోం గార్డు నుండి సీ.ఐ వరకూ గల సిబ్బందికి రివార్డులు మంజూరు చేసి, సిబ్బంది అందరూ ప్రేరణ చెంది మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించేలా ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డు మంజూరు ఆర్డరును అందజేశారు.



## రోడ్డు భద్రతను పాటించడం మనందరి బాధ్యత

### ప్రతి ఒక్క వాహన చోదకుడు హెల్మెట్ ధరించండి -ప్రాణాలను రక్షించుకోండి: జిల్లా కలెక్టర్ టి.నిషాంతి పిలుపు



పాడేరు /డుంబ్రిగుడ, మే 20, ప్రభాతవార్త

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పు డు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ అమూల్యమైన ప్రాణాల ను రక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి వాహన చోదకులకు పిలుపునిచ్చారు. బుధవారం డుంబ్రిగూడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సలహా సూచనలు చేశారు. అనంతరం హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాన్ని ఆమె నడిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత–ప్రాణ రక్షణ "రహదారి భద్రత పాటిద్దాం– ప్రమాదాలు నివారిద్దాం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. ప్రయాణం లో జరిగే చిన్న పాటి నిర్లక్ష్యం కుటుంబాలకు తీరని లోటును మిగులుస్తుంది. ట్రాఫిక్ నియమాలే రక్షణ కవచం, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను నిబంధనల ప్రకారం పాటించి, సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ లేకుండా ప్రయాణించే వారిపై నిబంధనల అమలులో అధికారులు కఠినంగా వ్యవహరించాలని, జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ పోలీసు, రవాణా శాఖ అధికారులకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని వాహన చోదకులం దరూ స్వీయ నియంత్రణతో, హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలను నడపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## "టీబీ విముక్త భారత్" మోదీ లక్ష్యం : కేఎన్‌ఆర్



గాజువాక,మే 20,ప్రభాతవార్త

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'టీబీ విముక్త భారత్' లక్ష్య సాధనలో భాగంగా గాజువాక 72వ వార్డు పాతకర్నవానిపాలెంలో ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. వార్డు సచివాలయం, పబ్లిక్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్‌ఆర్) ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉచితంగా టీబీ పరీక్షలు, ఆరు నెలల పాటు ఉచిత మందులు అందిస్తోందని తెలిపారు. బాధితుల పౌష్టికాహారం కోసం నెలకు రూ. 1000 చొప్పున నేరుగా ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. శిబిరంలో సుమారు 50 మందికి పరీక్షలు నిర్వహిం చారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ కే.అనిల్ కుమార్, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సిరివెన్నెల సీతారామశాస్త్రి స్మృతివనం శంకుస్థాపన

### ముఖ్య అతిథిగా నాగబాబు



అనకాపల్లి, మే 20 ప్రభాతవార్త

ప్రముఖ గేయ రచయిత పద్మ శ్రీ సిరి వెన్నెల సీతారామశాస్త్రి స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమం బుదవారం సాయంత్రం అనకాపల్లి లో ఘనంగా జరిగింది. ప్రముఖ సినీనటులు కొణిదల నాగబాబు ఈ కార్యక్రమానికి ప్రదాన అయిందిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిరివెన్నెల 71వ జయంతి సందర్భంగా అనకాపల్లి పట్టణం గాంధీ నగరంలో సిరివెన్నెల విగ్రహం వద్ద అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు చేతుల మీదుగా సిరివెన్నెల స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. ముందు గా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.. ఈ సందర్బంగా శాసన మండల సభ్యులు నాగబాబు మాట్లాడుతూ సినీ పరిశ్రమలో ఆయనతో మాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, చిత్ర పరిశ్రమలో నేను అన్నయ్య అని పిలిచిన ఏకైక వ్యక్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి అని ఆయన పేరు మీద నిర్మిస్తున్న సిరివెన్నెల స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందని, ఈ ప్రాంతం నుంచి మరొక సీతారామశాస్త్రి గారు రావాలని అన్నారు.. అనంతరం శాసనసభ్యులు కొణతాల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుట్టి వన్నె తెచ్చిన అలాగే తెలుగు భాషకి వెన్నె తెచ్చిన రచయితగా ఎన్నో ప్రఖ్యాత అవార్డులు అందుకున్న రచయితని, తెలుగు భాష ఉన్నంతవరకు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఖ్యాతి ఈ ప్రాంతంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఈ ప్రాంతానికి గౌరవం తెచ్చిన వ్యక్తిగా వచ్చే జనరేషన్ కి స్ఫూర్తిగా ఈ స్మృతి వనం నిలుస్తుందని అన్నారు.. అనకాపల్లి వాసిగా ఆయనను గౌరవించడం ఆనందం కలిగించిందని అన్నారు.. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొన్నారు

## పాట్ హోల్స్‌ను మరమ్మత్తు చేసే మొబైల్ యత్రాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, మే 20,ప్రభాతవార్త



మహా విశాఖ పట్నం నగరపాలక సంస్థ పరిధిలో రహదారుల మరమ్మ త్తులను వేగవం తంగా, నాణ్యతతో అతి తక్కువ సమయంలో నిర్వ హించేందుకు "పాట్ హోల్స్ బస్టర్స్ – ది రోడ్ డాక్టర్" అనే పేరుతో ఉన్న మొబైల్ మిషన్ ఎంతో ఉపయోగపడుతుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన సౌత్ జోన్ కలెక్టర్ ఆఫీస్ డౌన్ సూర్య హాస్పిటల్ సమీపంలో ట్రాన్స్ మెటలైట్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రదర్శించిన "పాట్ హోల్స్ బస్టర్స్ – ది రోడ్ డాక్టర్" అనే మిషన్ ద్వారా పాట్ హోల్స్ మరమ్మత్తు చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ మెటలైట్ ఇండియా లిమిటెడ్ ప్రదర్శించిన "పాట్ హోల్స్ బస్టర్స్ – ది రోడ్ డాక్టర్" అనే మొబైల్ యంత్రాల సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నిపుణ్ సోనీ పాట్ హోల్స్ తక్షణమే మరమ్మత్తులు చేసి రోడ్డు వేసే ప్రక్రియను కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా పాట్ హోల్ ను మరమ్మత్తు చేసి రోడ్డుకు సమాంతరంగా యధావిధిగా రోడ్డు వేసి పూడ్చే యంత్ర ప్రక్రియను జీవీఎంసీ కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి ఒక పాట్ హోల్‌ను సుమారు 20 నిమిషాల వ్యవధిలోనే మరమ్మత్తు చేయగల సామర్థ్యం ఈ యంత్రానికి ఉందని తెలిపారు. ఈ యంత్రం రాతి పిక్క, తారు ను అదే వేడి చేసుకొని మిక్సింగ్ చేసుకుంటూ, ఎక్కడైతే గుంతలు ఉన్నాయో అక్కడ ఈ యంత్రం ఆ గుంతను శుభ్రం చేసి యధావిధిగా రోడ్డుకు సమాంతరంగా గుంతను పూడ్చుతుందన్నారు. ఈ యంత్రం ఒక డ్రైవర్, నలుగురు కార్మికులతో పనిచేస్తుందన్నారు. నగరంలో వర్షాకాల సమయంలో ఏర్పడే గుంతలను త్వరితగతిన పూడ్చేందుకు ఈ మిషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. అలాగే, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఇటువంటి మిషన్ల కొనుగోలుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజును కమిషనర్ ఆదేశించారు. నగర రహదారుల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా ప్రజలకు, వాహనాల రాకపోకలకు మెరుగైన రహదారి సదుపాయాలు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ మిషన్ వినియోగ విధానం, సాంకేతిక అంశాలను స్వయంగా కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరులు రాయల్ బాబు, తిరుమలరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

vsp10:vsp10.qxd 20-05-2026 21:38 Page 1






## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



అనకాపల్లి, మే 20 (ప్రభాతవార్త): అనకాపల్లి ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఎన్టీఆర్ పేరు పై ప్రత్యేక పూజలు జరిపించారు. అనకాపల్లి సన్ కాస్ట్ హోటల్‌లో రక్తదానం కార్యక్రమం జరిగింది. రింగురోడ్డు వద్ద కేక్ కటింగ్ అనంతరం 2000 మందికి భారీ అన్న సమాధానం కార్యక్రమం అంగ రంగవైభోగంగా చేసారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎస్వి రమణ కుమార్, బుద్ధ జగదీష్ , అల్లు సురేష్ యాదవ్, కరణం సర్వేశ్వరరావు, సరగడం శంకర్, కోయిలాడ ఈశ్వర్, బొడ్డేడ గిరీష్ ఈశ్వర్, ఉల్లింగల సంతోష్, వనం సతీష్, దాడి అప్పారావు, సరగడం సురేష్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## 6వ జాతీయస్థాయి ఓపెన్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో ఎలమంచిలి క్రీడాకారుడు ప్రతిభ




ఎలమంచిలి, మే 20, ప్రభాతవార్త: 16వ జాతీయ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో పట్టణానికి చెందిన క్రీడాకారులు కాంస్య పథకం సాధించినట్లు టైక్వాండో కోచ్ నాగిరెడ్డి సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ జిల్లా గద్వాలలో జరిగిన 16వ జాతీయ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో సత్య స్పోర్ట్స్ అకాడమీ సీనియర్ క్రీడాకారుడు కుందల రవి 58 కిలోల సీనియర్ ఫైటింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. విజేతను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## 'నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం'



అనకాపల్లి, మే20 (ప్రభాత వార్త) : ప్రస్తుత.. ముదురు తున్న వేసవి కాలంలో పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు, కూటమి నాయకులు సంయుక్తంగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా బుధవారం జీవీఎంసీ 82, 83, 84 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాలలో 'మొబైల్ వాటర్ క్వాలిటీ టెస్టింగ్ లాబరేటరీ' (మొబైల్ ల్యాబ్) వాహనం ద్వారా విస్తృతంగా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ సీఎం రమేష్ ఆదేశాల మేరకు.. నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ సూచనలతో స్థానిక నేతలు, అధికారులు ఈ ఉమ్మడి తనిఖీల్లో పాల్గొ న్నారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ నగర్, వుడ్ పేట, గాంధీనగర్, అంజయ్య కాలనీ, ఏఎంసీ కాలనీ, విజయరామరాజు-పేట తదితర కాలనీలలో పర్యటించి, కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఆయా నీటి నమూనాలను అక్కడికక్కడే మొబైల్ ల్యాబ్ వాహనంలోని అత్యాధునిక పరికరాల ద్వారా పరీక్షించారు.ముఖ్యంగా నీటిలో ఉండాల్సిన క్లోరిన్ శాతంతో పాటు టర్బిడిటీ, పి హెచ్ విలువలు, ఫ్లోరైడ్, ఐరన్, నైట్రేట్, అమ్మోనియా,టీడీఎస్, ఆర్సెనిక్, మైక్రో బయోలాజికల్ వంటి కీలకమైన 10 రకాల పరీక్షలను లాబరేటరీ సిబ్బంది పూర్తి చేశారు. ఈ వేసవి ఎండల్లో ప్రజలకు ఎలాంటి నీటి ద్వారా వచ్చే అంటువ్యాధులు, డయేరియా వంటి రోగాలు సోకకుండా ముందస్తుగా నీటి శుద్ధతను పరీక్షించి సరఫరా చేయాలనే సంకల్పంతో శ్రమిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు, స్థానిక ప్రజాప్రతిని ధులకు... ఈ వార్డులలోని ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. 82 వ వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ , ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ ఆళ్ల రామచంద్రరావు, 82వ వార్డు టీడీపీ ఇం చార్జ్ పోలవరపు త్రినాథ్, సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేష్, అనకాపల్లి మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ బర్నికాన రాము, నూకాంబిక అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ సూరే సతీష్ లతో పాటు కూటమి నాయకులు అప్పికొండ రాజా, కసిరెడ్డి వాసు, గైపూరి త్రిమూర్తులు, ముప్పిడి మణికంఠ మరియు జీవీఎంసీ వాటర్ సప్లై డీఈ కె. గోపాలకృష్ణ, ఏఈ కె. హరీష్, ల్యాబ్ సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే జనవాణి కార్యక్రమం : ఎమ్మెల్యే సుందరపు



ఎలమంచిలి, మే 20, ప్రభాతవార్త: పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రతి బుధవారం నియోజకవర్గ స్థాయి జనవాని కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు సమస్యలపై వచ్చిన ప్రజల వద్ద నుండి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అర్జీలను స్వీకరించి, తక్షణం పరిష్కారమయ్యే వాటిని పరిష్కరిస్తున్నారు. పరిష్కారం కాని వాటిని అధికారుల సమన్వయంతో త్వరత గతిని సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజాన శేషు, జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, గంధం శివ, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు మండలాల ఎంఈఓలతో ఎమ్మెల్యే సమావేశం



ఎలమంచిలి, మే 20, ప్రభాతవార్త: పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని 4 మండలాల మండల విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమావేశమయ్యారు. సందర్భంగా ప్రభుత్వ పాఠశాల లోని విద్యార్థుల శాతం పెంచేందుకు కృషి చేయాలని దీనికి స్థానిక నాయకులు కూడా సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు ఏ ఏ గ్రామాల్లో పర్యటిస్తున్నారు ముందుగా తెలియజేస్తే ఆ గ్రామంలో ఉన్న నాయకులు కూడా కలుపుకొని పాఠశాలల్లోనే విద్యార్థుల శాతం పెంచాలని సూచించారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన ఫలితాలు వస్తున్నాయని ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నారని విద్యాబోధనలో కూడా మార్పు వచ్చిందని ఈ విషయాలను గ్రామంలోని విద్యార్థి తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలోని ఎలమంచిలి ఎంఈఓ 2 అరుణ్ కుమార్, అచ్యుతాపురం ఎంఇఓ దేవరాయలు,రాంబిల్లి, మునగపాక మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## తులసి మజ్జిగ చలివేంద్రం ప్రారంభం




ఎలమంచిలి, మే 20, ప్రభాతవార్త: పట్టణంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన తులసి మజ్జిగ చలివేంద్రం కార్యక్రమంలో మంగళవారం పట్టణానికి చెందిన టైలర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎండాకాలంలో ఎంతోమందికి దాహార్తిని తీరుస్తున్న ఈ చలివేంద్రాన్ని ప్రారంభించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ,బిజెపి జాతీయ నాయకులు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు వియ్యపు సత్తిబాబు, దుప్పట్ల శేషు , రమణ, కే భద్రరావు, బి అప్పారావు, బి నాయుడు, పూడి శ్రీను, రామ్ , గోవింద్, డి వెంకట్రావు సభ్యులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ గట్టు మరమ్మత్తు పనులకు శ్రీకారం



గొలుగొండ , మే 20 ప్రభాతవార్త : రావణపల్లి రిజర్వాయర్ గట్టు మరమ్మతుల పనులను నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల రాజేష్ బుధవారం ప్రారంభించారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెరువుతో రావులపల్లి రిజర్వాయర్ కుమిర ఉన్న గట్టు కృంగడంతో మరమతుకు 10 లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. గత ఏడాది రిజర్వాయర్ కు వచ్చిన వరద తాకిడికి ఉన్న మధు వద్ద గండి ఏర్పడింది, అలాగే కొమిర వైపు గట్టు తెలిపారు. కృంగినగట్టుకు కృంగినట్టు శాశ్వత మరమ్మత్తుగా 10 లక్షల రూపాయలు మంజూరు కావడంతో ఈ పనులకు చింతకాయల రాజేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. మధువై పనులకు మరో 40 లక్షలు టెండర్ పిలవాల్సి ఉందని ఈ ఈ బాలశౌర్యం తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగునీటికి ప్రాముఖ్యతను ఎక్కడ రైతులకు ఇబ్బంది కలగకుండా ఈ ఖరీఫ్ నాటికి పూర్తి స్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రిజర్వాయర్లో పూర్తిస్థాయి నీటిమట్టం నిలవ ఉండేలా గట్టు పతిష్టకు అవసరమయ్యే విధంగా రక్షణ చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు ఆర్ రాజేష్, ఇ ఇ బాలసుర్యం,, ఇరిగేషన్ ఏఈ రామన్నపాత్రుడు, తాగునీటి సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



అగనంపూడి, ప్రభాత వార్త: అగనంపూడి 79 వ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు సింగిడి సింహాచలం ఇటీవల బైపాస్ సర్జరీ జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయలు చెక్కును గాజువాక ఎమ్మెల్యే రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో 85 వార్డు టిడిపి అధ్యక్షులు కర్రి దశంద్ర, బలి రెడ్డి సత్యనారాయణ, చందు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రావణాపల్లిలో స్వచ్ఛ పదం కార్యక్రమం



గొలుగొండ, మే 20 ప్రభాతవార్త: గ్రామాల స్వచ్ఛత కోసమే ప్రతి బుధవారం రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మండల ప్రత్యేక అధికారి బాల సూర్యం అన్నారు. రావణపల్లిలో బుధవారం స్వచ్ఛపదం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తో కలిసి పనులను పరిశీలించారు. ప్రతి బుధవారం ఒక గ్రామ పంచాయతీ ప్రధాన రహదారులను లక్ష్యంగా చేసుకొని తొలగించే కార్యక్రమం తిన్నామన్నారు. రావణా పల్లి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న వ్యర్థాలను జెసిబి ట్రాక్టర్ సహాయంతో తరలించారు. 24 ట్రిప్పులుగా వ్యర్థాలను భారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారులు పరిశుభ్రత లక్ష్యం అని ప్రజలు కూడా ఎల్ల వద్ద నుంచి లభించే తడి పొడి చెత్తను వారి కేటాయించిన ప్లాస్టిక్ డబ్బాల్లో వేసి ఉంచితే క్లాప్ మిత్రాల వచ్చి సేకరిస్తారని అన్నారు. చెత్తను విరుగుగా రోడ్లు వెంబట వేయి రాదని ప్రజలు గమనించాలన్నారు. ఈఎల్‌పిఓ కొండలరావు,డిప్యూటీ ఎంపీడీవో నారాయణమూర్తి, ఏపీఓ సూర్యమనణి, ఏవో సుధారాణి,పంచాయితీ డెవలప్మెంట్ అధికారులు, క్లాప్ మిత్రాలు సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

## పూడిమడకలో గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమం



( అచ్చుతాపురం, మే 20 ప్రభాతవార్త ): అచ్చుతాపురం యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా గంజాయి బారిన పడకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచిస్తూ అచ్చుతాపురం మండలం పూడిమడక గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ యువత గంజాయి సహా ఎలాంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు కుటుంబాలు కూడా నాశనమవుతాయని హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మత్తు పదార్థాలకు బానిసైన వారిని అడిక్షన్ సెంటర్‌కు తరలించి, వారిలో మార్పు తీసుకురావడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, పోలీసు సిబ్బంది, మేరీగి బాపు నాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభను జయప్రదం చేయాలి



(అచ్చుతాపురం, మే 20 ప్రభాతవార్త ) : రైతాంగ సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగ పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న రైతు సంఘం తొమ్మిదవ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోము నాయుడు పిలుపునిచ్చారు.మునగపాకలోని రాధాకృష్ణ ఏసీ కళ్యాణ మండపంలో మే 23వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు మహాసభ ప్రారంభం కానుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం, ఎరువుల ధరలు తగ్గించడం, అవసరమైన ఎరువులు, విత్తనాలు సమయానికి సరఫరా చేయడం వంటి కీలక అంశాలపై సభలో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' కింద రూ.20 వేల ఆర్థిక సహాయం అందించడం, భూనిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయడం వంటి సమస్యలపై తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. రైతాంగ హక్కుల సాధన కోసం జరిగే ఈ మహాసభలో అచ్యుతాపురం మండలానికి చెందిన రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తోట వెంకటేష్, మైలపల్లి రమణ, నడుపూరు సోంబాబు, కొల్లి రాము, కూండ్రపు సన్యాసిరావు, కూండ్రపు సన్నిబాబు, కూండ్రపు అప్పారావు, తట్ట అప్పారావు, లాలం రాము, ధర్మరెడ్డి, సత్యనారాయణ, పిల్లా చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## పూడిమడకలో ఆధునిక మార్కెట్ యార్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి



(అచ్చుతాపురం, మే20, ప్రభాతవార్త): మత్స్యకారుల అభ్యున్నతి, వ్యాపార విస్తరణే లక్ష్యంగా అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామం కొండపాలెంలో ప్రతిపాదిత మార్కెట్ యార్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి దృక్పథానికి అనుగుణంగా ఆధునిక సదుపాయాలతో మార్కెట్ యార్డును నిర్మించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులు, వ్యాపారులు సులభంగా వచ్చి కొనుగోలు చేసే విధంగా విశాలవంతమైన మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలన్నారు. మత్స్యకారులకు అన్ని విధాలా ఉపయోగపడేలా పార్కింగ్, డ్రైనేజీ, రహదారులు తదితర మౌలిక వసతులను భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం మార్కెట్ యార్డు మ్యాప్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు.మత్స్యకారుల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధిపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎలమంచిలి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ప్రజలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలు ఏర్పాటు




కసింకోట, మే 20, ప్రభాత వార్త; కసింకోట మండలం చింతలపాలెం గ్రామంలో జూనియర్ నందమూరి తారక రామారావు పుట్టినరోజు వేడుకలు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రెండు చోట్ల అనగా చింతలపాలెం కోలని అభయాంజనేయ స్వామి గుడి వద్ద, సాయిబాబా గుడి వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేర్రిపోతుల నూకునాయుడు కొట్టే రాము, సియాద్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అనితమ్మ అభివృద్ధికి మరో మైలురాయి.. నెరవేరిన దశాబ్దాల కల : కొప్పిశెట్టి



(నక్కపల్లి, ప్రభాతవార్త): నక్కపల్లికి జూనియర్ సివిల్ జడ్జితో కూడిన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం మంజూరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ నక్కపల్లి తాలూకా కేంద్రంగా ఉన్నతప్పటినుంచి కోర్టు సముదాయం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఆ ప్రయత్నంగానే ఉండిపోయే తప్ప సాధ్యం కాదని అది ఒక్క అనితమ్మకే సాధ్యమని నిరూపిస్తూ పాయకరావుపేట నియోజకవర్గానికి మరో మైలురాయిగా ఇది కనిపిస్తుందని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు ఊహలకు అందని విధంగా అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత కృషి చేస్తున్నారని, అందుకు నిదర్శనం జూనియర్ సివిల్ జడ్జ్ తో పాటు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం మంజూరైన పరిస్థితిని అన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంలో సాధ్యం కాని పాయకరావుపేట సెంట్రల్ లైటింగ్ తో పాటు పారిశ్రామికంగా ఊహించని అభివృద్ధి గ్రామీణ రహదారుల నిర్మాణం, ఉత్తరాంధ్ర భక్తుల కొంగుబంగారం వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి ఈ విధంగా లెక్కలేని విధంగా అభివృద్ధికి అడుగులేస్తూ ఎస్. రాయవరం మండలం అడ్డ రోడ్డు డివిజన్ కేంద్రం ఏర్పాటు అ కారణంగా ఇక్కడ ఏర్పాటు జరుగుతున్న పరిస్థితులు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు . ఇదే కాకుండా నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం కొద్దిరోజుల్లో అది కూడా రూపు రేఖలు దిద్దుకోబోతుందని, ఇప్పటికే నక్కపల్లి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల సేకరణ చేయడం జరిగిందని ఇలా చెప్పుకుంటే ఇది ఒక పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి ఏనా అనే విధంగా ముక్కు మీద వేలు వేసుకునే విధంగా అనితమ్మ అభివృద్ధి ఇక్కడ కనిపిస్తుందని వెంకటేష్ అన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మొట్టమొదటి ధ్యేయం నక్కపల్లి డిగ్రీ కళాశాల ఏర్పాటు అని అందుకు ఇప్పటికే నిధులు మంజూరు కావడం అందుకు అవసరమైన స్థల సేకరణ కూడా జరిగిందని చెప్పారు. త్వరలో టెక్నికల్ కళాశాల పాయకరావుపేట నియోజకవర్గంలో మూడు ప్రాంతాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు జరగబోతుందని ,ఈ ఐదేళ్ల కాలంలో ఇది మా పాయకరావుపేట నియోజకవర్గం అనే విధంగా చూసే ప్రతి ఒక్కరు అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయే విధంగా అనితమ్మ కార్యరూపం దాల్చారని అన్నారు. కోర్టు భవనాలకు సంబంధించి మంత్రి అనితమ్మ ఆదేశాలతో ఏర్పాటు చేస్తున్నామని ,నిర్మాణం పూర్తయ్యే లోపల తాత్కాలికంగా భవనం పరిశీలన చేస్తున్నాము అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్న హోం మంత్రి ఇక్కడ న్యాయస్థానాన్ని కూడా ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు న్యాయపరమైన సేవలు అందనున్నాయి వెంకటేష్ చెప్పారు. కోర్టు మంజూరు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత అమ్మకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## 23 న మెగా జాబ్ మేళా

అనకాపల్లి , మే 20, (ప్రభాత వార్త): ఐటిఐ,ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ, నర్సింగ్, జీ ఎన్ ఎం , పదో తరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు అనకాపల్లి శివ ఐ టి ఐ కేంద్రం(డీ మార్ట్ సమీపం) లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో విద్యార్హత కలిగిన స్త్రీ , పురుష అభ్యర్థులు పాల్గొనవచ్చు అని తెలిపారు. అపోలో టైర్, హెటిరో, షిర్డీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్, స్వాతి ఎంటర్ ప్రైజెస్ రాంబిల్లి, ఎస్,ఆర్ విశాఖ, జయభేరి, హెటిరో మెడికల్ తదితర పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలకు అర్హులు తగిన ఎర్టిఫికెట్స్ తో ఈ నెల 23 న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 94406 41267, 92478 36912, 99890 26455 నంబర్ లను సంప్రదించాలని వెల్లడించారు.

## పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు



(నక్కపల్లి ,ప్రభాతవార్త): ప్రపంచ రక్తపోటు దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బుధవారం నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో గోడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. దీంతోపాటు పలు వైద్య పరీక్షలు తో పాటు వైద్య పరమైన పలు సూచన చేశారు.రక్తపోటు నివారణ ఆరోగ్య అవగాహనపై సిబ్బందికి సూచనలు చేయడంతో పాటు రక్తపోటును ప్రారంభ దశలో గుర్తించేందుకు క్రమం తప్పకుండా బిపి పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, ఒత్తిడిని నివారించడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చని వివరించారు.సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం, ధూమపానం , మద్యపానానికి దూరంగా ఉండడం ద్వారా రక్తపోటు , ఇతర ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని అవగాహన కల్పించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయానికి తాళాలు



(ఎస్. రాయవరం,మే 20, ప్రభాత వార్త ): మండల కేంద్రమైన ఎస్.రాయవరం గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం (ఏ.ఐ.ఏ.డబ్ల్యూ.యూ) జిల్లా అధ్యక్షులు యమ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయానికి తాళం వేసి ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ కార్యదర్శి శ్రీనువాసరావు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిపడా పనిదినాలు కల్పించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. పేస్ యాప్ ద్వారా హాజరు పేరుతో, సర్వర్ బిజీ టెక్నికల్ ఇష్యూ కారణాలతో, కూలీలకు పని లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు ఇబ్బందికరంగా ఉంటున్న పేస్ యాప్ తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో గతంలో మంచినీళ్ల సౌకర్యం, చలువ పందిళ్లు, ట్రాన్స్పోర్ట్ ఛార్జీలు, మజ్జిగ, లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, పనిముట్లు ఉచితంగా మంజూరు చేయడానికి బడ్జెట్లో తగిన నిధులను కేటాయించాలని, పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేటి నుండి పది రోజులపాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో అన్ని సచివాలయాల వద్ద ఇలాంటి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జూన్ 1వ తేదీన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలకు ప్రభుత్వం స్పందిస్తుందని భావిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధం అవుతున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులుఈశ్వరరావు, పోతు రాజు, మంగ దేవి, కుమారి, అప్పారావు, నాగమణి, రాజులమ్మ, సన్యాసమ్మ లతోపాటు ఉగాది కూలీలు పాల్గొన్నారు.

## రాజయ్యపేటలో మత్స్యకారులు వినూత్న కార్యక్రమాలు






(నక్కపల్లి రూరల్/ అడ్డు రోడ్డు, ప్రభాతవార్త): మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో భాగంగా, వేట నిషేధ సమయంలో మత్స్యకార లబ్ధిదారు లందరి ఖాతాల్లో రూ.20,000 చొప్పున నగదు చేరిన సందర్భంగా మండలంలోని రాజయ్యపేట గ్రామంలో మత్స్యకారులు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక తుఫాన్ సెంటర్ పైకి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.మత్స్యకారులందరి తరపున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు పిక్కి రాంబాబు, ఎంపీటీసీ పిక్కి సత్తియ్య , సొసైటీ అధ్యక్షులు పిక్కి కోదండరావు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి ) ,జనసేన పార్టీ మండల కార్యదర్శి బొంది గుర్రన్న, యూనిట్ ఇంచార్జ్ వాసుపల్లి శివాజీ, సిరిపల్లి అప్పలరాజు,బూత్ ఇంచార్జ్ మైలపల్లి ప్రసాద్, పిక్కి చిన్నారి, పిక్కి కిరణ్, పీక్కికోటి, పిక్కి కోటేశ్వరరావు, చోడిపల్లి అప్పలరాజు, కోదండరావు,లోవరాజు, అప్పలరాజు, కాశీరావు, రాజు, ముత్యాలు, కొండ, బంగారి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



( ఎస్. రాయవరం, మే 20, ప్రభాతవార్త ): మండలంలో రేవు పోలవరం గ్రామంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆయురారోగ్యాలు ఎల్లప్పుడూ ఉండాలని, అన్న నిత్యం ఫ్యాన్స్ మధ్యలోనే ఉంటూ తీసిన సినిమాలన్నీ హిట్లలు కొట్టాలనికోరుకున్నారు. అనంతరం 1500 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎరీపల్లి జగదీష్,గనగళ్ల నాగరాజు, బొందు ఆనంద్, అరకట్ల సతీష్ , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ పూర్ణ పుష్కల అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర కొప్పుల వెలమ సంఘం చైర్మన్ పీవీజీ కుమార్ రూ.1 లక్ష విరాళం

పాడేరు,మే20,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా పాడేరు ప్రధాన కేంద్రంలో గల స్థానిక శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి గాను రాష్ట్ర కొప్పుల వెలమ సంఘం చైర్మన్ పీవీజీ కుమార్ దంపతులు రూ.1 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన చైర్మన్ కుమార్ మాట్లాడుతూ ఈరోజుల్లో బడికి గుడికి భూములు ఇచ్చినటువంటి చరిత్ర ఏమైనా ఉంటే కొట్టగుల్లి వంశకులకు మాత్రమే ఉందని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు తెలియజేశారు. ఆలయ నిర్మాణం కోసం ఎంతో విలువైన భూమిని మీ తల్లిదండ్రులు మీ కుటుంబీకులు కేటాయించడం నిజంగా అభినందనీయమని కుమార్ తెలిపారు. నేటి కాలంలో ఒక సెంటు భూమి ఇచ్చేందుకు కూడా చాలామంది వెనుకాడుతున్న సమయంలో ఆలయ నిర్మాణం కోసం విస్తారమైన భూమిని కేటాయించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు.అలాగే ఆలయ అభివృద్ధి కోసం స్వయంగా సహాయ సహకారాలు అందించడంతో పాటు పలువురు ప్రముఖులను సంప్రదించి విరాళాలు సమీకరిస్తూ ఆలయాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని కుమార్ అభినందించారు. ప్రస్తుతం పాడేరు లోని అయ్యప్ప స్వామి ఆలయం అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం కొట్టగుల్లి సుబ్బారావు, నూతన కార్యవర్గం, భక్తులు అని పి వి జి కుమార్ అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ఈ ఆలయం ఏజెన్సీ ప్రాంతంలోనే ప్రసిద్ధిగాంచిన దేవాలయంగా రూపుదిద్దుకుంటుందని పి వి జి కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చీడికాడ మాజీ జడ్పిటిసి సత్యవతి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పి. గోవింద్, మార్కెట్ డైరెక్టర్ బురెడ్డి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సెక్రటరీ ఇమ్మడిశెట్టి అనిల్, రొబ్బి రాము కోశాధికారి ఆది, దాము, ప్రచార కార్యదర్శి వర్మ, ప్రధాన అర్చకులు ప్రవీణ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు చైర్మన్ కుమార్ దంపతులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

### అధికారులకు జిల్లా కలెక్టర్ టీ.నిశాంతి హెచ్చరిక

డుంబ్రిగూడ, మే 20 ప్రభాతవార్త



పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పై సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే చర్యలు తప్పదని అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి హెచ్చరించారు. డుంబ్రిగూడ మండలం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిషాంతి.టి, జిల్లా జాయింట్ కలెక్టర్ల తిరుమాని శ్రీ పూజ, జిల్లా రెవిన్యూ అధికారి (ఎఫ్ఏసి) ఎంవీఎస్ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 88 అర్జీలు నమోదయ్యాయి. వాటి రెవెన్యూ శాఖ సంబంధించిన భూ సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, సరిహద్దు వివాదాలకు సంబంధించి 10 అర్జీలు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, విద్యుత్, త్రాగునీరు, రోడ్స్, అంగన్వాడి బిల్డింగ్స్, ఇతర సంక్షేమ పథకాలు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 88 అర్జీలు దాఖలయ్యాయి. వచ్చిన ఫిర్యాదులపై శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అర్జీదారు ఇచ్చిన సమస్య ను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఏర్పాటుచేసిన ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యను తిరస్కరించినప్పుడు ఖచ్చితంగా సమస్యపై అర్జీ దారునికి వివరించాలని, పరిష్కారం ఎందుకు పరిష్కారం కాదు ఆ సమస్య యొక్క వివరాలు తెలియజేయాలని ఆమె అధికారులకు సూచించారు. అర్జీదారుని సమస్యలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసినప్పుడు ఐవీఆర్ఎస్‌లో నెగిటివ్ రాదని, అర్జీదారని పిటిషన్లు గడువులోగా పరిష్కరించక పోగా వారితో సక్రమంగా మాట్లాడకుండా, సమస్యను పరిష్కరించకుండా, ఉన్నందువల్లే అర్జీదారులు పదేపదే రిపీట్ అవుతున్నారని ఈ విషయాన్ని అధికారులు గమనించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, కెఆర్ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠరావు, జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ, ఐటీడీఏ ఏపీవో, జిల్లా, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అర్జీదారులు తదితరులు పాల్గొన్నరు.

## పోలవరం నిర్వాసితులకు ఇల్లు కాలనీల నిమిత్తం భూసేకరణ

### పోలవరం అడ్మినిస్ట్రేటర్ వి అభిషేక్

పాడేరు,మే20, ప్రభాతవార్త:



పోలవరం నిర్వాసితులకు ఇల్లు కాలనీల నిమిత్తం ప్రభుత్వ భూముల సేకరణ లో భాగంగా బుధవారం ఐ టిడిపిఓ ఆదిత్య వర్మతో కలిసి పోలవరం అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ కొయ్యూరు మండలం అడ్డాకుల పంచాయతీ వలసపాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 మందికి 11 ఇళ్లతో ఒక్కొక్క కాలనీ చొప్పున, కాలనీకి 50 ఎకరాలతో ప్రణాళికలు తయారు చేయాలని పేర్కొన్నారు. వలసపాడు గ్రామంలో గిరిజనేతరుల పట్టాదారుల భూములు పరిశీలించారు.



ప్రభుత్వ ఎకరాదారులను గుర్తించి వాళ్ళకి ప్రభుత్వం భూమి ఎంకరోచ్మెంట్‌లో ఇవ్వబడిందా, వాళ్లకి డి పట్టా ఉందా, ప్రైవేటు భూములు ఉన్నాయా వివరాలతో నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కొయ్యూరు మండలం చుట్టుపక్కల ఉన్న బాలారామ్, కంటారాం, ఆర్.కొత్తూరు గ్రామాలలో గిరిజనేతరులు రెవెన్యూ రికార్డ్స్ సమర్పించాలని లేనిచో సంబంధిత జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి తెప్పించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు తహసిల్దార్ పి.మురళి బాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజన్న దొర, విలేజ్ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అరకులోయలో భారత్ గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయాలి

అరకులోయ, మే 20, ప్రభాతవార్త



అరకులోయ మండల కేంద్రంలో భారత గ్యాస్ గోడౌన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక టౌన్ ఎంపీటీసీ దురియా ఆనంద్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అరకులోయలో భారత్ గ్యాస్ గోడౌన్ లేకపోవడం వలన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వంట గ్యాస్ కొరతతో గిరిజనులు అవస్థలు పడుతున్నారని, భారత్ గ్యాస్ గోడౌన్ స్థానికంగా ఉంటే ఇబ్బందులు తొలగితాయని చెప్పారు. ప్రస్తుతం శృంగవరపు కోట, వి మాడుగుల నుండి భారత్ గ్యాస్ అరకులోయ కు సరఫరా అవుతుందని, అయితే ఆయా ప్రాంతాల నుండి గ్యాస్ వ్యాన్లు ఎప్పుడు వస్తాయో తెలియక లబ్ధిదారులు ప్రతిరోజు నిరీక్షణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు వి మాడుగుల నుండి వస్తున్న భారత్ గ్యాస్ కనెక్షన్లలో కొన్ని హుకుంపేట, మరికొన్ని దేవరాపల్లి గ్యాస్ ఏజెన్సీలకు తరలిపోయినట్లు లబ్ధిదారులు చెబుతున్నారని, గ్యాస్ కోసం ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఈ విధంగా తమకు తెలియకుండా తమ కనెక్షన్లు వేరే గ్యాస్ ఏజెన్సీలకు తరలించడం అన్యాయమని లబ్ధిదారులు వాపోతున్నట్లు ఆయన తెలియజేశారు. వీటిపై సంబంధిత శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి భారత్ గ్యాస్ కొరత లేకుండా చూడాలని, అలాగే అరకులోయలో ప్రత్యేకంగా గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఇంటింటా అవగాహన

మాధవధార, మే 20, ప్రభాతవార్త



విశాఖలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశా లలో అత్యధిక విద్యార్థులు కలిగిన ప్రాథ మిక పాఠశాలగా ఉండాలనే ధ్యేయంతో బర్మాక్యాంప్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత కుమారి ఆదేశాలు మేరకు సిబ్బంది బుధవారం ఇంటింటా అవగాహనా కల్పించారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల బర్మా కాలనీలో ఉండే ప్రత్యేకతలను వివరించారు. చదువుకు పేదరికం అడ్డంకి కాదని, అదేవిధంగా పిల్లల చదువు ఏ కుటుంబాన్ని పేదరికంలోనికి నెట్టకూడదని, అందుకుగాను ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. ఈ వేసవి అంతా తమ సిబ్బంది శ్రమించి తమ పాఠశాలలో అత్యధిక విద్యార్థులను చేర్పించడం ద్వారా విశాఖలో అత్యధిక ఎన్రోల్మెంట్ కలిగిన పాఠశాలగా గుర్తింపు తెచ్చుకోవడమే తమ ఆశయమని, ఈ ఆశయ సాధనలో ఎండలు అడ్డంకి కాదని ఉపాధ్యాయులు రజని లక్ష్మీ, పావని, మాధవి లత అన్నారు.

## సుంకర మెట్టలో స్వచ్ఛ పథం

### పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత : ఎంపీడీవో వీసం ప్రసాద్

అరకు రూరల్, మే 20, ప్రభాతవార్త



అరకులోయ మండలంలోని ప్రతి బుధవారం గ్రామపంచాయతీలలో నిర్వహిస్తున్న "స్వచ్ఛ పథం" కార్యక్రమంలో భాగంగా సుంకరమెట్ట గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమం సుంకరమెట్ట కాఫీ తోటల సమీపంలోని ఉడెన్ బ్రిడ్జి నుంచి పీహెచ్‌సీ సుంకరమెట్ట వరకు నిర్వహించబడింది. సుమారు 1.5 కిలోమీటర్ల పరిధిలో నిర్వహించిన ఈ పారిశుధ్య కార్యక్రమంలో స్థానిక ప్రజలు చురుకుగా పాల్గొని పరిసరాల పరిశుభ్రతకు సహకరించారు. ముఖ్యంగా ప్రజా ప్రదేశాలు, రహదారులు, వీధులు మరియు కాఫీ తోటల సమీపంలోని దుకాణాల పరిసరాలలో చెత్త తొలగింపు మరియు శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు పారిశుధ్య కార్యక్రమాలలో నిరంతరం భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీసం ప్రసాద్, సుంకరమెట్ట స్పెషల్ ఆఫీసర్ పి. భారతి రత్నం, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి రఘు భోగిరాజు, పిడిఒలు, ఎస్‌జిఎస్ డబ్ల్యు సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కుటుంబ సమేతంగా కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు మే 20,ప్రభాతవార్త



ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కుటుంబ సమేతంగా బుధవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి సుభద్ర కుటుంబంతో కొద్దిసేపు గడిపారు. గిరిజన ప్రాంతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం పైన కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా ఈ సందర్భంగా చర్చించారు. తన కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఎక్కువ సమయం కేటాయించి తమకెంతో ఆనందాన్ని కలిగించారని సుభద్ర సంతోషం వ్యక్తం చేశారు.

## రెవెన్యూ అధికారుల చర్యలు నిలుపుదల చేయాలి..

### గిరిజన సంఘం డిమాండ్

హుకుంపేట, మే 20, ప్రభాతవార్త



మండల కేంద్రంలో 1/70 చట్టాన్ని వ్యతిరేకిస్తూ రెవెన్యూ అధికారులు చేపడుతున్న చర్యలు వెంటనే నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి. ఎస్ హైమావతి, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు కోరారు. గిరిజనురాలు లకే చిట్టమ్మ అనే విధవరాలు ఆమె స్వయం ఉపాధి పొందడం కొరకు ఒక దుకాణం జూనియర్ కాలేజ్ హాస్టల్ ఎదురుగా కట్టుకుంటుంటే రెవెన్యూ అధికారులు వాటిని తొలగించడానికి బుధవారం రావడం దారుణమని వారు అన్నారు. గతంలో1998వ సంవత్సరంలో భూమి ఇవ్వడం జరిగింది. రోడ్డు వెడల్పు కారణంగా భూమి కోల్పోయి నిరాశలు రాలయిందని, భర్త లేక పిల్లలు పోషణ కొరకు ఇబ్బంది పడుతున్నామని చిన్న దుకాణం నిర్మించుకుంటే ఆగమేగాలిమీద రెవిన్యూ అధికారులు తొలగించడం దారుణమని వారు మండిపడ్డారు. మండల కేంద్రంలో గిరిజనేతరులు అనేక అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిపై అనేకమార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు ఒక్కదానిమీద కూడా చర్యలు తీసుకోలేదు 1/70 చట్ట ప్రకారంగా ఐదవ షెడ్యూల్ భూభాగంలో ఆదివాసులకే సర్వహక్కులు కలిగి ఉంటారు. వారు నిర్మించుకునే నిర్మాణాలను తొలగిస్తూ గిరిజనేతరులు నిర్మించుకుంటున్న నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనిమండి పడ్డారు. రెవెన్యూ అధికారులు ఇదే దుర్మార్గమైన చర్య ఇప్పటికైనా అధికారులు మేము ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన ఆందోళనలు సంఘం ద్వారా చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నా మన్నారు.గిరిజనుడు నిర్మించుకుంటున్న నిర్మాణాన్ని తొలగించే చర్యలు ఆపాల్సిందేనని వారు డిమాండ్ చేసారు. 1/ 70 చట్టం కొచ్చి ఐదవ షెడ్యూల్ భూభాగం కోసం ఎవరు మాట్లాడదానికి వీల్లేదని తహశీల్దార్ అనడం దురదృష్టకరమన్నారు. 1/70 చట్టాన్ని రక్షించుకోవడానికి గిరిజన సంఘం నిరంతరం ఉద్యమిస్తుందన్నారు. ఆ సంఘ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చిన తహశీల్దార్‌కి గిరిజనేతరులు కదుతున్న అక్రమ నిర్మాణాలు ఎందుకు కనబడలేదు బుడ్డిగా కొండమ్మ ఇప్పటికే అనేక నిర్మాణాలు చేపట్టి వాటిని లక్షల రూపాయల్లో విక్రయించుకుంటుంది ఇప్పుడు కూడాను వెలుగు కార్యాలయం, విలేకరుల స్థలం సర్వే నెంబరు 75 భూమిని మరల బొడ్డిగా కొండమ్మ ఆక్రమించుకుంది ఆ విషయం మీద రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించలేదు తాసిల్దార్ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నా మన్నారు. మండలంలో గిరిజనులు కడుతున్న నిర్మాణాలను తొలగిస్తూ గిరిజనేతరులు కడుతున్న నిర్మాణాలను సహకరిస్తున్న రెవెన్యూ అధికారుల తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులకు హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలు కడుతున్నది లేదని తాసిల్దారు వివరణ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. బుడ్డి కొండమ్మ కట్టినటువంటి నిర్మాణం అది అక్రమామ సక్రమమా తాసిల్దార్ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మండలంలో జరిగినటువంటి అక్రమ నిర్మాణాలపై గ్రీవెన్స్‌లో రెవెన్యూ సదస్సులో గిరిజన సంఘం అనేక ఫిర్యాదులు చేసి ఉంది. 1/70 చట్టం అయిదవ షెడ్యూల్ భూభాగం కొచ్చి మాట్లాడిన వారికి అరెస్టు చేయమని అధికారులు అక్రమ నిర్మాణాలకు ఎందుకు అరెస్టు చేయాలని చెప్పి ప్రశ్నిస్తున్నాం. అధికారులు తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని వారు హెచ్చరించారు వీటిని ఇప్పటికే ఆపకపోతే రేపటి నుంచి జరిగే ఆందోళనలకు రెవెన్యూ అధికారుల బాధ్యత వహించాలన్నారు.

## ఉపాధి హామీ పనుల నిర్వహణ జెఎస్‌జె అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

డుంబ్రిగూడ, మే 20 ప్రభాతవార్త



మండలంలోని జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జెఎస్.జె.బి అమలు తీరును బుధవారం పరిశీలించి జిల్లా కలెక్టర్ టివి నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి వేతన దారులతో వారు కాసేపు ముచ్చటించారు. అనంతరం స్వచ్ఛ పద, హెల్మెంట్ ధరణ వల్ల కలిగే ప్రయోజనాల అలాగే, స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అక్షర బోధన చేశారు. కిచమండ గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన జన్ భాగీ దారి అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, డ్యామా పిడి, అరకు క్లస్టర్ ఏపీడి స్థానిక ఎంపీడీవో విశ్వనాథ్ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సంఘం నాయుడు ఈసీ, టిఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి వేతన దారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### -ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక మే 20,ప్రభాతవార్త

సమాజ వికాసానికి, యువత భవిష్యత్తుకు కీలకమైన గ్రంథాలయాల ఆధునీకరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని లైబ్రరీల స్థితిగతులపై చర్చించారు. అనంతరం రూ.75 లక్షలతో ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న గాజువాక గ్రేడ్–3 శాఖా గ్రంథాలయాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో నూతనంగా 2 పుస్తక నిక్షిప్త కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గాజువాక, పెదగంట్యాడలలో సొంత భవనాలు ఉండగా, నాతయ్యపాలెంలో నూతన భవనం త్వరలో ప్రారంభం కానుందన్నారు. గాజువాక లైబ్రరీ కోసం రూ.60 లక్షలతో భవన నిర్మాణం చేపట్టగా, కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ తమ సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్‌లో నాణ్యమైన ఫర్నిచర్, ఇతర వసతులు కల్పించిందని తెలిపారు. జీవీఎంసీ నుంచి గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సుమారు రూ. 218 కోట్ల లైబ్రరీ సెస్ బకాయిలను ఇప్పించాలని, లైబ్రరీలను ఇ–లైబ్రరీలుగా మార్చి అభ్యర్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పల్లా శ్రీను, గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కుమార్ రాజా, లైబ్రేరియన్ సూర్యకళ పాల్గొన్నారు.



## అక్రమ వసూళ్లు చేస్తున్న నిత్య భారత్ గ్యాస్ ఏజెన్సీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి - పొద్దు బాలదేవ్ డిమాండ్

అరకు, రూరల్, మే 20, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం కేంద్రంలో భారత్ గ్యాస్ సరఫరా చేస్తున్న నిత్య భారత్ గ్యాస్ ఏజెన్సీ లబ్ధిదారుల నుండి అక్రమ వసూలను పాల్పడుతున్నారని, తక్షణమే ఆ ఏజెన్సీ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదే డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలి మండల కేంద్రంలో ఆన్ లైన్‌లో గ్యాస్ బండ 937 రూపాయలకు విక్రయించాల్సి ఉండగా, నిత్య గ్యాస్ ఏజెన్సీ మాత్రం ఒక్కొక్క గ్యాస్ సిలిండర్ 1020 రూపాయలు చొప్పున విక్రయిస్తూ, ఒక్కో గ్యాస్ సిలిండర్‌పై అదనంగా 80 రూపాయలు అక్రమంగా వసూలు చేయడం అన్యాయమని, తక్షణమే నిత్య భారత్ గ్యాస్ ఏజెన్సీ పై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ లబ్ధిదారులతో కలిసి అరకులోయ తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆదివాసి ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వి మాడుగుల శ్రీలక్ష్మి భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి డెలివరీ చేయకుండా సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ ఇవ్వకుండా అక్రమంగా విక్రయిస్తున్నారని దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అనుమతులు లేని పశు వధ చట్ట రీత్యా నేరం

### పశువైద్యాధికారి లావేటి ప్రదీప్ కుమార్

ముంచంగిపుట్టు, మే 20, ప్రభాతవార్త



అనుమతులు లేకుండా పశు వధ నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ముంచంగిపుట్టు మండల పశు వైద్యాధికా లావేటి ప్రదీప్ కుమార్ అన్నారు. అనుమతులు లేని పశు వధ పై బుధవారం సుజన కోట, సెల్లూం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా జంతువత పై చట్టపరంగా డి.ఓ.ఎస్ లైసెన్స్ ఉన్న వధ సాలలలో మాత్రమే పశువులను వధించాలని, పశు వైద్యుల ధ్రువీకరణ పొందిన పశువులను మాత్రమే వధించాలని జంతు సంక్షేమ చట్టాలు పి.సి.ఎ యాక్ట్ 1960, సంబంధిత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధమని, చట్టరీత్య నేరం అన్నారు. పశువాద చట్టాలను అతిక్రమించి ఒంటెలను, గోవులను వధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా పశువులకు అనవసరమైన నొప్పి లేదా బాధను కలిగించరాదని పిసిఏ యాక్ట్ 1960లోని నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపైన మన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## కణితిలో ఘనంగా శ్రీ దుర్గాలమ్మ 'తోలేళ్లు'

గాజువాక,ప్రభాతవార్త



జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని కణితి కాలనీలో వెలసిన గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బుధ వారం రాత్రి నిర్వహించిన అమ్మవారి 'తొలియేళ్లు' (తోలేళ్లు) కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను జయప్రదం చేశారు. గురువారం అమ్మవారి ప్రధాన జాతర మహోత్సవం జరగనుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 4 గంటల నుంచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారని, సాయంత్రం ఘటాల ఊరేగింపు, 'అనుపు' కార్యక్రమంతో జాతర ముగియనుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా నెమలి డాన్సులు, కేరళ నృత్యాలు, తప్పెట గుళ్ళు, బిందెల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భక్తుల వినోదం కోసం వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో మూడు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, కుల సంఘాల పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## గాజువాక లైబ్రరీలో వేసవి శిక్షణ శిబిరం

గాజువాక,మే 20,ప్రభాతవార్త



స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, చెప్పడంతో పాటు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగా టీచర్ సత్యనారాయణ హాజరై చిన్నారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో ఈరోజు కార్యక్రమం ముగిసింది. శిబిరంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవ ఆర్భాటం.. వారం రోజుల ముచ్చట!

### రూ. 10 కోట్లతో నిర్మించిన 'అల్లూరి పార్కు'కు తాళాలు -అసంపూర్తిగా రూ. 20 లక్షల బాక్స్ క్రికెట్ పనులు -ప్రజాధనం వృథాపై స్థానికులు, పర్యాటకుల తీవ్ర అసహనం

గాజువాక,మే 20,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గ పరిధిలోని 76వ వార్డులో సుమారు రూ.10 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కు దుస్థితి ఇది. పాలకుల హడావుడి, అధికారుల నిర్లక్ష్యానికి ఈ పార్కు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. కొన్ని నెలల క్రితం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎంతో ఆర్భాటంగా ఈ పార్కును ప్రారంభించారు. చుట్టుపక్కల కాలనీల ప్రజలు, పిల్లలు ఆహ్లాదంగా గడుపుతారని భావిస్తే.. ఆ ఆనందం వారం రోజులు కూడా నిలవలేదు. పార్కు ప్రారంభించిన వారం రోజులకే "బ్యాలెన్స్ పనులు ఉన్నాయి" అంటూ అధికారులు ఒక నోటీసు బోర్డు తగిలించి గేట్లకు తాళాలు వేశారు. నెలలు గడుస్తున్నా ఆ బ్యాలెన్స్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో, ఆ తాళాలు ఎప్పుడు తెరుచుకుంటాయో చెప్పే నాథుడే కరువయ్యాడు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ పార్కు, నేడు ప్రజాధనం వృథాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

### అటకెక్కిన 'బాక్స్ క్రికెట్'.. యువత ఆశలపై నీళ్లు!

స్థానిక యువత క్రీడా అవసరాల కోసం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని, పార్కు ఆవరణలోనే రూ.20 లక్షల అంచనా వ్యయంతో 'బాక్స్ క్రికెట్' కోర్టు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు పనులైతే ప్రారంభించారు కానీ, వాటిని ముగించడంలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారు. ప్రస్తుతం అక్కడ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసినా, యువతకు మాత్రం ఆడుకునే భాగ్యం కలగలేదు. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేసినా పట్టించుకునే వారు లేరని స్థానికులు మండిపడుతున్నారు. "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా మారిన ఈ పనులను చూసి నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

### పర్యాటకుల అసహనం....

సాయంత్రం వేళల్లో పిల్లలను ఆడుకోవడానికి తీసుకువస్తున్న తల్లిదండ్రులకు, వృద్ధులకు మూసి ఉన్న గేట్లే దర్శనమిస్తున్నాయి. తీరా ఇక్కడికి వచ్చాక పార్కు మూసి ఉండటంతో తీవ్ర నిరాశతో, అసహనంతో పర్యాటకులు వెనుదిరుగుతున్నారు. "కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పెట్టి, పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు చేయడం ఎందుకు ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎందుకు?" అని స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. మరి ఇంత జరుగుతున్నా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అసంపూర్తిగా ఉన్న బాక్స్ క్రికెట్ పనులను పూర్తి చేయించి, అల్లూరి పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## న్యూ గాజువాక జంక్షన్‌లో 'కూలీల' నిరీక్షణ స్థలం మార్పు

గాజువాక,మే 20,ప్రభాతవార్త

న్యూ గాజువాక జంక్షన్ వద్ద ప్రతిరోజూ ఉదయం ఎదురవుతున్న తీవ్ర ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. జంక్షన్ వద్ద కూలీల రద్దీ కారణంగా నిత్యం వాహనదారులు, పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కూలీల నిరీక్షణ స్థలాన్ని సమీపంలోని జింక్ గేట్ ప్రాంతానికి మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతిరోజూ ఉదయం 6.00 గంటల నుండి 9.00 గంటల వరకు న్యూ గాజువాక జంక్షన్ వద్ద వందలాది మంది రోజువారీ కూలీలు గుమికూడడం వల్ల తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీనిపై స్పందించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) షేక్ హుస్సేన్ ఇకపై కూలీలంతా కేవలం జింక్ గేట్ వద్ద మాత్రమే నిరీక్షించాలని స్పష్టం చేశారు. జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన ఈ చర్యకు కార్మికులు, మేస్త్రీలందరూ సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ సిబ్బందికి రేపటి నుంచి హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్



అనకాపల్లి, మే 20 (ప్రభాత వార్త): నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బంది మానసిక ఒత్తిడిని అధిగమించి, శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ ట్రైనింగ్ వింగ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీస్ సిబ్బంది కోసం మే 21 మూడు రోజుల పాటు మే 23 వరకు ఉచిత హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణ సాధన తరగతులు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నీ శిక్షకులు బుధవారం (ట్రైనర్స్) కలిసి వివరించారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు నిర్వహిస్తారు. శిక్షణా తరగతులు జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం , పరవాడ సబ్ డివిజన్ల పరిధిలో జరుగుతాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సబ్ డివిజనల్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.తమ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ తప్పనిసరిగా ఈ ధ్యాన తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.పోలీస్ సిబ్బంది మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నివారణకు ఎంతో దోహదపడే ఈ సువర్ణ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



(నక్కపల్లి, (ప్రభాతవార్త) నక్కపల్లి సమీపంలో జల ధార- జల హారతి కార్యక్రమంలో భాగంగా చెరువుల పనులు చేస్తున్న ఉపాధి కూలీలను బుధవారం కలసిన టిడిపి నాయకులు ఎండ అధికంగా ఉందని జాగ్రత్తలు తీసుకోవాలని తెలియ జేస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ దేశం అధ్యక్షులు అద్దూరి లోవరాజు, మీగడ సత్యనారాయణమూర్తి ,కర్రీ వెంకట సత్యనారాయణ( కె.వి), పి. రమణ, తదితరులు ఉన్నారు.

## ఖాళీ బిందెలతో మహిళల నిరసన



(నక్కపల్లి ,ప్రభాతవార్త): బుచ్చిరా జుపేట పంచాయితీ నల్లమట్టపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు ,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం. రాజేష్ గ్రామ స్తులతో కలిసి తాగునీరు సమస్యపై కాలి బిందెలతో నిరసన తెలియజే శారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు మాట్లాడుతూ తక్షణమే మంచినీటిని సరఫరా చేయాలనీ డిమాండ్ చేశారు.అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంపీడీఓ నీటిపారుదల శాఖ కార్యాలయాల ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. నాయకులు ఎం.మహేష్ బాబు,కె.దేముళ్ళు,బి.అప్పలరాజు, ఎన్.నాగేశ్వరరావు, ఎం.అప్పారావు, ఎన్.చిలకమ్మ, ఎన్.సూర్యకాంతం, ఎం.సన్యాసమ్మ, ఎం.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## రాజయ్యపేటలో ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు




(అడ్డు రోడ్డు ,(ప్రభాతవార్త) మండలం లోని రాజయ్యపేట గ్రామంలోని సూదుల వారి వీధిలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం రాత్రి అభిమానులు ఘనంగా జరుపుకున్నారు.కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమాన హీరోకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన దెందుకూరి



(నక్కపల్లి ,ప్రభాతవార్త) : మండలంలోని వేంపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఇన్చార్జ్ ఎంపిడిఓ దెందుకూరు సీతారామరాజు బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి సేకరిస్తున్న చెత్తను సంపద కేంద్రానికి తరలించే విధంగా ప్రతి ఒక్కరు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయనతోపాటు కార్యదర్శి ఉన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన



(నక్కపల్లి ,(ప్రభాతవార్త) మండలం లోని కాగిత గ్రామంతో పాటు చిన్న తీనార్ల, పెద్ద తీనార్ల స్వచ్ఛ పదం కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను ఇన్చార్జ్ ఎంపీడీవో దెందు కూరు సీతారామరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛరథం ఉపయోగాలు ఆయన గ్రామస్తులకు వివరించారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## పైడిపాల ఏరియాలో పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు



మాకవరపాలెం, మే 20 ప్రభాతవార్త : పైడిపాల, బూరుగుపాలెం రెవిన్యూ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటుకు, ప్రైవేటు కంపెనీ యాజమాన్యంతో కలిపి రెవిన్యూ అధికారులు భూములు పరిశీలించారు. ఈమేరకు బుధవారం మండలంలోని పైడిపాల, పెద్దపాలెం పాపయ్య పాలెం ఏరియాలో సంబంధించిన భూము లను ఏపీఐఐసీ అధికారులు రెవెన్యూ అధికారులు ప్రైవేటు కంపెనీకి చెందిన యాజమాన్యంతో కలిసి భూము లను పరిశీలించారు. పైడిపాల పాపయ్యపాలెం బుచ్చన్నపాలెం,మునిడిపాలెం ఏరియాలో గతంలో ఉన్నతాధి. కారుల ఆదేశం మేరకు రెవిన్యూ అధికారులు 4250 ఎకరాలు సర్వే చేసిన విషయం తెలిసిందే. మాకవరపాలెం మండలంలో పైడిపాల ఏరియాలో ఒక ప్రైవేటు కంపెనీ యాజమాన్యం పరిశ్రమ నిర్మాణానికి 500ఎకరాలు కావలసి ఉండగా,ఏపీఐఐసీ అధికారులతో కలిసి పరిశీలించారు. మాకవరపాలెం తాసిల్దార్ లోకారపు రామారావు,రెవెన్యూ సిబ్బంది సర్వే అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, ప్రైవేట్ కంపెనీ యాజమాన్యంతో కలిసి భూములను పరిశీలించి పరిస్థితిపై ఆరా తీశారు. ఈసందర్భంగా పైడిపాల రెవిన్యూ పెద్దిపాలెం రెవెన్యూ,బూరుగుపాలెం రెవిన్యూలోని పాపయ్యపాలెం ముసిడిపాలెం, గ్రామాలకు చెందిన రైతుల భూములను పరిశీలించారు. పైడిపాల పాపయ్యపాలెం మధ్యలో భారీ పరిశ్రమలు రానున్నాయంటూ గతంలో విస్తృతంగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారం ఏపీఐఐసీ అధికారులు ప్రైవేట్ కంపెనీ యాజమాన్యంతో కలిపి స్థానిక రెవిన్యూ అధికారులు మరో మారు భూములు పరిశీలించడంతో ఏమి జరుగుతుందో తెలియక రైతులలో అయోమయ స్థితి ఏర్పడింది.బుధవారం అధికారులతో కలిసి వచ్చిన ప్రైవేటు కంపెనీ యాజమాన్యానికి సుమారు 500 ఎకరాల భూమి అవసరం ఉంటుందని, దీనిపై పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను కోరినట్టు తెలిసింది.ఏది ఏమైనా మాకవరపాలెంలో పైడిపాల ఏరియాలో పరిశ్రమలు ఏర్పాటు ఖాయమని దీని సంబంధించి రికార్డు పరమైన సర్వే ప్రక్రియ పూర్తి చేశారు.

## రోడ్లు, భవనాల శాఖ ఈఈతో సమావేశం



(ఎస్.రాయవరం, మే 20, ప్రభాతవార్త ): ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యా సాగర్ తో వైస్ ఎం.పి.పి బొలిశెట్టి గోవిందరావు, సోమిరెడ్డి రాజు, బుధవారం సమావేశం అయ్యారు. ధర్మవరం - అగ్రహారం నుండి ఎస్.రాయవరం వరకు రోడ్డు ఆధునీకరణ కొరకు చర్చించడం జరిగినది. దీనిపై విద్యా సాగర్ మాట్లాడుతూ... ఈ పనికి తమ శాఖ ద్వారా హోం మంత్రి వంగలపూడి అనిత కృషితో సుమారు 4 కోట్లు మంజూరు అయ్యాయని, ఇప్పటికీ మంత్రి శంకుస్థాపన చేశారని, ఈ పనులకు టెండర్ కూడా పిలవడం జరిగిందని, ముగ్గురు టెండర్లు వేయడం జరిగిందని, టెండర్ ఫైనల్ అయిన తర్వాత త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. మొత్తం రోడ్డు డబుల్ రోడ్డుగా చేయడానికి ఇంకా 4 కోట్లు రూపాయలు అవసరమవుతాయన్నారు , ఈ 8 కోట్లు రూపాయలు నిధులు వి.ఎం.ఆర్.డి.ఎ నిధులు మంజూరు తో హోం మంత్రి అనిత కృషి తో మంజూరు చేయడానికి అంగీకరింపజేశారని, ఈ ఎస్టిమేట్ 8 కోట్లు రూపాయలు తో తమ శాఖ వేయడం జరిగిందని, ఈ నిధులు త్వరలో మంజూరు అయితే 12 కోట్లు రూపాయలు తో మండల ప్రజలు కోరిక నెరవేరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బొలిశెట్టి, సోమిరెడ్డి, కొణతాల శ్రీను వాసరావు, విద్యా సాగర్ ను, శాలువా కప్పి అయ్యప్ప ఫోటో ఫ్రేమ్ ఇచ్చి సన్మానించారు.

## ఆన్లైన్ మందుల విక్రయాలకు చెక్ పెట్టాలి

**నర్సీపట్నం జోన్ లో400 మెడికల్ షాపులు బంద్, కెమిస్టుల భారీ ర్యాలీ**




నర్సీపట్నం,మే 20,ప్రభాతవార్త: అఖిల భారత కెమిస్టులు మరియు డ్రగ్గిస్టుల సమాఖ్య పిలుపు మేరకు నర్సీపట్నం జోన్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ షాపుల యజమానులు నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా నర్సీపట్నం జోన్ పరిధిలోని సుమారు 400 మెడికల్ షాపులు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆన్లైన్లో మందుల విక్రయాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న అధిక డిస్కౌంట్లను నియంత్రించాలని, నకిలీ మరియు ప్రమాదకర మందుల అమ్మకాలను అరికట్టాలని ప్రధాన డిమాండ్లతో కెమిస్టులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల కెమిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కొప్పర్తి బాలసుబ్రమణ్య కుమార్, పద్మనాభుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో 2020 మార్చిలో ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్లో నకిలీ మందుల విక్రయాలు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న, మధ్యతరహా మెడికల్ షాపుల యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వారికి తగిన సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన కెమిస్టులు వాసు, నారాయణరావు, రమణ, అశోక్, బుజ్జి, శ్రీనివాసరావు, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ సత్తిబాబు తృతీయ వర్ధంతి




నర్సీపట్నం,మే 20,ప్రభాతవార్త: నర్సీపట్నంలో సిఐటియు నాయకులు కామ్రేడ్ డి.సత్తిబాబు తృతీయ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సత్తిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కామ్రేడ్ సత్తిబాబు నమ్మిన సిద్ధాంతం, ఎత్తిన జండా కోసం చివరి వరకు నిలిచారన్నారు. ఈ ప్రాంతంలో కార్మిక, కర్షక సమస్యలపై నిరంతరం పని చేశారని, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల నిర్మించడంలో ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షకులపై తీవ్రమైన ధరల భారాన్ని వేశారన్నారు.దీంతో బతకలేని పరిస్థితి దాపురించిందని, మరో పక్క పరిశ్రమల పేరుతో వ్యవసాయ భూములను లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. అయినప్పటికీ భూములు ఇచ్చిన పేదలకు పిల్లలకు ఉపాధి ఉండటం లేదని, ఆ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవట్లేదన్నారు. కామ్రేడ్ సత్తిబాబు స్ఫూర్తితో ప్రజల సమస్యలపై మరింతగా పనిచేయాలని, అప్పుడే ఆయనకు ఇచ్చిన ఘనమైన నివాళి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ సత్తిబాబు తనకు ఎంతో స్నేహశీలి, కార్మికుల కోసం నిరంతరం పని చేసిన నేత అన్నారు. ఆయన లేకపోవడం ఉద్యమానికి, ప్రజలకు తీరని లోటన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కే.త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతంలో సిఐటియు నిర్మాణంలో సత్తిబాబు కృషి ఎనలేనిదని కొనియాడారు. ముఠా, మున్సిపల్, ఆశ, అంగన్వాడి కార్మికుల సమస్యల పరిష్కారానికి, పేదల ఇళ్ల స్థలాలు, భూ సమస్యలపై అనేక పోరాటాల నిర్వహించారని చెప్పారు. భవిష్యత్తులో ప్రజలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ సందర్భంగా రామారావుపేట సెంటర్లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళ సంఘం నాయకులు ఎల్. గౌరి, కేవి. సూర్యప్రభ, అంగన్వాడీలు వి.సామ్రాజ్యం, మహాలక్ష్మి, సత్తిబాబు పెద్ద కుమారుడు డి. అమర్, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, ముఠా కార్మిక సంఘం ప్రెసిడెంట్ గోవింద, అప్పారావు, మిడ్డేమీల్ కార్మిక సంఘం నాయకులు గౌరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కే.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రా పద్ధతిలో రైతు బజార్ షాపులు కేటాయింపు



అనకాపల్లి మే 20 (ప్రభాత వార్త) : అనకాపల్లి డాక్టర్ ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో త్వరలో ప్రారంభం కానున్న రైతు బజారులో రైతులకు స్టాళ్ల కేటాయింపుల కోసం డ్రా పద్ధతిలో కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయ విసి హాల్లో బుధవారం సాయంత్రం డ్రా తీయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 125 దరఖాస్తులు అందగా, వాటిలో 72 మంది రైతులకు పారదర్శకంగా డ్రా పద్ధతి ద్వారా స్టాళ్లను కేటాయించడం జరిగిందన్నారు. రైతులు వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రైతు బజార్ త్వరలో ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## ఎండలు అధికంగా ఉన్నాయి.. జాగ్రత్తగా ఉండండి

**ఉపాధి కూలీలకు "దెందుకూరి "సూచన.!**



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త): రోజు రోజుకి ఎండలు అధికంగా ఉన్నాయని దాని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క ఉపాధి కూలీ జాగ్రత్తగా వ్యవహరించాలని ఇన్చార్జ్ ఎంపీడీవో దెందుకూరి సీతారామరాజు సూచించారు. జల దార -జల హారతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని న్యాయంపూడి గ్రామంలో ఉన్న ఎర్ర చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా కూలీలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రతిరోజు పనులకు వచ్చే సందర్భంలో ఆరోగ్య పరిస్థితులు చూసుకొని రావడం మంచిదని కూలీలకు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జలధార- జలహారతి కార్యక్రమంలో దాతలను భాగస్వాములు చేసే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ,ఇప్పటికే అనేక మందిని కలవడం జరిగిందని, దాతలు ముందుకు వస్తున్నారని చెప్పారు .చెరువుల అభివృద్ధి భవిష్యత్తు తరానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయికట్టు దారులకు సహకరించిన వాళ్ళమవుతామని సీతారామరాజు తెలియజేశారు. పనిచేసే ప్రదేశంలో మంచినీటిని అందుబాటులో ఉంచుకోవాలని ఎవరికైనా ఇబ్బంది కలిగిన తక్షణమే సమాచారం అందజేయాలని అన్నారు. ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు,ఏపీవో భాగ్యలక్ష్మి , కార్యదర్శి పివిపి రాజశేఖర్ ,తదితరులు ఉన్నారు.

## చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి



మాకవరపాలెం మే 20 ప్రభాతవార్త : మండల కేంద్రం మాకవరపాలెం ఎస్సీ కాలనీకి చెందిన బిక్కవోలు సోమరాజు(45) చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు.ఈమేరకు స్థానికులు,పోలీసులు అందించిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున మాకవరపాలెం గ్రామ సమీపంలోని జీడి తోటలో ఉరివేసుకొని ఉండటం సంఘటన స్థానికులు గుర్తించారు. సమాచారం పోలీసులకి అందించడంతో ఎస్సై దామోదర్ నాయుడు సంఘటన స్థలాన్ని చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కందిపూడిలో "స్వచ్ఛ పథం" కార్యక్రమం



పాయకరావుపేట రూరల్, మే 20, ప్రభాతవార్త : మండలంలోని కందిపూడిలో బుధవారం అధికారులు "స్వచ్ఛ పథం" కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ అడపా లవరాజు కార్యక్రమంలో పాల్గొని గ్రామంలోని రోడ్లు, కాలువలను దగ్గరుండి శుభ్రం చేయించారు. చెత్త కుప్పలు పూర్తిగా తొలగించారు. గ్రామంలో పారిశుధ్య పనులను నిర్వాహనపై సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వై వి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆరుగుల గంగాధర్, సోషల్ వర్కర్ పందిరి అప్పారావు రెడ్డి, హరిత రాయబారులు పాల్గొన్నారు.

## అక్రమ చేపల వేట బోట్లపై మత్స్యశాఖ అధికారుల దాడి



(ఎస్ రాయవరం మే 20 ప్రభాతవార్త ): ఎస్ రాయవరం మండలం వాకపాడు పంచాయతీ వాతాడ గ్రామంలో అక్రమంగా వేటకు వెళ్లిన బోట్లను,సీజ్ చేసిన మత్స్యశాఖ అధికారులు. ఈ సందర్భంగా నక్కపల్లి ఎఫ్ డి ఓ శృతి మాట్లాడుతూ.. అక్రమంగా సముద్రంలో వేటకు వెళ్తున్నారని, మత్స్యశాఖ అధికారులకు గ్రామాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని,ప్రస్తుతం రాష్ట్రంలో మత్స్యకారలు సముద్రంలో వేట నిషేధం కొనసాగు తుంది, అయితే అక్రమంగా కొంతమంది మత్స్యకారులు వేటకు వెళ్తున్నారని,రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో,రెండు నెలలుగాను 20,000/- రూపాయలు మత్స్యకారుల భరోసాను అందజేస్తుందని ఈ రెండు నెలల సమయంలో చేపలు పిల్లలు ఉత్పత్తి జరిగే సమయం కాబట్టి ప్రభుత్వం కట్టుదిట్టంగా,మెరైన్ పోలీసులు సహకారంతో మత్స్యకారులు వేటకే వెళ్లకుండా చూస్తున్నారని,ఈ క్రమంలో మత్స్యశాఖ అధికారులు కు వచ్చిన సమాచారం మేరకు రేవు పోలవరం,వాతాడ గ్రామంకు చెందిన మత్స్యకారులు రహస్యంగా చేపల వేటకు వెళ్తున్నట్టు గుర్తించామన్నారు. మంగళవారం రాత్రి చేపల వేటికి వెళ్లి తిరిగి వచ్చిన మూడు బోట్లను గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు,వేట చేసి తీసుకు వచ్చిన చేపల ఎగుమతులకు పాల్పడిన వాహన దారులపై కూడా కేసులు నమోదు చేశామన్నారు. వేట నిషేధ కాలంలో ప్రకటించాక ఇప్పటివరకు 18 బోట్లపై కేసులు నమోదు చేశామన్నారు.ఇప్పుడు వాటి రిజిస్ట్రేషన్ రద్దుచేసి, ఆ యజమానులకు ప్రభుత్వం నుంచి పలు రాయితీలు రాకుండా చేస్తామన్నారు. అక్రమంగా సముద్రంలోకి వేటనిషేధి సమయంలో ఎవరు వెళ్లిన కఠిన చర్యలు ఉంటాయని మత్స్యశాఖ అధికారులు హెచ్చరించారు.

## స్వచ్ఛ పథం ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం పరిశీలన




(ఎస్ రాయవరం,మే 20, ప్రభాతవార్త ): మండలంలో పలు గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ పథం కార్యక్రమం అమలు జరుగుతున్న తీరును జిల్లా పంచాయతీ అధికారి ఇ సందీప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు.. మోడల్ గ్రామ పంచాయతీ లో భాగంగా గుడివాడ గ్రామ పంచాయతీలో అమలు జరుగుతున్న స్వచ్ఛ పథం ప్రత్యేక డ్రైవ్ ను అయన నిశితంగా పరిశీలించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సూచనలు, సలహాలు సూచించారు. గుడివాడ గ్రామ పంచాయతీలో సంపద తయారీ కేంద్రం..మ్యాజిక్ డ్రైన్స్. ఇన్విడ్యువల్ సోక్ పిట్స్ మొదలైన వాటిని పరిశీలించి, ప్రజల వద్ద నుండి అభిప్రాయ సేకరణ జరిపారు. గ్రామ పంచాయతీలో సంపద తయారీ కేంద్రం నుండి పెద్ద మొత్తంలో సేంద్రీయ ఎరువు తయారికి కృషి చేస్తున్న గ్రీన్ గార్డ్ కాసులు,పంచాయతీ కార్యదర్శి నాగరాజు పనితీరును అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ. గ్రామ మాజీ సర్పంచ్ వెంకట రాజు.పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నక్కపల్లికి కోర్టు మంజూరు

**హోం మంత్రికి ధన్యవాదాలు తెలిపిన నియోజకవర్గ నాయకులు..!**

(నక్కపల్లి,ప్రభాతవార్త) మే 20: పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లికి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరు కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక కృషి ఫలితంగానే కోర్టు మంజూరైందని నియోజకవర్గ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా హోం మంత్రికి ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నక్కపల్లిలో కోర్టు ఏర్పాటు కోసం అవసరమైన భవనాలను సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారు.ఇప్పటి వరకు నక్కపల్లి, పరిసర ప్రాంతాల ప్రజలు కోర్టు సంబంధిత పనుల నిమిత్తం ఎలమంచిలికి వెళ్లాల్సి వచ్చేది. కొత్త కోర్టు ఏర్పాటుతో ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం ఆదా కావడంతో పాటు న్యాయ సేవలు స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయి. కోర్టు ఏర్పాటు వల్ల నక్కపల్లి ప్రాంతానికి పరిపాలనా ప్రాధాన్యత కూడా పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రత్యేక సత్కారం

ఎలమంచిలి, మే 20, ప్రభాతవార్త: పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి 580 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం సత్కరించి ప్రత్యేక మెంటోనూ అందజేయనున్నట్లు అధికారులు తెలియజేశారు.

## ఆర్‌పిఎల్ క్రీడాకారులకు క్రీడా సామాగ్రి పంపిణీ



(ఎస్. రాయవరం,మే 20, ప్రభాతవార్త): మండలం రేవు పోలవరం గ్రామంలో ఆర్ పి ఎల్ క్రీడాకారులకుతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చోడిపల్లి బంగారి బూట్ల కిట్టు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవుపోలవరం యువత క్రీడల్లో మరింత అద్భుతమైన ఆటలు ఆడి,క్రీడల్లో రాణించాలని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు జామీ మాధవ్, గరికన చిట్టి, తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి



నర్సీపట్నం,మే 20, ప్రభాతవార్త: నర్సీపట్నం మున్సిపా లిటీ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబొ ద్దేపల్లి పెద్దచెరువు వద్ద గల ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం ప్రకాశం పంతులు ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నాయకులు తమరాన శ్రీను, సుర్ల నాయుడు, దాడి బుజ్జి, సుదీర్, వాసు, మహిళా నాయకులు వీరమాచినేని జగదీశ్వరి, రోజా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



పాయకరావు పేట/పాయకరావు పేట రూరల్, ప్రభాతవార్త : యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడు కలు బుధవారం పాయకరావు పేటలో ఘనంగా నిర్వహించారు. నందమూరి కల్చరల్ యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చింతకాయల రాంబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని అన్న క్యాం టీన్ వద్ద జరిగిన కార్యక్రమంలో బర్త్ డే కేక్ కట్ చేసి తమ అభిమాన కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానులకు కేక్ లు, స్వీట్లు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సందడి చేశారు. పట్టణంలో గతంలో ఎన్నడూ జరుగని విధంగా మెగా అభిమానులు, ప్రభాస్, మహేష్ బాబు అభిమానుల సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్, తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు (బాబులు), బాలకృష్ణ ఫాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విశ్వనాధుల శ్రీను, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు ఆనంద్, జూరెడ్డి ప్రసాద్, చిరుకూరి పేర్రాజు, వంకా హరి, జనసేన పార్టీ నాయకులు ఇంజరపు సూరిబాబు, రాజా రమేష్, బత్తిన గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

21skl13:21skl13.qxd 20-05-2026 22:58 Page 1



## ఆపదలో ఉన్నవారికి సీతయ్య ఫౌండేషన్ ఆపన్నహస్తం



కంచిలి, మే 20 ప్రభాతవార్త : ఆపదలో ఉన్నవారికి అపన్న హస్తంలో నేనున్నానంటూ ఎల్లవేళలా కాపాడుతున్న సీతయ్య ఫౌండేషన్‌కు అన్ని వర్గాల నుంచి అభినందనలు అందుతున్నాయి. కంచిలి మండలంలో గల సీతయ్య ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు నుంచి ఇప్పటివరకు ఎంతోమంది అభాగ్యులకు అన్ని విధాలుగా ఆశ్రయం కల్పిస్తూ, నిరశ్రయులకు తోడు కల్పిస్తూ వారిని ఎల్లవేళలా సొంత బిడ్డల్లా చూసుకుంటున్న సంస్థకు అన్ని చోట్ల నుండి ఆభయం లభిస్తుంది. బుధవారం కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ దేవాలయం ప్రాంగణంలో ఆధ్యాత్మికత దైవ సేవలో తరిస్తూ ఒంటరితనం వయోభారంతో శేష జీవితం గడుపుతున్న వృద్ధురాలు జమున బిసాయికు నా అనేవారు లేకపోవడంతో గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ యువకులు సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులతో మాట్లాడి జమున బిసాయికు ఆశ్రయం కల్పించారు. హెల్పింగ్ హాండ్స్ చేసిన సహాయంకు సీతయ్య ఫౌండేషన్ అభినందనలు తెలిపారు.

## రేషన్ డీలర్లతో నెలవారీ సమావేశం



కంచిలి, మే 20 ప్రభాతవార్త : కంచిలి మండలంలో గల రేషన్ డీలర్లతో తహసిల్దార్ ఎన్.రమేష్ కుమార్ నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లును ఉద్దేశించి తహసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అందుతున్న రేషన్ సరుకులు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, వచ్చిన సరుకులు పక్కదారి పట్టకుండా, లబ్ధిదారుల నుండి అధికారులకు ఎటువంటి ఫిర్యాదు లేకుండా డీలర్లు చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సరుకులు మాత్రమే రేషన్ డిపోలలో అమ్మకాలు సాగించాలని, అదనంగా ఏవైనా సామాన్లు అమ్మకాలు జరిపినట్లైతే చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయల అవినీతి.. త్వరలో అన్నీ బయటకు తీస్తాం

**ఎమ్మెల్యే గౌతు శిరీష**



పలాస, మే 20 ప్రభాతవార్త : పలాస నియోజకవర్గంలో 2005-24 ఆర్థిక సంవత్సరాల కాలంలో వ్యవసాయ సహకార పరపతి సంఘ పరిధిలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని త్వరలో అన్నీ బయటకు తీస్తాం. అవినీతి జరిగిందని తమ దృష్టికి వచ్చిన వెంటనే అంతర్గత విచారణ చేసి పూర్తి వివరాలు తీస్తున్నామని అన్ని అవినీతి వివరాలు త్వరలో బయటకు తీస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం మీడియాతో తెలిపారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల పరిధిలో సంఘ పరిధిలో అక్రమంగా రుణాలు మంజూరు చేసి అవకతవకలకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. 15 రోజుల వ్యవధిలో అధికారులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## డిమాండ్స్ డే సందర్భంగా నిరసన




పలాస, మే 20 ప్రభాతవార్త: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధ, గురువారాల్లో అన్ని డిపోలలో జరిగిన డిమాండ్స్ డే సందర్భంగా పలాస డిపోలో అధిక సంఖ్యలో ఎన్ఎంయుఎ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విద్యుత్ బస్‌లను ఆర్టీసీ/ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలి, ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. స్త్రీ శక్తి బస్‌లలో జీరో టికెట్ ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి మిగిలిన ప్రయాణికులకు టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని సిబ్బందిపై పని భారం తగ్గించాలి. పీఆర్‌సీ కమిటీని నియమించి వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలి మరియు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు అరియర్స్ మరియు లీవ్ ఎన్కాష్మెంట్‌లు ఇవ్వాలి. ప్రయాణికులకు సరిపడ కొత్త బస్సులు వెంటనే కొనుగోలు చేయాలి. అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేయాలి. రిటైర్ అయిన చనిపోయిన సిబ్బందికి వెంటనే సెటిల్‌మెంట్స్ చెయ్యాలి. గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు పున్నయ్య, డివల్ నారాయణ, వి.గణపతితో పాటు సీనియర్ నాయకులు టి.డి రావు , ఎన్ఎంయుఎ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ గ్రహీత దివ్యవాణిని అభినందించిన పీవో



సీతంపేట, మే 20 ప్రభాతవార్త: సీతంపేట ఐటిడిఏ పరిధిలోని భీంపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫిజికల్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కూన దివ్యవాణి ఆంధ్ర యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో పీహెచ్డీ పూర్తి చేసిన సందర్భంగా సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ ఆమెను అభినందించారు. బుధవారం ఆమె ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిని మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సీతంపేట ఐటిడిఏ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయురాలు పీహెచ్డీ పూర్తి చేయడం పట్ల పీవో సంతోషం వ్యక్తం చేశారు. ఐటిడిఏ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆమెకు సూచించారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కండి : పేడాడ



ఆమదాలవలస, మే 20 (ప్రభాతవార్త): రానున్న మున్సిపల్ ఎన్నికలకు జనసేన నాయకులు సిద్ధంగా ఉండాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహన్రావు అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నియోజవర్గం ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎన్నికలు జరిగితేనే వార్డుల అభివృద్ధి జరుగుతోందన్నారు. జన సైనికులందరూ ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. వార్డులలో జనసేన పార్టీ నాయకత్వాన్ని పెంపొందిస్తూ, పార్టీ బలోపేతం దిశగా కృషి చేయాలని అన్నారు. అలాగే వార్డుల పునర్విభజనలో ఉన్న సమస్యలను జనసేన నాయకుల నుండి సేకరించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పైడి నరేష్ కుమార్, మున్సిపాలిటీలోని అన్ని వార్డుల జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## డీటీకి వినతిపత్రం అందజేత



సంతకవిటి, మే 20 ప్రభాతవార్త : సంతకవిటి మండలంలో మెడికల్ షాపులు బుధవారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ షాపుల యాజమానులు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకోని అక్కడ డి.టి మధుకి వినతి పత్రం అందించారు. తమ సమస్యలపై అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా మెడికల్ షాపుల కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, బండారు రామకృష్ణ, మధు, రామ, తదితరులు పాల్గొన్నారు.

## సోంపేట టీమ్‌పై శ్రీకాకుళం జడ్‌సీసీ విజయం



ఆముదాలవలస, మే 20 (ప్రభాతవార్త): సోంపేట క్రికెట్ టీం పై శ్రీకాకుళం జడ్ సిసి విజయం సాధించింది. బుధవారం ఆముదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న చిరంజీవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్ సందర్భంగా సోంపేట, శ్రీకాకుళం జడ్‌సీసీ క్రికెట్ క్లబ్ మధ్య క్రికెట్ నిర్వహించారు. సోంపేట క్రికెట్ టీం టాస్ గెలిచి బ్యాటింగ్ చేయడంతో 15 ఓవర్లకు 145 పరుగులు చేసింది. వీరిలో దేవ్ 29 పరుగులు చేశాడు. శ్రీకాకుళం 15 ఓవర్లుకు 146 పరుగులు, జడ్ సిసి టీం విజయం సాధించారని క్రికెట్ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రకటించారు. అంపైర్లుగా కిల్లి సుదర్శనరావు, స్కోరర్‌గా ఈశ్వరరావు వ్యవహరించారు. క్రీడా మైదానం అసోసియేషన్ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్, చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో భూసారం రక్షణ



కొత్తూరు, మే 20 ప్రభాతవార్త : మండలంలోని బమ్మిడి పంచాయతీలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు వినూత్నంగా నవధాన్యాల విత్తన గుళికల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ గోపాల్, మండల వ్యవసాయ అధికారి సుమంత్, మండల సమన్వయ కర్త సూర్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు పోతయ్య, కాళిదాసు, లచ్చన్న, శ్రీరాములు, రామారావుతో కలిసి కందులు, పెసర, మినుములు, బొబ్బర్లు, బెండ, అనుములు వంటి విత్తనాలతో గుళికలను తయారు చేయించి, వాటిని వరుస క్రమంలో పొడి చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ముసలయ్య, అంతర్గత వనరుల వ్యక్తులు మహాలక్ష్మి, రమణమ్మ, బాల, శ్రీను, శ్యామల, సంతోష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో తడి,పొడి వ్యర్థాలు జిందాల్ ప్లాంట్‌కు తరలింపు



రాజాం, మే 20 ప్రభాతవార్త : రాజాం పురపాలక సంఘం పరిధిలో గల గ్రరాజు చీపురుపల్లి వద్ద ఉన్న కంపోస్టు యార్డ్ నందు ప్రభుత్వం కొత్తగా నిర్మించ తలపెట్టిన తడి, పొడి వ్యర్థాల నిర్వహణ కేంద్రంనకు అవసరమైన 80 సెంట్లు విస్తీర్ణంలో గల స్థలం నందు పేరుకుపోయిన వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన మున్సిపాలిటీ కార్యాలయానికి సంబంధించి ట్రక్స్ , అదనంగా మరో రెండు ట్రక్‌లను అద్దె ప్రాతిపదికన తీసుకుని ప్రతిరోజూ సుమారు 40 నుండి 45 టన్నుల వ్యర్థాలను విశాఖపట్నం జిందాల్ ప్లాంట్‌కు తరలించడం జరుగుతుందని మున్సిపాలిటీ కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు తెలిపారు.

## నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెటరీ పరీక్షలు

**- జిల్లాలో పరీక్షలకు హాజరు కానున్న 4,733 మంది విద్యార్థులు**



వీరఘట్టం, మే 20 ప్రభాతవార్త : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు జూన్ 2 వరకు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థులు 2,578 మంది, సెకండ్ ఇయర్ జనరల్ విద్యార్థులు 1,340 మంది, ఒకేషనల్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 392 మంది, ఒకేషనల్ సెకండ్ ఇయర్ విద్యార్థులు 423 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు, లైవ్ స్ట్రీమింగ్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్‌గా డీఐఈఓ వై.నాగేశ్వరరావు వ్యవహరిస్తుండగా, సభ్యులుగా చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రమణ, పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర విభాగం ప్రిన్సిపాల్ వి.హరగోపాల్, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల బోటనీ లెక్చరర్ ఏ.రాజు విధులు నిర్వహించనున్నారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ, పోస్టల్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## మెడికల్ షాపులు బంద్ విజయవంతం



వీరఘట్టం, మే 20 ప్రభాతవార్త : భారత కెమిస్టుల సమాఖ్య ఆల్ ఇండియా సమ్మెలో భాగంగా బుధవారం వీరఘట్టంలో చేపట్టిన బందు పూర్తిగా విజయవంతమైంది. కార్పొరేట్ సంస్థల నిర్వాహకంతో తమ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని వీరఘట్టం మెడికల్ షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. చీటీ లేకుండా మందులు విక్రయించకూడదని నిబంధనలు చెబుతున్నాయన్నారు. ఆన్‌లైన్ విక్రయాలకు ఎటువంటి డాక్టర్ చీటీలు లేకుండానే ప్రమాదకర కొన్ని రకాల మందుల విక్రయాలు కూడా జరుగుతున్నాయని మెడికల్ షాపుల యజమానులు చెబుతున్నారు. ఆన్లైన్ మందుల విక్రయాలతో రిటైల్ మందుల షాపుల్లో విక్రయాలు తగ్గి తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్ల పరిస్థితి కూడా ఇలానే ఉందని ఏఐఓసీడీ ప్రతినిధులు పేర్కొన్నారు ఆన్లైన్లో మందుల విక్రయాలను ఆపేయాలని వాళ్లంతా ముక్తకంఠంతో కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మెడికల్ షాపులన్నీ మూతపడ్డాయి. అయితే అపోలో, మెడ్ ప్లస్ వంటి మందుల దుకాణాలు మాత్రం యధావిధిగా తెరచే ఉంచాయి.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన పాలవలస కుటుంబం



వీరఘట్టం, మే 20 ప్రభాతవార్త : మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని విజయవాడ తాడేపల్లిలో బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్సార్ సీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డిని గౌరవ పూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు పాలవలస విక్రాంత్ కుటుంబ సభ్యులు. కలిసిన వారిలో విక్రాంత్ తల్లి, రేగిడి ఆమదాలవలస జడ్పీటీసీ సభ్యులు పాలవలస ఇందుమతి, విక్రాంత్ సతీమణి, పాలకొండ జడ్పీటీసీ సభ్యులు పాలవలస గౌరిపార్వతి, విక్రాంత్ తనయుడు, యువ నాయకులు పాలవలస మణికంఠ బాబులు ఉన్నారు.

## పెద్దమానాపురంలో 'మా ఊరికి మలేరియా వచ్చింది'



సీతంపేట, మే 20 ప్రభాతవార్త : ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పెద మానాపురం గ్రామంలో మాఊరికి మలేరియా వచ్చింది కార్యక్రమం ద్వారా మలేరియా నివారణ చర్యలు చేపట్టారు. బుధవారం మలేరియా సిబ్బంది ఆ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఐఆర్ఎస్ మందును పిచికారి చేశారు. జిల్లాకలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి సీతంపేట ప్రాజెక్ట్ అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశాల మేరకు మొదట విడత 195 గ్రామాల్లో ఐ ఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. శానిటేషన్, క్లోరినేషన్, పూడిక తీత, క్లీనింగ్ వంటి పారిశుధ్య కార్యక్రమాలు దోమలను తరిమి కొట్టే మొక్కలు నాటడం జరిగిందని మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తెలిపారు.

## 250 సారా ప్యాకెట్లు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



కంచిలి, మే 20 ప్రభాతవార్త: సోంపేట ఎక్సైజ్ సి.ఐ జీ.వి. రమణ, సిబ్బంది కంచిలి మండలం జలంత్రకోట గ్రామం రత్నాల అనసూయ వద్ద నుంచి 100 నాటుసారా ప్యాకెట్లు, రత్నాల అర్జున నుంచి 150 నాటుసారా ప్యాకెట్లుతో రవాణా చేస్తూ పట్టుబడగా ద్విచక్ర వాహనం స్వాధీన పరచుకొని కేసు నమోదు చేశారు. వీరి మీద కూడా గతంలో పలు కేసులు ఉన్నాయి వీరిద్దరినీ సోంపేట కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నాటుసారాపై ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405 లేదా 9440902358 నెంబరుకు గాని తెలియపర్చ వచ్చును, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. సోంపేట ఎక్సైజ్ సిఐ రమణ, ఎస్ఐలు జగన్నాథ్, ప్రసాద్ సిబ్బంది భానుప్రసాద్, ఉమాపతి, మార్కారావు పాల్గొన్నారు.

## జిల్లాలో ముమ్మరంగా జనాభా గణన



వీరఘట్టం, మే 20 ప్రభాతవార్త : జిల్లాలో జనాభా గణన-2027 కార్యక్రమంలో భాగంగా మే 1వ తేదీ నుండి ప్రారంభమైన గృహ గణన ప్రక్రియ అత్యంత వేగంగా, ముమ్మరంగా సాగుతోంది. జిల్లా యంత్రాంగం అందించిన తాజా సమాచారం ప్రకారం అత్యధిక శాతం గృహాల, జనాభా నమోదు ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని ప్రిన్సిపాల్ సెన్సెస్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకర రెడ్డి బుధవారం వెల్లడించారు. గణాంకాల వివరాలు :జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,136 హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లు ఉండగా, ఇప్పటివరకు 1,834 బ్లాక్‌లలో గృహ గణన పూర్తిగా ముగిసింది. మిగిలిన బ్లాక్‌లలో కూడా ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 3,45,608 గృహాలకు గాను, ఇప్పటివరకు 3,31,846 ఇళ్లలో గణన పూర్తయింది. మొత్తం 10,38,857 జనాభాను కవర్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 9,08,227 మంది ప్రజల వివరాలను ఎన్యూమరేటర్లు విజయవంతంగా నమోదు చేశారన్నారు.

**ప్రజలకు కలెక్టర్ కార్యాలయం విజ్ఞప్తి**

ఈ గృహ గణన ప్రక్రియలో ఏ ఒక్కరూ విస్మరించబడకూడదనే ఉద్దేశ్యంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. తమ ప్రాంతంలో ఇంకా గృహ గణన జరగలేదని భావించినా, లేదా ఎన్యూమరేటర్లు తమ ఇంటికి వచ్చి వివరాలు సేకరించలేదని ప్రజలు గుర్తిస్తే వెంటనే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ 08963796085 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించడం ద్వారా, తమ వివరాలు జనాభా గణనలో నమోదయ్యేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఆన్‌లైన్లో మందుల పంపిణీపై నిరసనలు



రాజాం, మే 20 ప్రభాతవార్త : రోగులకు సంబంధించి మందులను ఆన్లైన్లో విక్రయిస్తున్నారన్న తరుణంలో కెమిస్ట్రీ డ్రగ్గిస్ట్ మందుల షాప్ యజమానులు రాజాం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ జంక్షన్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు తమ నిరసన తెలుపుతూ, ర్యాలీగా వెళ్లి తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో మందులు చీటీలు ప్రమేయం లేకుండా ఆన్లైన్లో మందులు కొనుగోలు చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు. అలాగే ఈ విధంగా మందులను ఆన్లైన్‌లో కొనుగోలు చేస్తున్నందంతో తమ వ్యాపార లావాదేవీ సక్రమంగా జరగడంలేదని తెలిపారు. వీటిపై ప్రభుత్వాలు స్పందించి ఆన్లైన్లో మందులు మందులు విక్రయాలను నియంత్రిం చవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సూచించారు. కార్యక్రమంలో రాజాం, కెమిస్ట్రీ అండ్ డ్రగ్జిస్ట్ మందులు షాప్ యూనియన్ ప్రతినిధులు, అలాగే యజమానులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పైపులైన్ ధ్వంసం.. పోలీసులకు ఫిర్యాదు



రాజాం, మే 20 ప్రభాతవార్త : రాజాం పురపాలక సంఘ పరిధిలో ఉన్న పొనుగుటివలస, మారుతి నగర్ 3వ లైన్‌లో వీధి చివరన గల జడ్డు రమేష్ గారి ఇంటి వాడుక నీరు ప్రవహించుటకు రోడ్డుకు ఆవలి వైపున ఉన్న మురుగు కాలువకు ఇటీవల పైపు వేసి కలపడం జరిగింది. మున్సిపాలిటీ వారు వేసిన పైపులైను గోకవలస ఆనంద్, కొంతమందితో వచ్చి వేసిన పైపులైను ధ్వంసం చేయడం జరిగింది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు స్పందించి ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని మున్సిపాలిటీ కమిషనర్ తెలిపారు.

## కోటబొమ్మాళిలో మందుల షాపుల యజమానుల బంద్




కోటబొమ్మాళి, మే 20 ప్రభాతవార్త : ఆన్లైన్ ద్వారా మందులు విక్రయాలు నిలుపుదల చేయాలని కోరుతూ మండలంలోగల అన్ని మందులు షాపుల యజమానులు బుధవారం బంద్ పాటించారు. ఈ సందర్భంగా కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి రైతు బజారు వరకు పలు నినాదాలు చేస్తూ మెడికల్ షాపులు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దీంతో మండలంలో అన్ని మెడికల్ షాపులు మూసి ఒక్క రోజు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ర్యాలీలో మురళీ, షణ్ముఖరావు, కిషోర్, నాగరాజు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## రైతులను బ్రోకర్స్ అనడం సరికాదు .. 'చింతాడ' క్షమాపణ చెప్పాలి



ఆమదాలవలస, మే 20 (ప్రభాతవార్త) : అక్కివరం, తోటాడ రైతులను వైసీపీ నేత చింతాడ రవికుమార్ బ్రోకర్లు అనడం ఆయన వివేకానికి నిదర్శనమని కొత్త రోడ్డు రైతులు తాండ్ర కృష్ణారావు, రామారావు, హనుమంతు శ్యామలరావు, నారాయణరావు, బాలకృష్ణ, సనపల రమణమూర్తి, తాండ్ర రంగారావు, పొన్నాడ గణపతి రావులు అన్నారు. బుధవారం కొత్త రోడ్‌లో ఉన్న మిలటరీ క్యాంటీన్ ఆవరణలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అంటూ హేళన చేశారని, హైడ్రా వంటి చట్టాలతో భవనాలను వైకాపా ప్రభుత్వం వచ్చిన వెంటనే కూల్చి వేస్తామని వంటి వైసీపీ నేత చింతాడ రవికుమార్ వ్యాఖ్యలపై రైతులు మండిపడ్డారు. మేము రైతులమే మాకు ఇక్కడ భూములు ఉన్నాయిని, భూముల యొక్క హక్కు పత్రాలను మీడియాకు చూపించారు. సర్వేనెంబర్ 121 ప్రకారం 1986 వరకు రిజిస్ట్రేషన్ అయ్యావని, అలాగే 2001-2002 లో కూడా మరికొన్ని రిజిస్ట్రేషన్ అయ్యావని అందుకు తగిన పత్రాలు ఉన్నాయని తెలిపారు. అవి మఠం భూములు కాదని రైతులు జెరాయితీ భూములను కమిషన్ రేట్ ఆఫ్ సిసిఎల్ లో ఇచ్చిన వివరాల ప్రకారం 72/50,28 మార్చి 1953 కోర్టు రాగోలు జిరాయితి భూములని ఇచ్చిన పత్రాలను చూపించారు. 200 ఎకరాల్లో జాతీయ రహదారికి 23 ఎకరాలు, రివర్ బెడ్ లో కొంత భాగం, ఎస్సీ కాలనీకి కొంత భాగం, ఇలా కొంత భూమి పోగా మిగిలిన 148 ఎకరాలు కేవలం రైతుల దేనిని అన్నారు. వైసీపీ నాయకులు పూర్వాపరాలు తెలుసుకొని మాట్లాడాలని రైతులను బ్రోకర్లుగా చిత్రీకరించి మమ్ములను కించి పరిచినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని అన్నారు, అంతేకాకుండా ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని కొత్త రోడ్డు రైతులు డిమాండ్ చేశారు. సమస్యకు ఎవరైతే పరిష్కారం చూపుతారో వారి వెంటే ఉండటం తప్పు కాదని అందుకని మా రైతులపై పార్టీ ముద్రను వేయవద్దని స్పష్టం చేశారు. స్వాతంత్రం వచ్చిన నుండి అన్ని పార్టీ నేతలను కలిశామని ఏ ఒక్కరు మా సమస్యకు పరిష్కారం చూపలేదని, ఎమ్మెల్యే రవికుమార్ మా సమస్యలను పరిష్కారం చూపిస్తానని సర్వే నిర్వహించి రైతులకు భూములు కేటాయిస్తానని చెప్పటంతో మేము ఎంతో ఆనందంగా ఉన్నామని అటువంటి ఆనందాన్ని ఒక్క క్షణం కూడా లేకుండా చిన్న బెల్లం చేసినందుకే వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ రైతులను బ్రోకర్లుగా చిత్రీకరించారని వారు వాపోయారు. ఏది ఏమైనాప్పటికీ మా సమస్యకు పరిష్కార మార్గం చూపించాలని, వైసీపీ మాటలను వెనక్కి తీసుకోవాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అంతేకాకుండా చింతాడ రవికుమార్ రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. రైతులను ఏక వచనంతో సంబోధించడం అవమానకరమని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను వైకాపా నేత క్షమాపణ చెప్పకపోతే వైకాపా పార్టీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా రానున్న ఏ ఎన్నికలు వచ్చినా వైకాపా నాయకులను అక్కివరం, తోటాడ గ్రామంలోనికి రాకుండా అడ్డుకుంటామని ఘాటుగా హెచ్చరించారు. కొత్త రోడ్ లో ఉన్న నివాసిత ప్రాంతాలలో ఉన్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే రవికుమార్ కు పలుమార్లు గ్రామస్తులు అభ్యర్థించిన పిమ్మట రహదారుల సౌకర్యాలు కల్పించినట్లు రైతులు తెలిపారు. కొత్త రోడ్లు నివసించిన ప్రజలందరూ ఇంటి పన్ను ప్రభుత్వానికి కడుతున్నామని, అందువల్ల గ్రామంలో మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బుడుమూరు సీతారాం, తాండ్ర హరి, తాండ్ర గోవిందరావు, కోట శ్రీనివాసరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్ర పరికరాలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు



మెళియాపుట్టి, మే 20 ప్రభాతవార్త : రైతులు వ్యవసాయ యంత్ర పరికరా లకు వ్యక్తిగతంగా దరఖాస్తు ఆన్లైన్లో సబ్మిషన్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ గడువు పెంచడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి యస్.దానకర్ణుడు తెలిపారు. మే 26వ తేదీలోపు వ్యవసాయ యంత్ర పరికరా లు అవసరమైన రైతులు ఆన్లైన్లో విధిగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా స్ప్రేయర్లు, పవర్ విడర్లు, పవర్ టెల్లర్లు, దుక్కి నాగలి, దుమ్ము నాగలి, కేస్ వీల్స్, రోటవేటర్లు, ట్రాక్టర్లు మొదలగు యంత్ర పరికరాలకు మే 26వ తేదీ లోపు ఆన్లైన్లో విధిగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తదుపరి వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను లాటరీ విధానం ద్వారా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మరియు జాయింట్ కలెక్టర్ లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగు తుంది. రైతులు రైతు వాట చెల్లించిన తదుపరి విధిగా యంత్ర పరికరాలు సరఫరా చేయడం జరుగుతుందని తెలియజేశారు. అవకాశాన్ని అందరు రైతులు విని యోగించుకోవాలని కోరారు. మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

## జగన్ దళితుల పాలిట కంసుమామ : టీడీపీ



కోటబొమ్మాళి, మే 20 ప్రభాతవార్త : మోసపూరిత వాగ్ధానాలు చేసి 2019 ఎన్నికల్లో గెలిచిన జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను అణగదొక్కారని, దళితులను హత్యలు చేయించి తీరని ద్రోహం చేశారని తేదేపా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల సింహాచలం ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ దళితులకు మేనమామ అని చెప్పుకొనే జగన్ వాస్తవంగా దళితులను ఊచకోత కోసిన కంసమామ అని ధ్వజమెత్తారు. 2019-24 మధ్య రాష్ట్రంలో పాలన సాగించిన వైకాపా వారు ఎంతోమంది దళితులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ళ వైకాపా పాలనలో సుమారు 60 వేలు మంది దళితులపై దాడులు జరిగాయని తెలిపారు. 200 మందికి పైగా దళితులను కిరాతకంగా హత్యలు చేశారని గుర్తు చేశారు. వైకాపా వారి కుటిల రాజకీయాలను ప్రజలు గుర్తుంచుకుని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు మద్దతుగా నిలవాలని కోరారు.

## వేద పండితులు గణపతి శర్మకు ఘన సన్మానం



కోటబొమ్మాళి, మే 20 ప్రభాతవార్త : స్థానిక శ్రీ కొత్త మ్మతల్లి ఆలయ పాలక మండలి సభ్యులుగా, అమ్మవారి పురోహి తులుగా పని చేసిన కోటబొమ్మాళికి చెందిన వేదపండితులు సుసరావు గణపతిశర్మకు సింహాచలం వరహాలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్య లుగా ఎంపికైన సందర్భంగా బుధవారం కొత్తమ్మతల్లి కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ, పాలకమండలి సభ్యులు ఘనంగా సత్కరించి సన్మానించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. సనాతన ధర్మ పరిరక్షణకు, వేద సంప్రదాయాల అభివృద్ధికి గణపతి శర్మ చేస్తున్న సేవలు అపారమైనవని పలువురు వక్తలు కొనియాడారు. ముఖ్యంగా యువతకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తూ, దేవాలయ సేవలో నిరంతరం కృషి చేస్తున్న గణపతిశర్మకు ఈ పదవి రావడ ఎంతో సముచితమని వారు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ కోరాడ గోవిందరావు, సభ్యులు మంచాల వెంకటరావు, దేవాది లక్ష్మణరావు, బొమ్మాళి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ అమలు



రాజాం, మే 20 ప్రభాతవార్త : ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) చట్టంలో కీలక సవరణలు చేసి, దానికి 'వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్'గా పేరు మార్చినట్లు భారతీయ జనతా పార్టీ విజయనగరం జిల్లా కార్యవర్గ సభ్యులు జొన్నాడ రంజిత్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించిందని, కొత్త చట్టం 2026 జూలై 1 నుంచి అమల్లోకి రానుందని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పథకం అమలుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,51,282 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో వర్షాకాల ముంపు నివారణకు కందకాలు నిర్మించడం, విపత్తు సంసిద్ధత చర్యలు చేపట్టడం, ఉపాధి హామీ కూలీలకు స్వచ్ఛమైన తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. కార్మికులకు ఉచిత వైద్యం, ప్రమాదం లేదా మరణం సంభవించిన సందర్భాల్లో పీఎంఎస్ బీవై ద్వారా ఎక్స్ గ్రేషియా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు కూలీల కొరత తలెత్తకుండా ప్రతి సీజన్లో 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులను నిలిపివేసి, కార్మికులను వ్యవసాయ పనుల వైపు మళ్లించే విధానాన్ని కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పథకానికి నిధుల భారం సాధారణ రాష్ట్రాల్లో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో, ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాల్లో 90:10 నిష్పత్తిలో భరిస్తాయని, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 100 శాతం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని జిల్లా కార్యవర్గ సభ్యులు జొన్నాడ రంజిత్ తెలిపారు.

21-5Pg9th cheli.qxd:21-5Pg9th cheli.qxd 1/1/02 6:19 AM Page 1



# కుంకుమ పువ్వు తేజస్సు !



**సూర్యరశ్మి వల్ల చర్మం సహజ నూనెలను కోల్పోయి** కళావిహీనంగా కనిపిస్తుంది. వేసవిలో బయటకి వెళ్లినా చర్మాన్ని కాంతిమంతంగానూ, ఆరోగ్యంగానూ కనిపించేలా చేయడానికి కుంకుమపువ్వు చక్కని పరిష్కారం. కుంకుమపువ్వులో ఉండే క్రోసిన్, క్రోసెటిన్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని యూవీ కిరణాల నుంచి కాపాడతాయి. ఇందుకు మీరు రోజూ ఉపయోగించే సన్‌స్క్రీన్ లోషన్‌లో కాస్త కుంకుమపువ్వు కలిపి రాస్తే ఎండతాపం నుంచి చర్మం సురక్షితంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, సూర్యరశ్మి వల్ల ఏర్పడే పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. దీని కోసంకావాల్సినంత పెరుగు లేదా పాలు తీసుకుని చిటికెడు కుంకుమ పువ్వు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావు గంటాగి చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మం కాంతి వంతంగా అయి, డార్క్‌స్పాట్స్ కూడా తగ్గుతాయి. కుంకుమ పువ్వు వాడటంవల్ల చర్మం సహజ తేమను కోల్పోకుండా ఉంటుంది. ఇందుకు గ్లాసు నీటిలో చిటికెడు కుంకుమపువ్వు వేసి రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఉదయం తాగాలి. దీనివల్ల సహజ మెరుపు సంతరించు కుంటుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యూవీ కిరణాలతో పోరాడి అకాల వృద్ధాప్యఛాల్ని దరిచేరనీయ కుండా చేస్తాయి. కుంకుమపువ్వులో ఉండే కెరోటినాయిడ్స్ మెలనిన్ ఉత్పత్తిని తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా చేస్తాయి. అంతేకాదు విటమిన్, ఖనిజాలు పుష్కలంగా ఉండి రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. ▫

# పెంపకమే ఆలంబనగా.. !



**పిల్లలకు మొదటి పాఠశాల ఇల్లే.. తల్లిదండ్రుల ప్రభావం, వారి పెంపకంలోనే వ్యక్తిత్వం తీర్చి దిద్దుకుంటారు. భవిష్యత్తులోకి అక్కడి నుంచే అడుగులేస్తారు. పెంపకానికి ఇంతటి ప్రాముఖ్యం ఉంది. అయితే దీని వెనక ఉన్న తల్లిదండ్రులు, వారు పెంచే విధానాలు పలు రకాలు. వీటిని బట్టి పిల్లలెలా ప్రభావితుల అవుతారు.**

**దండించి చెబితే..** పిల్లలపట్ల తల్లిదండ్రులు నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తారు. క్రమశిక్షణ తప్పిందా.. దండిస్తారు. ప్రతి విషయం తమకు నచ్చేలా చేయాలని పిల్లలపై ఒత్తిడి తెస్తారు. నియమ నిబంధనలు పాటించేలా చేస్తారు. ఎదురు ప్రశ్నించే అవకాశాన్ని వ్వరు. ఈ పెంపక ప్రభావంతో పిల్లలు యుక్త వయసుకొచ్చేసరికి నలుగురితో కలవలేకపోవడం, కుంగుబాటు లాంటి మానసిక అనారోగ్యాలకు లోనవుతారు. యూనివర్సిటీ ఆఫ్ లూవెన్ అధ్యయనంలో ఇది వెల్లడైంది కూడా. కొరవడిన ఆత్మవిశ్వాసంతో, చిన్న వైఫల్యాన్ని కూడా అంగీకరించలేని స్థితిలో ఉంటారు.

**మీరే లక్ష్యాన్ని నిర్ణయిస్తే...** ఈ రకమైన పెంపకంలో పిల్లలు తమ అభిప్రాయాలను చెప్పడానికి తల్లిదండ్రులు స్వేచ్ఛనిస్తారు. పొర పాట్లు చేస్తే వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడానికి అవకాశాలన్ని స్తారు. అయితే తమ లక్ష్యాలనే పిల్లలు సాధించాలని కోరుతారు. పిల్లలకంటూ ప్రత్యేక అభిప్రాయం ఉండటం వీరికి నచ్చదు. తప్పటడుగు వేసినా, అనుకున్న ఆశయాలను వారు చేరలేక పోయినా శిక్షిస్తారు. ఇలా పెరిగిన పిల్లల్లో క్రమశిక్షణ ఉన్నా.. నచ్చిన రీతిలో ఉండే స్వేచ్ఛ లేదనే వేదన ఉంటుంది. అందరికన్నా ముందు ఉండాలనీ, ఎదుటివారితో నిత్యం పోటీగా ఉంటూ.. అన్నింటిలో తామే నెగ్గాలనే ఆలోచన వీరిలో కనిపిస్తుంది. తల్లిదండ్రులకోసం నచ్చని లక్ష్యాన్ని చేరుకొని అసంతృప్తిగా జీవిస్తారు.

**స్నేహంగా ఉంటూ..** అరుదుగా పిల్లలను క్రమశిక్షణలో ఉంచుతారు. సంతానం నుంచి ఎక్కువగా ఆశించరు. పిల్లలతో స్నేహంగా ఉంటారు. వారి ఆశయాలు, లక్ష్యాలకు విలువనిచ్చి స్వేచ్ఛనిస్తారు. పిల్లలపట్ల బాధ్యతగా ఉంటారు తప్ప, అధికారాన్ని ప్రదర్శించరు. ఈ పెంపకంలో పిల్లలు అనుకున్నంత ఉన్నత స్థానాలు చేరుకోలేకపోయినా.. జీవితంలో ఎదురయ్యే సమస్యలను తేలికగా పరిష్కరించుకోగలుగుతారు.

**బాధ్యత లోపిస్తే..** పిల్లలపట్ల తల్లిదండ్రులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తారు. మాటామంతీ ఎక్కువ ఉండదు. కన్నందుకు బాధ్యత వహిస్తామనే ధోరణి కనిపిస్తుంది. అవసరాలన్నీ తీరుస్తారు తప్ప పిల్లల భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోరు. సలహా సూచనల్వరు. మరి కొందరైతే పిల్లల బాధ్యతను కొంచెం కూడా పట్టించుకోరు. అవసరాలు తీర్చాలనే ఆలోచనా ఉండదు. వేధింపులకూ గురి చేస్తుంటారు. ఇటువంటి తల్లిదండ్రుల వద్ద పెరిగిన పిల్లలు యుక్తవయసుకొచ్చేసరికి స్వీయ నియంత్రణ కోల్పోతారు. పెద్దగా సక్సెస్ కాలేక, కారణం ఎదుటివారే అనే భావనలో ఉంటారు. ▫

# పోషకాలతో సాంత్వన !



పాలు పోషకాలతో నిండి ఉంటాయి చిన్నా, పెద్దా.. అందరూ క్రమం తప్పకుండా తీసుకుంటే అనారోగ్యం బారిన పడకుండా ఉంటాం. పాలలోని పోషకాలు మనకు శక్తితోపాటు రక్షణనూ ఇస్తాయి. మరి ఈ పాలలో ఉండే మరిన్ని సుగుణాలు ఉన్నాయి. పాలలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్, ఫాస్పరస్ పాంథోనిక్ యాసిడ్, సెలీనియమ్, నియాసిన్ లాంటి మూలకాలు, విటమిన్–ఎ, డి, బి6 లాంటి పోషకాలుంటాయి. వీటిలోని క్యాల్షియం దంతాలు, ఎముకలు దృఢంగా ఉండటానికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ నుంచి కాపాడుతుంది. మాంసకృత్తులు కండరాలు బలపడటానికి దోహదపడతాయి. రోజూ రాత్రిపూట గ్లాసు పాలు తాగితే చక్కగా నిద్రపడు తుంది. కండరాలన్నీ సాంత్వన చెందుతాయి కూడా. బరువు తగ్గలనుకునే వారికి పాలు చక్కటి ఎంపిక. గోరువెచ్చని పాలలో కాస్తంత పసుపు వేసుకుని తాగితే గొంతు నొప్పి, జలుబు దూరమవుతాయి. పోషకాలుండే పాలను రోజూ రెండు పూటలా తాగితే చర్మం కాంతిమంతంగా తయార వుతుంది. పాలలోని విటమిన్లు, మినరల్స్ ఒత్తిడిని తగ్గిస్తాయి. . బడలికగా, అలసటగా అనిపించినప్పుడు ఓ గ్లాసు పాలు తాగి చూడండి. నిస్సత్తువ వెంటనే పోతుంది. క్రమం తప్పకుండా తాగుతూ ఉంటే శరీరం డీ హైడ్రేట్ అవదు. ▫

# వ్యథ — కౌన్సెలింగ్ అవసరం

**ప్రశ్న: 17 ఏళ్ల మా అమ్మాయి వయసుకు మించిన శృంగార ఆలోచనలతో సతమతం అవుతోంది. ఏ ఇద్దరిని చూసినా వారు ఒకరినొకరు కౌగిలించుకుని ముద్దు పెట్టుకుంటున్నట్టు స్ఫురిస్తుంది. ఆవిషయం వారికి చెప్పాలనిపించి చెప్పేస్తుంది. ఇది తప్పని ఆమెకు తెలిసినా ఊహలు వెంటాడుతున్నాయి. చిన్నప్పుడు ఒక సినిమాలో ముద్దు దృశ్యం చూసింది. ఆ తరువాత యూ ట్యూబ్ లో అలాంటివి చూసింది. ఇప్పుడు వద్దన్నా తన మనసును ముసురుకుంటున్న ఆలోచనలు కనిపిస్తున్న శృంగార దృశ్యాలు వల్ల ఒత్తిడికి గురవుతోంది. ఆత్మ హత్య చేసుకుని దేవుని వద్దకు వెళ్ళి మా ఇంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతానంటోంది. ఈ సమస్య రెండు నెలల నుంచి ఉంది. గత రెండు వారాలుగా సైకియాట్రిస్ట్ ఇస్తున్న మందులు వాడుతున్నాము. అయినా ఎలాంటి మార్పు రాలేదు. మందుల వల్ల ఆకలి మందగించింది. ఒక్కో సారి చేతులు వణుకుతున్నాయి. ఈ నేపధ్యంలో ఆమె త్వరగా కోలుకునే మార్గం చెప్పండి**

**– ఒక సోదరి, చిత్తూరు**

**జవాబు:** అమ్మా ,మీ ఆవేదన అర్థం అయ్యింది. అయితే ఆమెపట్ల చెడుగా ఆలోచించద్దు. చిన్న వయసులో చూసిన శృంగార దృశ్యాలు, యూట్యూబ్ కంటెంట్, ఊహాశక్తి, భయం, అపరాధ భావన కలిసిపోవడం వల్ల కొందరు పిల్లల్లో ఇలాంటి అనవసర ఆలోచనలు పదేపదే మెదడులోకి వస్తుంటాయి. ఈ సమస్యను 'ఇంట్రూసివ్ థాట్స్" లేదా అబ్సెసివ్ కంపల్సివ్ ఆలోచనలుగా పరిగణిస్తారు. ఆ ఆలోచనలు నచ్చకపోయినా, వాటిని ఆపాలని ప్రయత్నించిన కొద్దీ అవి మరింతగా గుర్తుకు రావడం జరుగుతుంది. దీనివల్ల ఒత్తిడి డిప్రెషన్ పెరిగి ఆత్మహత్య చేసుకుని దేవుడిని అడగాలి అన్న భావం కలిగింది. ఆమెను ఒంటరిగా వదలకుండా, ప్రేమతో దగ్గరగా ఉండండి. అలా ఆలోచవద్దు,, పాపం వస్తుంది వంటి మాటలు పరిస్థితిని మరింత తీవ్రం చేస్తాయి. ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని బలవంతంగా ఆపాలని ప్రయత్నిస్తే అవే మరింత పెరుగుతాయి. దాని బదులు,సరే ఈ ఆలోచన వచ్చింది, కొద్దిసేపటికి పోతుంది అనే స్వీకరణ భావన నేర్పాలి. యూట్యూబ్, ఫోన్ వినియోగం నియంత్రించాలి. ఖాళీగా ఉండకుండా అభిరుచులు పెంచండి. నిద్ర, పోషకాహారం పట్ల శ్రద్ధ చూపండి. మందులు ద్వారా కేవలం రెండు వారాల్లోనే పూర్తి మార్పు కనిపించక పోవచ్చు. కొన్ని మందులు పనిచేయడానికి 4–6 వారాలు పడుతుంది. చేతులు వణకడం, ఆకలి తగ్గడం వంటి దుష్ప్రభావాలు ఉంటే చికిత్స చేస్తున్న సైకియాట్రిస్ట్‌కు తెలపండి. మోతాదు లేదా ఔషధం మార్చవచ్చు. సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించండి, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ, రిలాక్సేషన్ పద్ధతుల ద్వారా అపరాధ భావన, భయాన్ని తగ్గించి ఆత్మవిశ్వాసం పెంచుతారు. ఇది చికిత్సకు సహాయకారిగా పనిచేసింది. ఆమె పట్ల ప్రేమతో వ్యవహరించండి. ▫



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# గురుభక్తి !

రాఘవేంద్ర స్వామి ఆధ్యాత్మిక భావనలో ప్రధానమైనది గురుభక్తి . ఆయన బోధనలు మనలో భక్తిని మాత్రమే కాదు, మానవత్వాన్ని కూడా పెంపొందిస్తాయి. గురువు అనుగ్రహం ఉంటే అసాధ్యం కూడా సాధ్యమవుతుంది" అనే విశ్వాసానికి శ్రీ రాఘవేంద్రస్వామి ప్రతీక. జీవితం మనిషి ఎలా భక్తి, వినయం, ధర్మంతో జీవించాలో చూపించిన మహోన్నత మార్గం. ఆయన చెప్పిన ఆధ్యాత్మిక సారం ఏమిటంటే : మనసు పవిత్రంగా ఉంటే దేవుడు మనలోనే ఉంటాడు. భక్తి అనేది కేవలం పూజలు కాదు; మంచితనం కూడా భక్తియే. ఇతరులకు సహాయం చేయడం దేవునికి చేసిన సేవతో సమానం. కష్టకాలంలో భయపడకుండా గురువును స్మరించాలి. అహంకారాన్ని విడిచిపెడితే దైవకృప లభిస్తుంది. ఇప్పటికీ ' గురు రాయరు'ను స్మరించి తమ జీవితాల్లో మార్పును అనుభవిస్తున్నారు. 'శ్రీ గురు రాఘవేంద్రాయ నమః'.. అనే నామస్మరణ మనసుకు ప్రశాంతతను, జీవితానికి ధైర్యాన్ని అందిస్తుంది. కేవలం ఒక యతి మాత్రమే కాదు; కోట్లాది మందికి ఆధ్యాత్మిక మార్గదర్శి. ఆయన పేరు స్మరించినా భక్తుల హృదయాల్లో ధైర్యం, విశ్వాసం, ప్రశాంతత కలుగుతాయి. కలి యుగంలో దైవానుగ్రహానికిప్రతీక గురు రాఘవేంద్రస్వామి. ▫



**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

# తెర




## 'రమణి కళ్యాణం' చిత్రం ట్రైలర్.

ఈ మధ్యకాలంలో ప్రేక్షకులు భారీ యాక్షన్, హంగామా కంటే మనసుకు దగ్గరయ్యే కథలకే ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీతో కలిసి చూసేలా ఉండే క్లీన్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్స్ కోసం ఆడియన్స్ ఎదురుచూస్తున్నారు. అలాంటి సమయంలో రమణీ కళ్యాణం మంచి ఫీల్‌గుడ్ సినిమాలా కనిపిస్తోంది. ఇప్పటికే టీజర్, టైటిల్ సాంగ్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా, ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరింత పెంచేసింది. కోల్పోయిన ప్రతి వారి దగ్గర ఒక కథ ఉంటుంది" అనే డైలాగ్‌తో మొదలయ్యే ట్రైలర్ మొదటి క్షణం నుంచే కథలోకి తీసుకెళ్లింది. సంజన ఆర్‌జె అండ్ సింగర్. తనకి చుపులేదు.. మరోవైపు నడవలేని స్థితిలో ఉంటాడు రాజ్. ఈ రెండు పాత్రల మధ్య ప్రేమ కథని చాలా ఎంటర్టైనింగ్ అలాగే ఎమోషనల్‌గా చెప్పారు డైరెక్టర్ విజయ్ ఆదిరెడ్డిసూర్య వశిష్ట, దీప్తిక చంద్రన్ కెమిస్ట్రీ చాలా సహజంగా అనిపించింది. ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు ట్రైలర్‌కు మంచి ఫీల్ తీసుకొచ్చాయి. కోర్ట్ ఫేం రామ్ జగదీష్ రాసిన డైలాగ్స్ ట్రైలర్‌కు మరో బలం. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్ ని నిర్మిస్తున్నారు. మే 22న విడుదల కానున్న రమణీ కళ్యాణం ప్రస్తుతం ట్రైలర్‌తో ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి ఆసక్తిని పెంచుతోంది.

## 'ఎన్టీఆర్ నీల్' టైటిల్ 'డ్రాగన్' అదిరిపోయే పవర్‌ఫుల్ గ్లింప్స్



ప్రపంచ వ్యాప్తంగా మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కు ఉన్న మాస్ క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. ఈయన తాజాగా సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఈ డైరెక్టర్ తెరకెక్కించిన కెజియఫ్ సిరీస్, సలార్ పార్ట్ వన్ చిత్రాలు బ్లాక్ బస్టర్ విజయాలను సాధించాయి. ఇప్పుడు ఎన్టీఆర్ నీల్ కాంబోలో రూపొందుతోన్న హై ఎక్స్‌పెక్టెడ్ మూవీ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. భారీ అంచనాలున్న ఈ చిత్రం శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ఎన్టీఆర్‌నీల్ మూవీ అప్‌డేట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ను 'డ్రాగన్'గా ఖరారు చేస్తూ ఎన్టీఆర్ పాత్రను పరిచయం చేశారు. దీనికి సంబం ధించిన గ్లింప్స్ విడుదలైంది. 4 నిమిషాల 28 సెకన్ల ఈ గ్లింప్స్ 1967 నేపథ్యంలో నడిచే చీకటి ప్రపంచాన్ని చూపిస్తుంది. రుక్మిణి వసంత్ పాత్రను పరిచయం చేవారు. ఈ కథ 'గోల్డెన్ ట్రైయాంగిల్' ప్రాంతంలోని అంతర్జాతీయ అఫీమ్ (ఓపియం) అక్రమ వ్యాపారం నేపథ్యంలో సాగుతుంది. ఎన్టీఆర్ ఇందులో లూగర్ అనే పాత్రలో.. అఫ్గాన్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన అస్సాసిన్‌ఇన్‌చీఫ్ అనే భయంకరమైన కొత్త అవతారంలో కనిపిస్తారు. రుక్మిణి వసంత్ ఆయన్ని డెవిల్ అని సంబోధిస్తుంది. ఎన్టీఆర్ డైలాగ్ చెప్పే తీరు, స్క్రీన్‌పై ప్రెజెన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. సన్నగా, దృఢమైన ఫిజిక్‌తో పాటు డిఫరెంట్ లుక్‌లో ఎన్టీఆర్ కనిపించడంతో ఈ సినిమాపై ఉన్న హైప్ నెక్స్ట్ లెవల్‌కు చేరింది. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఈ చిత్రంలో భారత నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ రఘువీర్ రాథోడ్ పాత్రలో నటించారు. డ్రాగన్ మూవీపై ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంచేలా చిత్రబృందం సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రం 2027 జూన్ 11వ తేదీ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. డ్రాగన్ మూవీ తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం తదితర భాషల్లో విశేష ప్రేక్షకాదరణతో విడుదల కానుంది. ఎన్టీఆర్ నీల్ మూవీగా ఈ 'డ్రాగన్' భారీ యాక్షన్‌తో పాటు ఆసక్తికరమైన కథను కలగలిపిన థ్రిల్లింగ్ అనుభూతిని అందించబోతోందని అందరూ భావిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని కళ్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు.

## 'డోంట్ స్లీప్' ఫస్ట్ లుక్ రిలీజ్



'చౌర్య పాఠం'లో ఆకట్టుకున్న ఇంద్ర రామ్ హీరోగా, మమ్ముట్టి నటించిన 'స్ట్రీట్ లైట్స్'కి దర్శకత్వం వహించిన సినిమాటో గ్రాఫర్ షామ్‌దత్ దర్శకత్వంలో సైకలాజికల్ థ్రిల్లర్ 'డోంట్ స్లీప్' రూపొందుతోంది. వి. చూడామణి ఈ చిత్రాన్ని వి డ్రీమ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం 2 గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే రివిల్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు సునీల్ థాపా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన జన్మదిన సందర్భంగా ప్రేమతో స్మరించుకుంటూ ఈ చిత్రంలో ఆయన ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఆయన పోషించిన 'టాంజిన్' పాత్ర పవర్‌ఫుల్‌గా, ప్రభావవంతంగా ఉండబోతోంది. తన ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్, నటనతో సునీల్ థాపాప్రేక్షకు లను మెస్మరైజ్ చేయను న్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. 'పుష్ప: ది రైజ్' చిత్రానికి పనిచేసిన మోనికారామకృష్ణ ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు.

## ఎంజాయ్ చేసే చిత్రం 'పురుష': బత్తుల కోటేశ్వరరావు



కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం పురుష ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబోతోన్నారు.

**మీ నేపథ్యం చెప్పండి?..**

నా పేరు బత్తుల కోటేశ్వరరావు. మాది గుంటూరు జిల్లాలోని కారంపూడి. నాకు సినిమా ఫీల్డుతో ఎలాంటి సంబంధం లేదు. కానీ ఇక్కడకు వచ్చాక అందరూ ఎంతో సపోర్ట్ చేస్తున్నారు.

**మీ అబ్బాయికి పవన్ కళ్యాణ్ అని పేరు పెట్టారు.. ఎందుకలా?..**

'గోకులంలో సీత' చూసిన తరువాత పవన్ కళ్యాణ్ గొప్ప స్థాయికి వెళ్తారని అనిపించింది. ఆ వయసులో నన్ను నేను ఆయన లో చూసుకున్నాను. ఆయన అభిమానిగా మారిపోయాను. నాకు కొడుకు పుడితే ఆయన పేరే పెట్టుకోవాలని అనుకున్నాను.

**సినిమాల్లోకి రావాలన్న ఆలోచన ఎవరిది?..**

సినిమా ఫీల్డ్ అంటే నాకు చాలా ఇష్టం. మా అబ్బాయికి సిగ్గు, బిడియం ఎక్కువ. హీరో అవ్వాలన్న నా కలని మా అబ్బాయి ద్వారా నెరవేర్చుకున్నాను.

**దర్శకుడితో ఉన్న పరిచయం చెప్పండి?..**

వీరుతో సినిమా కంటే ముందు ఓ దర్శకు డితో సినిమా చేయాల్సి ఉంది. కానీ అది కుదరలేదు. ఆ తరువాత సతీష్ ముత్యాల వీరుని పరిచయం చేశారు. కథ చెప్పారు. నాకు బాగా నచ్చింది. మా కన్‌స్ట్రక్షన్ ఆఫీస్‌నే సినిమా ఆఫీస్‌గా మార్చాం.

**'పురుష'లో మీకు నచ్చిన పాయింట్స్ ఏంటండి?..**

'పురుష' కథ చాలా బాగుంటుంది. ఆయన నెరేషన్ ఇచ్చిన తీరు కూడా డిఫరెంట్‌గా ఉంది. ఇందులోని లవ్ స్టోరీ నాకు చాలా నచ్చింది. ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుంది.

**'పురుష'లోని పాత్రల గురించి చెప్పండి?..** వీటీవీ గణేష్‌పాత్ర అందరినీ నవ్విస్తుంది. ఆయన మాకు ఎంతో సహకరించారు. డేట్స్ విషయంలో ఎంతో హెల్ప్ చేశారు. వెన్నెల కిషోర్ వల్లే కథలో సంఘర్షణ వస్తుంది. సప్తగిరి అద్భుతంగా నటించారు.

**'పురుష' మ్యూజిక్ గురించి చెప్పండి?..** మాకు శ్రవణ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. మా కోసం కీరవాణి కూడా ఓ పాట పాడారు. అది మా అదృష్టం. ఇప్పటికే మా సినిమాలోని పాటలకు మంచి స్పందన లభించింది.

**'పురుష'ను ఎన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నారు?..** 'పురుష' సినిమాని మొత్తంగా మూడు వందల థియేటర్లలో రిలీజ్ చేస్తున్నాం.

## 'మరీచిక' ట్రైలర్ విడుదల..



నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సతీష్ కాసెట్టి తన కొత్త థ్రిల్లర్ మూవీ 'మరీచిక'తో మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. వైవిధ్యమైన , ఆలోచింపజేసే కథలను చూపడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన డైరెక్టర్ మరోసారి తనదైన శైలిలో ఈసారి కూడా ఆసక్తికరమైన సినీ అనుభూతిని అందించినట్టు ట్రైలర్ చూస్తుంటే అనిపిస్తోంది. ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, అనుపమ పరమేశ్వరన్, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా మే 29న భారీ స్థాయిలో థియేటర్లలో భారీ ఎత్తున విడుదలకు సిద్ధమవుతోంది. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, మేఘా చిలక ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. తాజాగా శనివారం విడుదలైన ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల్లో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. 'మరీచిక' ట్రైలర్‌ను గమనిస్తే ఎమోషన్స్‌తో పాటు మిస్టరీ అంశాలతో ప్రారంభమైంది. ఇందులో వెంకట లక్ష్మి అనే పల్లెటూరి అమ్మాయి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించారు. సంజు పాత్రలో విరాజ్ అశ్విన్ కనిపించగా.. మరీచిక పాత్రలో రెజీనా కసాండ్రా కనిపించారు. సంజుని మరీచిక చంపేసిందంటూ అనుపమ పరమేశ్వరన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం.. కథ ముందుకు సాగేకొద్దీ పాత్రల మధ్య ఉన్న సంబంధాలు మారిపోతూ కనిపించాయి. అలాగే భావోద్వేగాలను చూపిస్తూనే సన్నివేశాలు అనుమానాల వైపు దారి తీస్తూ కనిపించాయి. ట్రైలర్ రెండో భాగంలో మరింత ఉత్కంఠభరిత మైనదృశ్యాలు, హత్య దర్యాప్తు ఆసక్తిని పెంచుతున్నాయి. అసలు సంజూను ఎవరు హత్య చేశారు? మరీచిక ఎవరు? వారి జీవితాల్లో జరుగుతున్న పరిణామాలకు ద్రోహమే కారణమా? అనే ప్రశ్నలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పోలీస్ దర్యాప్తు, భావోద్వేగ ఘర్షణలు, మిస్టరీ సన్నివేశాలు ఈ కథలో సైకలాజికల్, రివేంజ్ డ్రామా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రేక్షకులను ఉత్కంఠలో ఉంచే థ్రిల్లర్‌ను మన ముందుకు రానున్నట్లు స్పష్టమవుతోంది. లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా అందించిన సంగీతం.. నేపథ్య సంగీతం ట్రైలర్ మొత్తం ఉత్కంఠతను, భావోద్వేగ తీవ్రతను మరింత పెంచాయి.

## చిరు158 చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాశ్ కొల్లా



మెగాస్టార్ చిరంజీవి సెన్సేషనల్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్ వాల్తేర్ వీరయ్య తర్వాత మరో మాస్ ఎంటర్‌టైనర్ కోసం సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లితో మరోసారి జతకడుతున్నారు. ఈ చిత్రాన్ని సుప్రసిద్ధ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. చిరుబాబీ2 / చిరు158 మే 21న అధి కారికంగా ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ ఈ చిత్రానికి డీవోపీగా వ్యవహరిస్తు న్నారు. తాజాగా మేకర్స్ మరో టాప్ టాలెంట్‌ను టీమ్‌లోకి ఆహ్వానించారు. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా టీంలో చేరారు. మెగాస్టార్ చిరంజీవిని ఇప్పటి వరకు ఎప్పుడూ చూడని అత్యంత ఫెరోషియస్ అవతార్‌లో ప్రజెంట్ చేయడానికి, భారీ స్థాయి సినిమాటిక్ వరల్డ్‌ను తన విజన్, ఎక్స్‌పర్టైజ్‌తో అవినాష్ కొల్లా అద్భుతంగా ఆవిష్కరించనున్నారు. ఇప్పటికే విడుదలైన లుక్ టెస్ట్ ఇమేజెస్, అనౌన్స్‌మెంట్ పోస్టర్, అలాగే చిరంజీవి జిమ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఆయన కొత్త స్టైలిష్ అవతార్‌పై భారీ ఆసక్తిని పెంచాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌ను గ్రాండ్‌గా తెరకెక్కించడంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న బాబీ కొల్లి, ఈసారి చిరంజీవిని ఇప్పటివరకు చూడని అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించబోతు న్నారు. మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా రూపొందుతున్న ఈ చిత్రం పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, హై వోల్టేజ్ ఎలివేషన్స్, థియేటర్లను షేక్ చేసే మాస్ మూమెంట్స్‌తో ఉండబోతోంది.

# సరుకు నిల్వల్లో తేడాలుంటే కేసులు నమోదు



రామభద్రపురం,మే20(ప్రభాత వార్త: పౌరసరఫరాల పంపిణీ డీలర్లు వద్ద సరుకు నిల్వల్లో తేడాలుంటే కేసులు నమోదు చేస్తామని స్థానిక మండల తహశీల్దార్ అజూరఫీజాన్ హెచ్చరించారు.బుధవారం ఉదయం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతీ నెలా రేషన్ షాపులను తనిఖీ చేయాలని ఆదేశాలు వచ్చాయని, తప్పనిసరిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని,సరుకు నిల్వల్లో తేడాలుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.బినామీ డీలర్లపై ఫిర్యాదులు వస్తున్నాయని, డీలర్లు తమ షాపులను తామే నిర్వహించాలని,గ్రామాల్లో ప్రజలతో పంచనామా నిర్వహించి బినామీ అని నిరూపణ అయితే డీలర్ ను తొలగిస్తామని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీలర్లు వేరే పనులు చేయరాదని అన్నారు.వయో వృద్ధుల బయో మెట్రిక్ పడకపోతే అదే డిపోలో నామినీను గుర్తించి సరుకులు పంపిణీ చేయాలని కోరారు.ప్రధాన నిల్వ కేంద్రం నుండి సరుకు తెచ్చుకున్నప్పుడు తూకంలో తేడాలుంటే అక్కడే సరిచూసుకోవాలని,తేడాలకు డీలర్లే భాధ్యత వహించాలని తెలిపారు.వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవిఆర్ యస్ సర్వేలో మంచి ఫలితాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సియస్డీటి సాయిక్రిష్ణ,ఆర్ఐ, సీనియర్ సహాయకుడు,డీలర్ల సంఘం నాయకులు నడిపల్లి వేంకటరమణ,గంట నాగేశ్వరరావు, రామారావు,శ్రీను, మీసాల రాజినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# శివాలయానికి గ్రానైట్ పలకలు వితరణ



వెంరకముడిదాం,మే20 ప్రభాతవార్త : మండలం గరుగుబిల్లి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న శివాలయానికి 2385 అడుగులు గ్రానైట్ను మరియు 1000 అడుగులు గోడలకు సరిపోయిన టైల్స్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏపీ ఈపీడీసీఎల్ ఇ.ఈ. ఆవాల సూరప్పల్ నాయుడు కుమారుడు అనంతరావు 400000 రూపాయలు అక్షరాల( నాలుగు లక్షల రూపాయలు)విలువైన అందజేశారు. ఇంత పెద్ద మొత్తంలో కోవెలకు గ్రానైట్ పలకలు అందజేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# తహసీల్దార్‌కు కెమిస్ట్‌ల వినతి పత్రం



మెరకముడిదాం, మే 20: మండలంలో ఉన్న మందుల షాపుల యజమానులు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండల రెవెన్యూ తాహసిల్దార్ ఆకుల సులోచన రాణి కి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఆన్లైన్ మందుల అమ్మకం నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న అధిక డిస్కౌంట్లు రద్దు చేయాలని, నకిలీ మందుల విక్రయాలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా కెమిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు మండల కార్యాలయంలో తాహసిల్దార్ కు కెమిస్ట్ లు వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న ఔషధ వ్యాపారులందరూ స్వచ్ఛందంగా మందులు దుకాణాలు సంఘీభావంగా మూసివేశారు.

# జాతీయ తైక్వాండో పోటీల్లో విజయనగరం క్రీడాకారుల ప్రభంజనం

## 16 గోల్డ్ మెడల్స్‌తో ఘన విజయం



విజయనగరం, మే 20 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా బృందావన్ గార్డెన్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. మే 15, 16, 17 తేదీలలో మూడు రోజుల పాటు జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలలో జిల్లా జట్టు తమ మేటి నైపుణ్యంతో ఏకంగా 16 బంగారు, 9 వెండి, 1 కాంస్య పతకాలను కైవసం చేసుకుని సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ పోటీల్లో ఎన్. హర్షిణి, టి. నాగ సాయి జతిన్, వై. ముకేష్ విశ్వనాథ్, వి. రోహిణి సత్యలు అసాధారణ ప్రతిభ కనబరిచి తలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. అలాగే డి. ప్రియవల్లి, డి. కార్తికేయ, ఎస్. గగన్, ఆర్. పూర్ణ చంద్రు, వై. చరిష్మా, టి. సాంకీర్తన, ఎస్. సత్విక్, డి. ధనీష్‌లు ఒక్కో బంగారు పతకాన్ని సాధించి జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో చాటారు. ఎం. భావ్య శ్రీ, పి. సహస్ర సమ్మిత, డి. ప్రియవల్లి, ఎ. ముకేష్ మనికంఠ, టి. మేఘనా శ్రీ, ఆర్. తేజ శ్రీ, జి. ఫలక్ కుమార్, జి. తరుణ్, డి. ధనేష్‌లు ప్రతిభ చాటి రజత పతకాలను సొంతం చేసుకోగా, కాంస్య (బ్రోంజ్) పతకాన్ని ఎస్. సత్విక్ సాధించారు. జాతీయ స్థాయిలో విజయనగరం పేరును మారుమోగించిన క్రీడాకారులను విజయనగరం జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్. వేణుగోపాలరావు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులను ఇంతటి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దిన కోచ్‌లు యశస్విని, చైతన్యల కృషిని వారు కొనియాడారు. విజేతలైన క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# అప్పలనరసయ్యను విమర్శించే ముందు నీస్థాయి తెలుసుకో

## టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ పై వైసిపి నాయకుల ఆగ్రహం



దత్తిరాజేరు, మే 20 ప్రభాత వార్త : నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య ను విమర్శించే హక్కు చప్ప చంద్ర శేఖర్ కు నీకు లేదని ఆ స్థాయి నీది కాదని జడ్పిటిసి సభ్యురాలు రౌతు రాజేశ్వరి మండల వైసీపీ సీనియర్ నాయకుడు మరియు జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు విమర్శించారు మండల కేంద్రమైన దత్తిరాజేరు మహదేవ్ ఫణీంద్ర ఇంటి వద్ద పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక విలేకరులు ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా డీజిల్ పెట్రోల్ ధరల పెంపుపై నియోజకవర్గ స్థాయిలోమాజీ శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య సమక్షంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు టిడిపి నాయకులు జనాన్ని చూసి ఓర్వ లేక వ్యక్తిగత విమర్శలు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు దత్తిరాజేరు మండలం అభివృద్ధి ఎవరు చేశారు నీకు తెలియదా కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు రోడ్లు చేసేసరికి భుజాలు గుద్దేస్తున్నావు మాజీ శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య అన్ని గ్రామాలకు తారు రోడ్లు వేశారని ప్రభుత్వ పాఠశాలలు మంజూరు చేశారని షికార్ గంజిలో మోడల్ స్కూల్ మండల కేంద్రంలో కస్తూర్బా బాలికల హైస్కూలు కే కొత్తవలసలో గురుకుల పాఠశాల మరడాశీలో ఇంటర్మీడియట్ కాలేజ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తోటపల్లి కుడి కాలువ పనులు 420 మెగావాట్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఇవన్నీ అప్పల నరసయ్య తెచ్చినవి కాదా అని చప్ప చంద్రశేఖర్ నీ కళ్ళకి కనిపించవా మేము చేసిన అభివృద్ధి గురించిమీరు చేసిన అభివృద్ధి కోసం ఎక్కడికైనా చర్చకి వస్తావని శవాలు విసిరారు మీరు తప్పుచేసి ఎదుటివారిపై నెట్టడం ఇది సమంజసం కాదని ఆరోపించారు కూలర్ మోసం చేసి డబ్బులు తీసుకోవడం మా పార్టీకి చేతకాదని విమర్శించారు మానాపురం సంతలో పశువులు వ్యాపారస్తులు దగ్గర కమేషన్లు రైల్వే కళాశాల దగ్గర కమిషన్లు తీసుకొని ఇవి తప్పు కాదా విమర్శించారు అభివృద్ధిలో పోటీపాడు కానీ వ్యక్తిగత విమర్శలు మాట్లాడే నైతిక హక్కు నీకు లేదన్నారు ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు మిత్తి రెడ్డి రమేష్ నాయుడు.సుమల గోవింద్ చుక్క మురళి మండల శ్రీను పాల్గొన్నారు.

# ఘనంగా నగల పోలమ్మ పండగ

డెంకాడ, మే 20 ప్రభాతవార్త : మండలంలోని గుణుపూర్ పేట గ్రామంలో నగల పోలమ్మ పండగ బుధవారం తో ముగిసింది. భక్తులు ఘటాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి వేషధారణ, కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

# వర్కర్స్ ఇంక్రిమెంట్లు వెంటనే విడుదల చేయాలి



సాలూరు, మే20, ప్రభాతవార్త : సాలూరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికుల ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీ డిమాండ్ చేసింది.బుధవారం అందులో భాగంగా శానిటేషన్ ఇన్స్పెక్టర్ కు కార్మిక నాయకులు వినతి పత్రం అందజేసారు.అనంతరం వారు మాట్లాడుతు పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు చెలించాల్సిన ఇంక్రిమెంట్లు తక్షణ ఇవ్వాలని లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పర్మినెంట్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్ వై నాయుడు, నాయకులు టి. వెంకటరావు, జి.వెంకటరమణ,టీ భోగిసు,జె శ్యాంకుమార్, జలగడుగుల మంగమ్మ, పాల్గొన్నారు.

# బడి పిలుస్తోంది - పిల్లలు అందరినీ బడిలో చేర్పిద్దాం



కురుపాం, మే20, ప్రభాతవార్త: బడి ఈడు పిల్లలకు బడి లో చేర్పించాలని ఎంఈఓ ఎన్. సత్యనారాయణ అన్నారు.బుధవారం కురుపాం జడ్పీ హైస్కూల్లో రాష్ట్ర ఐ టి సెల్ సిబ్బంది తో బడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ప్రతి చిన్నారి చదువుతోనే భవిష్యత్తు వెలుగుతుంది పిల్లలు అందరిని బడిలో చేర్పించడం మన బాధ్యత అని ఆయన అన్నారు. ఈరోజు అడుగు -- రేపటి విజయానికి బాటఅన్నారు. స్టేట్ ఐ టి సెల్ సిబ్బంది మాటాడుతూ ఐదు ఏళ్ళు దాటిన పిల్లలకు అందరిని తల్లిదండ్రులు ప్రభుత్వ బడిలో చేర్పించాలని బడి బయట పిల్లలు ఎవరు ఉండకూడదని, తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా, బాధ్యత గా బడిలో చేర్పించాలనిన్నారు. ప్రైవేటు పాఠశాల నుండి ప్రభుత్వ బడిలోకి 7గురు విద్యార్థులను జాయిన్ చేశారు.ఈ కార్యాక్రమం లో స్టేట్ ఐ టి సెల్ సిబ్బంది జోజప్ప , పి పూర్ణచంద్ర రావు, మండల విద్యాశాఖ అధికారులు ఎన్. సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు టీ. శంకరరావు ఉపాధ్యాయులు ఎ . జగదేశ్వరరావు, సంతోష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చీపురుపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



చీపురుపల్లి, మే 20 ప్రభాతవార్త : సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం నాడు అభిమానుల మధ్య ఘనంగా వేడుకలకు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు ముఖ్య అతిథిగా హాజరై కేకు కటింగ్ జరిపారు. చీపురుపల్లి పట్టణం వంశీ విష్ణు సినిమాహాల్ దగ్గర యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కోలాహలం మధ్య పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరో పుట్టినరోజు పురస్కరించుకొని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు వారు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేసి పలువురు అభిమానులు రక్తదానం చేశారు.చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బెల్లాన త్రినాధ రావు, రేవల్ల సత్తిబాబు, గవిడి సురేష్, నాగచైతన్య,రాము , దన్నానసత్యం, రామ గురువులు, జమ్మూ వెంకటరమణ ,గోవిందా, హరి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు విజయనగరం అమ్మాయి



లివిజయనగరం మే 20, ప్రభాతవార్త: బెంగుళూరు వేదికగా జూన్ 8 నుంచి 10వ తేదీ వరకు జరుగబోయే జాతీయ స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన దాస్ ఎంపీకెందని విజయనగరం అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ బుధవారం తెలిపారు. మే 15న కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు పాల్గొనగా.. వారిలో ప్రియాంక అత్యుత్తమ ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపిక అయిందని చెప్పారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పాచిపెంట, మే 20, ప్రభాత వార్త: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించి బంగారు భవితవ్యానికి పునాదులు వేసుకోవాలని పాచిపెంటఎస్సై, ఎల్ .అర్జున్ యువతకి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన పాచిపెంట పోలీస్ స్టేషన్ సమీపంలో ఏఎంసి మైదానం లో యువతకు అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు, క్రీడాకారులకు, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్ధాలపైన అవగాహన కల్పించారు. యువత క్రీడల్లో రాణించాలని బెట్టింగ్, గంజాయి, మాదక ద్రవ్యాల జోలికిపోయి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా వారిని హెచ్చరించడం జరిగింది. మాధక ద్రవ్యాల సమాచారం తెలిస్తే పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని అన్నారు. యువత రోడ్డు భద్రతాయ నియమాలు ఉల్లంఘించి మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రమాదాల బారిన పడి కుటుంబానికి తీరని శ్వాకాన్ని మిగల్చోద్దని హితవు పలికారు.

# పార్టీ పటిష్టానికి బూత్ స్థాయి కార్యకర్తలే కీలకం



గరివిడి, మే20, ప్రభాత వార్త: పార్టీ పటిష్టానికి బూత్ స్థాయి కార్యకర్తలే కీలకమని చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా మహిళా నాయకురాలు డాక్టర్ బొత్స అనూష అన్నారు. గరివిడి లోగల శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంప్ కార్యాలయం లో బుధవారం చీపురుపల్లి పట్టణ,మండల గ్రామ క్లస్టర్,డివిజన్ ఇంచార్జి లు,బూత్ ఏజెంట్లు కి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష మాట్లాడుతూ బూత్ స్థాయిలో ఇంటి ఇంటి కి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పులు సవరణ,తదితర అంశాలపై ప్రతీ కార్యకర్త బాధ్యత గా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క ఓటు తప్ప కూడదన్నారు.కార్యక్రమంలో చీపురుపల్లి మండల వైకాపా అధ్యక్షుడు మీసాల వరహాల నాయుడు, జిల్లా వైకాపా నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు, బెల్లాన వంశీ కృష్ణ,తదితరులు పెక్కు సంఖ్యలో పాల్గొన్నారు.

# త్వరలో న్యాయం చేస్తామని హోంమంత్రి హామీ ఇచ్చారు



శృంగవరపుకోట,మే20,ప్రభాతవార్త : జిందాల్ వ్యవహారంలో హోంమంత్రి అనితతో రైతుల తరపున పోరాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చాలా కాలంగా చర్చలు జరుపుతున్న విషయం అందరికీ తెలిసిందే.ఇందులో భాగంగా బుధవారం విశాఖలోని హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ, జాయింట్ కలెక్టర్,ఆర్డీవో,తహసీల్దార్, జిందాల్ సంస్థ ప్రతినిధులను,రైతులను పిలిపించి జిందాల్ సమస్యలపై మాట్లాడారు.రైతులకి జరిగిన అన్యాయం గురించి వారికి ఏవిదంగా న్యాయం చేయాలనే విషయాలపై విస్తృతంగా చర్చించారు.రైతులు పలు డిమాండ్లలను హోంమంత్రి ముందు ఉంచారు. రైతుల డిమాండ్లను పరిశీలించిన హోంమంత్రి సానుకూలంగా స్పందించి కంపెనీ,ప్రభుత్వంతో మాట్లాడతానని త్వరలోనే దీనికి సరైన పరిష్కారం ఆలోచించి సమస్యను కొలిక్కి తెస్తామని హోంమంత్రి అనిత హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు.

# కార్పొరేట్ సంస్థలతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయి



కురుపాం, మే20, ప్రభాతవార్త: కార్పొరేట్ సంస్థల నిర్వాహకంతో తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని కురుపాం మెడికల్ షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏఐఓసీడి పిలుపుమేరకు మండలకేంద్రం కురుపాం లో మెడికల్ షాపులను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. చీటీ లేకుండా మందులు విక్రయించకూడదని నిబంధనలు చెబుతున్నాయి. ఆన్ లైన్ విక్ర యాలకు ఎటువంటి డాక్టర్ చీటీలు లేకుండానే ప్రమాదకర కొన్ని రకాల మందుల విక్రయాలు జరుగుతున్నాయని మెడికల్ షాపుల యజ మానులు ఆరోపించారు. ఆన్లైన్ మందుల విక్రయాలతో రిటైల్ మందుల షాపుల్లో విక్రయాలు తగ్గి తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని అన్నారు. డీలర్ల పరిస్థితి కూడా ఇలానే ఉందని ఏఐఓసీడీ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తకోట సురేష్, ఎస్ రవి కుమార్, కె.శ్రీనివాసరావు, జె ప్రభ, కొత్తకోట శ్రీను, కొత్తకోట రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కిశోరి వికాసం అవగాహన సదస్సు



శృంగవరపుకోట, మే20, ప్రభాతవార్త : మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ (ఎస్. కోట) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోరి వికాసం అవగాహన సదస్సు మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ తాటిపూడి పిడబ్లూడీ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.కిశోర బాలికల విద్యాభి వృద్ధి,రక్షణ, ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కార్యక్రమా న్ని చేపట్టారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐ.సి.డి.ఎస్ సూపర్ వైజర్ నాగరత్నం పాల్గొని మాట్లాడుతూ సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని అందుకు విద్యే మూలస్తంభమని పేర్కొన్నారు.ఈసందర్భంగా బాలికలకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. విద్య,ఆరోగ్యం బాలికల ఉన్నత విద్యా ప్రాధాన్యతను, పౌష్టికాహారం,శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.బాల్య వివాహాల నిర్మూలన,బాల్య వివాహాల వల్ల కలిగే శారీరక,మానసిక అనర్థాలను వివరించి వాటిని పూర్తిగా అరికట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్పీ బి.రాధారాణీ, ఏడబ్లూహెచ్ కృప,కేంద్ర కార్యకర్తలు, ఆశా వర్కర్లు , తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త 25

# నల్ల బ్యాడ్జీలతో కెమిస్టుల నిరసన ప్రదర్శన



గరివిడి, మే 20 ప్రభాత వార్త: అఖిల భారత కెమిస్టుల సమైక్య పిలుపుమేరకు గరివిడి లో కెమిస్టులు బుధవారం ఒకరోజు మెడికల్ షాప్ లు బంద్ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని అన్ని మెడికల్ దుఖాణాలను మూసివేసిన ఫార్మసీ యజమానులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరశన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా దుకాణ నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రిస్క్రిప్షన్‌లను సరిచూడకుండా ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలు జరగడం, భారీ డిస్కౌంట్లతో మెడికల్ షాపులకు నష్టం కలిగించడం, ఏఐ ద్వారా సృష్టించబడిన నకిలీ ప్రిస్క్రిప్షన్‌లు, పోస్టు వైద్యుల పేరిట నకిలీ ఆన్‌లైన్ సంప్రదింపులు, ఒకే ప్రిస్క్రిప్షన్‌ను పలుమార్లు ఉపయోగించడం, నియంత్రిత , సున్నితమైన ఔషధాల అక్రమ విక్రయాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలు ఫార్మసీ రంగ అభివృద్ధికి తీవ్ర ముప్పుగా మారుతుందని వారు ఆవేదన చెందారు. ర్యాలీ, నిరశన అనంతరం గరివిడి తహసీల్దార్ చింత బంగార్రాజు కి వినతిపత్రం అందజేసి తమ బతుకులు కాపాడాలని మెడికల్ షాపు నిర్వాహకులు విన్నవించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారుముక్తకంఠంతో కోరారు.

# పోలీస్ స్టేషన్కు సోలార్ స్ట్రీట్ లైట్ సిస్టమ్స్ వితరణ




నెల్లిమర్ల, మే 20, ప్రభాతవార్త : విజయనగరానికి చెందిన ఎన్ సొల్యూషన్స్ సంస్థ నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ , ఏఎస్ఐ సతీష్ ల అభ్యర్థన మేరకు పోలీస్ స్టేషన్ వద్ద వినియోగానికి అవసరమయ్యే సోలార్ స్ట్రీట్ లైట్ సిస్టమ్స్ ను వితరణగా అందజేశారు. ఈ మేరకు ఎన్ సొల్యూషన్స్ అధినేత రవ్వ లక్ష్మీబాయి మూడు సోలార్ స్ట్రీట్ లైట్ సిస్టమ్స్‌ను తన చేతుల మీదుగా బుధవారం ఎస్ ఐ గణేష్ కు అందజేశారు. అలాగే పోలీస్ స్టేషన్ ఆవరణలో మూడు సోలార్ స్ట్రీట్ లైట్స్‌ను విజయవంతంగా ఇన్‌స్టాల్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్, ఏఎస్ఐ సతీష్ లక్ష్మీబాయి కి కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు రవ్వ నాని, అప్పికొండ రవికుమార్, ఎన్ సొల్యూషన్స్ ప్రతినిధి రాజు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సంకల్పం 2.0 విజయవంతం చేయాలి



బలిజిపేట, మే 20 ప్రభాతవార్త : మండలం అంపవల్లి గ్రామంలో బలిజిపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంకల్పం 2.0 లో భాగంగా గ్రామ ప్రజలకు వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ప్రజలకు ప్రతి ఒక్కరూ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి మరియు రోడ్డు సేఫ్టీ రూల్స్ ను తప్పనిసరిగా పాఠం చేయాలి మరియు యాంటీ డ్రగ్ మాదకద్రవ్యాలు పై అందరూ సహకరిస్తే నిర్మూలన చేయవచ్చని స్థానిక ఎస్సై పై సింహాచలం ప్రజలకు విజ్ఞప్తి చేశారు మరియు సైబర్ నేరగాలపై అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు తెలియపరుస్తున్నామని అందరూ కూడా జాగ్రత్త వహించి తప్పనిసరిగా సూచనలు పాటించాలని తెలియజేశారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం, మే 20 ప్రభాతవార్త: సభ్యులవి పాత సమస్యలే అధికారులవి అవే సమాధానాలుబుధవారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షుడు చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది.ప్రతీ సమావేశంలోనూ సమస్యలను లేవనేత్తే మామిడివలస,రొంపల్లి,రామభద్రపురం యమ్పీటీసి సభ్యులు మడక తిరుపతినాయుడు,బవిరెడ్డి శంకరరావు,వసంతుల తిరుపతిలు ఎప్పుడూ లేవదీసే సమస్యలనే లేవనెత్తడం,అధికారులు కూడా అదే బాణీలో సమాధానాలు వెరసి అధికారులు మారినా సమస్యలు పరిష్కారం పాత చింతకాయ పచ్చడి లాగే ఉంది.అయితే కొసమెరుపుగా భూశాయవలసలో రహదారిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిని అధికారులు పట్టించుకోవడం లేదని మడక తిరుపతినాయుడు ఈఓపీఆర్డీపై ధ్వజమెత్తారు.మీకు చేతకాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆ గ్రుహ యజమానికి నోటీసు ఇచ్చామని,చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ తెలిపారు.బినామీ డీలర్ పై రొంపల్లి యమ్పీటీసి ఫిర్యాదు చేయగా పక్క డీలర్ పై కేసు నమోదు చేశారని తహశీల్దార్ సమస్యను చల్లపరిచారు.సర్పంచ్ ల పదవీకాలం పూర్తికావడం, సగానికి సగం యమ్పీటీసిలు హాజరు కాకపోవడంతో చప్పగా సాగిన సమావేశంలో అధికారులు హాయిగా తమ తమ శాఖల పనితీరును చదివి వినిపించారు.స్థానిక జడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, తహశీల్దార్ అజూరఫీజాన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి యమ్.రత్నం, డిప్యూటీ యమ్పీడిఓలు,సియస్డీటి సాయిక్రిష్ణ,వివిధ శాఖల అధికారులు,కార్యాలయ సీనియర్ సహాయకుడు చొక్కాపు శ్రీరాములునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైకాపా హయాంలోనే దళితులపై దౌర్జన్యాలు



భోగాపురం, మే 20,(ప్రభాతవార్త) : గత వైకాపా ప్రభుత్వ హయాంలో దళితులపై అరాచకాలు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయని, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూనే జగన్ రెడ్డి దళితుల గొంతు కోశారని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భోగాపురం మండలం రావాడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం గత ప్రభుత్వ హయాంలో హత్యకు గురైన వీధి సుబ్రహ్మణ్యం సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బంగార్రాజు సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, జగన్ రెడ్డి ఐదేళ్ల తుగ్లక్ పాలనలో 200 మందికి పైగా దళితులు దారుణంగా హతమార్చబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ అచ్చెన్నల ఘటనలే వైకాపా దళిత వ్యతిరేక విధానాలకు సజీవ సాక్షాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, పార్లమెంట్ అధికార ప్రతినిధి నీలాపు అప్పలరామిరెడ్డి (ఎస్ పి ఎల్), నెల్లిమర్ల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ హరిబాబు, టిడిపి నాయకులు అవనాపు శ్రీనివాసరావు, నారాయణరావు, పట్నాన అప్పలనాయుడు మరియు స్థానిక దళిత నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతతోనే మహానాడును కుదించిన అధిష్టానం



గరుగుబిల్లి, మే 20, ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని ఈసారి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్వహించాలని ముఖ్యమంత్రి మరియు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్ణయించడం జరిగిందని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మరడాన నారాయణస్వామి వెల్లడించారు. మండల పరిధిలోని ఎర్రన్నగుడి జంక్షన్‌లో సోమవారం ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి సంబంధించి కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆదేశాల మేరకు ముఖ్య నాయకులు, నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశమును నిర్వహించారు. ఈసందర్భంగా ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి సంబంధించి వర్చువల్ విధానంలో నిర్వహించేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించిన నేపథ్యంలో గరుగుబిల్లి మండల కేంద్రంలో నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి మహానాడు కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నందున నాయకులు, కార్యకర్తలు ప్రత్య క్షంగా వీక్షించేందుకు అవసరమైన ఎస్ఈడి ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి కన్వీనర్ మరడాన నారాయ ణస్వామి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని ఈసారి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల పరిషత్తు అధ్యక్షులు ఉరిటి రామారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇంధన సంరక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు మహానాడు నిర్వహణపై ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.

# తాడేపల్లిలో జగన్ కలిసిన శోభాస్వాతీరాణి



విజయనగరం, మే 20 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. బుధవారం ఎస్. కోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఆమె కుమార్తె డాక్టర్ శోభాస్వాతీరాణి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

21-05pg10.qxd:21-05pg10.qxd 1/1/02 6:23 AM Page 1



## ఫ్రెంచ్ ఓపెన్‌లో..
# కర్మన్ కౌర్ ఔట్




**న్యూఢిల్లీ:** భారత మాజీ నంబర్ 1 కర్మన్ కౌర్ థండి, ఫ్రెంచ్ ఓపెన్ 2026 మహిళల టెన్నిస్ సింగిల్స్ క్వాలిఫైయర్స్ నుండి ఓటమితో నిష్క్రమించింది. దీంతో గ్రాండ్ స్లామ్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాలన్న ఆమె ఆశలు ఆవిరయ్యాయి. ప్రొటెక్టెడ్ ర్యాంకింగ్‌ను ఉపయోగించి తిరిగి వచ్చిన 27 ఏళ్ల క్రీడాకారిణి, క్వాలిఫైయర్స్ ప్రారంభ రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన హార్మోనీ టాన్‌తో జరిగిన ఏకపక్ష పోరులో 1-6, 0-6 తేడాతో ఓడిపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటిఎ ర్యాంకింగ్స్‌లో 1488వ స్థానంలో ఉన్న కర్మాన్, తన 238వ ప్రొటెక్టెడ్ ర్యాంకింగ్ (పిఆర్) కారణంగా ఎలైట్ క్వాలిఫికేషన్ డ్రాలో తన స్థానాన్ని దక్కించుకుంది. ఇది ఆమెను అధికారిక ఎంట్రీ జాబితాలో చేర్చింది. గాయం విరామం తర్వాత తన మొదటి పోటీ మ్యాచ్ ఆడుతున్న కర్మన్‌ను, ఆమె ఫ్రెంచ్ ప్రత్యర్థి ఏమాత్రం కుదురుకోనివ్వలేదు. ఆ తర్వాత భారత క్రీడాకారిణి రిటర్న్స్‌తో పాటు,
సర్వింగ్‌లో కూడా చాలా ఇబ్బంది పడింది. కర్మన్ తనకు లభించిన ఏకైక బ్రేక్‌పాయింట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది, కాగా టాన్ తనకు లభించిన ఎనిమిది అవకాశాలలో ఐదింటిని సద్వినియోగం చేసుకుంది. మూడేళ్లలో కర్మన్‌కు ఇది తొలి గ్రాండ్‌స్లామ్ కాగా, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అంకితా రైనా తర్వాత రెండేళ్లలో గ్రాండ్‌స్లామ్‌లో పోటీపడిన తొలి భారత మహిళ కూడా ఈమెనే. ఈ ఫ్రెంచ్ ఓపెన్ ఎడిషన్‌లో ఆమె ఒక్కతే భారతీయ క్రీడాకారిణి కావడంతో, సింగిల్స్ విభాగంలో భారత్ ప్రయాణం కూడా ముగిసింది.

# హాకీ సిరీస్‌లో భారత్ మహిళల జట్టు విజయం
## 4-1 తేడాతో ఆస్ట్రేలియా ఓటమి



**న్యూఢిల్లీ:** హాకీ సిరీస్‌లోని నాల్గవ చివరి మ్యాచ్‌లో భారత అండర్ 18 మహిళల జట్టు ఆస్ట్రేలియాను 4-1 తేడాతో ఓడించి ఆధిపత్య ప్రదర్శన కనబరిచింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదటి క్వార్టర్ ప్రారంభంలోనే అరోరా కోవసెవిచ్ 8వ నిముషం ద్వారా ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, భారత్ వెంటనే స్పందించి, కెప్టెన్ స్వీటీ కుజుర్ (13) తొలి క్వార్టర్ ముగిసేలోపే స్కోరును సమం చేసింది.
రెండవ క్వార్టర్‌లో కూడా ఆతిథ్య జట్టు తమ జోరును కొనసాగించింది. దియా (25వ నిమిషంలో) గోల్ చేయడంతో, విరామ సమయానికి భారత్ 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత్ రెండవ అర్ధభాగంలో కూడా పట్టు నిలుపుకొని, మూడవ క్వార్టర్‌లో ప్రియాంక మింజ్ (44) ద్వారా తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ఆ తర్వాత చివరి క్వార్టర్‌లో నౌషీన్ నాజ్ (50) మరో గోల్ జోడించడంతో, ఆతిథ్య జట్టు ఘన విజయం సాధించింది. ఈ విజయంతో హోరాహోరీగా సాగిన సిరీస్‌లో భారత జట్టు ఘనంగా ముగించి, ఈ నెల చివరలో జపాన్‌లో ప్రారంభమయ్యే అండర్18 ఆసియా కప్‌కుసిద్ధమైంది.

## మలేసియా మాస్టర్స్‌లో
# మల్విక విజయం
### తొలి రౌండ్‌లోనే లక్ష్య, ప్రణయ్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** మలేసియామాస్టర్స్ సూపర్500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల విభాగంలో భారత్ అగ్రశ్రేణి షట్లర్లు మాళ్విక బన్సోద్ విజయం సాధించగా, పురుషుల విభాగంలో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ తొలిదశలోనే నిష్క్రమించారు. కౌలాలంపూం‌లో బుధవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఆల్ ఇంగ్లాండ్ ఫైనలిస్ట్ లక్ష్య, ఇండోనేషియాకు చెందిన 18 ఏళ్ల వర్ధమాన ఆటగాడు జాకీ ఉబైదిల్లా చేతిలో 17-21, 11-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓటమి పాలయ్యాడు. రెండుసార్లు జూనియర్ ప్రపంచ పతక విజేత అయిన జాకీ, తనకంటే చాలా ఉన్నత ర్యాంకులో ఉన్న ప్రత్యర్థిని మొదటి రౌండ్‌లో 43 నిమిషాల్లో సునాయాసంగా ఓడించాడు. మరోవైపు, ప్రణయ్ జపాన్‌కు చెందిన ప్రపంచ 9వ ర్యాంకర్ కోడై నరవోకాతో హోరాహోరీగా పోరాడినా, చివరి క్షణాల్లో సంయమనం కోల్పోవడంతో మ్యాచ్‌ను కోల్పోయాడు. నిర్ణయాత్మక



సెట్‌లో 20-16 ఆధిక్యంలో ఉన్న 33 ఏళ్ల ఆటగాడికి ఐదు మ్యాచ్ పాయింట్లు లభించినప్పటికీ, అతను దానిని ముగించలేక 17-21, 22-20, 22-24 స్కోరుతో మూడు గేమ్‌లలో ఓడిపోయాడు. మరోవైపు, మాల్విక బన్సోద్ జర్మనీకి చెందిన యవోన్ లీని మూడు గేమ్‌లలో 21-17, 16-21, 21-9 తేడాతో ఓడించి, భారత్‌కు మొదటి విజయాన్ని నమోదు చేసింది. ఆమె తదుపరి డెన్మార్క్‌కు చెందిన లైన్ జేర్స్‌ఫెల్డ్‌తో తలపడనుంది, ఆమె మొదటి రౌండ్ మ్యాచ్‌లో మరో యువ భారత షట్లర్ అన్మోల్ ఖర్బ్‌ను 13-21, 21-16, 21-19 తేడాతో ఓడించింది.



# చివరి దశకు ఐపిఎల్ లీగ్
### నేడు చెన్నైకి చావో రేవో.. టాప్ 2పైనే గిల్ సేన గురి

**న్యూఢిల్లీ:** ఐపీఎల్-2026 లీగ్ దశ ముగింపునకు వస్తున్న వేళ క్రికెట్ సమరం రసవత్తరంగా మారింది. క్వాలిఫైయర్1 ఆడేందుకు టాప్2 స్థానమే లక్ష్యంగా గుజరాత్ టైటాన్స్ గురిపెట్టగా, వరుస ఓటములతో కుదేలైన ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ పరువు నిలుపుకోవాలని చూస్తోంది. ఇందుకు ఈ నెల 21వ తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ ఇరు జట్లు తలపడనున్నాయి. ఐపీఎల్ లీగ్ పట్టికలో అగ్రస్థానాల్లో నిలిచే జట్లకు ఫైనల్ చేరడానికి రెండు అవకాశాలు (క్వాలిఫైయర్ 1, క్వాలిఫైయర్ 2) లభిస్తాయి. ప్రస్తుతం 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్, టేబుల్ టాపర్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (18 పాయింట్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (16 పాయింట్లు) జట్లతో తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది. ఈ మ్యాచ్‌లో చెన్నైపై భారీ తేడాతో విజయం సాధిస్తే, గుజరాత్ జట్టు రన్ రేట్ పరంగా మరింత బలాన్ని పుంజుకుంటుంది. ప్రస్తుతం గుజరాత్ నెట్ రన్ రేట్ (+0.400) హైదరాబాద్ (+0.350) కంటే మెరుగ్గా ఉండటం గిల్ సేనకు కలిసివచ్చే అంశం. మరోవైపు, సన్‌రైజర్స్ చేతిలో తృటిలో ఓడిపోయిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ ఆశలు దాదాపు గల్లంతయ్యాయి. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని చెన్నై జట్టు టోర్నీలో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడంతో పాటు, ఇతర జట్ల ఓటములపై ఆధారపడాల్సి ఉంటుంది. దీంతో ఎలాగైనా ఈ మ్యాచ్‌లో గెలిచి తమ పరువు నిలుపుకోవాలని సీఎస్‌కే భావిస్తోంది. బ్యాటింగ్‌కు అనుకూలించే అహ్మదాబాద్ పిచ్‌పై గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ సాయి సుదర్శన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. పవర్‌ప్లేలో చెన్నై బౌలింగ్‌ను ఎదుర్కొని నిలబడితే గుజరాత్‌కు భారీ స్కోరు ఖాయం. అయితే, గుజరాత్ మిడిలార్డర్ నిలకడలేమితో సతమతమవుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని చెన్నై ఎడమచేతి వాటం స్పిన్నర్ అకీల్ హుసేన్‌తో గిల్‌ను కట్టడి చేయాలని చూస్తోంది. గతంలో హుసేన్ ట్వంటీ20ల్లో గిల్‌ను రెండుసార్లు అవుట్ చేయడం ఇక్కడ గమనార్హం. మిడిల్ ఓవర్లలో గుజరాత్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌ను ఎదుర్కోవడం చెన్నై బ్యాటర్లకు పెద్ద సవాలు కానుంది. ఈ స్పిన్ ఉచ్చును ఛేదించడానికి చెన్నై వైపు నుంచి సంజూ శాంసన్ అత్యంత కీలకమైన ఆటగాడిగా మారనున్నాడు. రషీద్ అద్భుతమైన రిస్ట్ స్పిన్‌ను సంజూ ఎంతవరకు సమర్థవంతంగా ఎదుర్కొంటాడనే దానిపైనే చెన్నై విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

# పాక్ ఘోర ఓటమి
### వైట్‌వాష్ చేసిన బంగ్లాదేశ్

**న్యూఢిల్లీ:** టెస్టు చివరి రోజున బంగ్లాదేశ్ 78 పరుగుల తేడాతో విజయం సాధించడంతో, రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేసింది. ఆఖరి రోజు బుధవారం సిల్హెట్‌లో 436 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో, పాకిస్థాన్‌ను 358 పరుగులకే ఆలౌట్ చేయడంలో ఆతిథ్య జట్టుకు సహాయపడిన తైజుల్, 6-120 నమోదు చేశాడు. మహమ్మద్ రిజ్వాన్, ఆల్‌రౌండర్ సాజిద్ ఖాన్ విలువైన పరుగులు జోడించి, 50కి పైగా కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి స్కోరు 350 దాటించారు. చివరకు తైజుల్ 36 బంతుల్లో 28 పరుగులు చేసిన సాజిద్ ఖాన్‌ను ఔట్ చేశాడు. షోరిఫుల్ ఇస్లాం మహమ్మద్ రిజ్వాన్‌ను (94) ఔట్ చేయడంతో పాక్ మరో వికెట్ కోల్పోయింది. తర్వాత తైజుల్ ఖుర్రం షెహజాద్‌ను డకౌట్‌తో మ్యాచ్‌ను ముగించాడు.



అంతకుముందు, భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, పాక్ ఓపెనర్లు అబ్దుల్లా ఫజల్, అజాన్ అవైస్ ఔటవడంతో ఆ జట్టు ఆరంభం తడబడింది. తర్వాత బాబర్ అజామ్, షాన్ మసూద్‌తో కలిసి 92 రన్స్ భాగస్వామ్యంతో ఇన్నింగ్స్ నిలబెట్టాడు. అయితే తైజుల్ బాబర్‌ను పెవిలియన్‌కు పంపాడు. సౌద్ షకీల్ కేవలం 6 రన్స్ మాత్రమే చేయడంతో, 154-4తో పాకిస్థాన్ ఒత్తిడిలోకి జారింది. తైజుల్ బౌలింగ్‌లో అవుటవడంతో పాకిస్థాన్ మరింత పతనమైంది. అయితే రిజ్వాన్, సల్మాన్‌లు ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించి, పాక్‌ను 200 మార్కు దాటించాడు. తైజుల్ మళ్ళీ 71 పరుగుల వద్ద సల్మాన్, హసన్ అలీ కూడా ఔటవడంతో, నాల్గో రోజు ఆట ముగిసేనాటికి పాక్ 316/7 స్కోరును నమోదు చేసింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 278 రన్స్ చేసింది. పాక్ తరఫున ఖుర్రం షెహజాద్ 4 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యుత్తరంగా పాకిస్థాన్ 57.4 ఓవర్లలో 232 పరుగులకే ఆలౌట్ కావడంతో, ఆతిథ్య జట్టు 46 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. బాబర్ అజమ్ 68 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలవగా, సాజిద్ 38 రన్స్ సాధించాడు. బంగ్లాదేశ్ నహిద్ రాణా, తైజుల్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. 46 పరుగుల ఆధిక్యంతో తమ రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన బంగ్లాదేశ్, 137 రన్స్ చేసిన ముష్ఫికర్ రహీం సెంచరీతో మరో 390 పరుగులు జోడించి, 437 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించడంలో పాక్ జట్టు విఫలమైంది.

# సెన్సెక్స్ నిఫ్టీల్లో రికవరీ
## స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్లు




**ముంబయి, మే 20:** రెండురోజులపాటు నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు బుధవారం రికవరీ అయ్యాయి. సెన్సెక్స్ ఒక్కసారిగా 800 పాయింట్లుపెరిగింది, నిఫ్టీ కూడా 23,650వద్దకు చేరింది. ఆయిల్ అండ్‌గ్యాస్ స్టాక్స్ రికవరీకి ఉపకరించాయి. ఎఫ్‌ఎంసిజి, ఐటి షేర్లు మాత్రం ఒత్తిడిలోనే కొనసాగాయి. దిగువస్థాయిలోనే కొనుగోళ్లు జరిగినట్లు అంచనా. ముడిచమురు ధరలు కొంతమేర దిగిరావడం, మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలు చల్లబడుతుండటం కూడా పెరుగుదలకు దోహదంచేసింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 117.54 పాయింట్లుపెరిగి 75,318.39 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 41 పాయింట్లుపెరిగి 23,659 పాయింట్లవద్దకు చేరింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.55శాతం, హిందాల్కో ఇండస్ట్రీస్ 2.80శాతం, యాక్సిస్‌బ్యాంకు 0.93శాతం వంటివిసూచీలకు మద్దతిచ్చాయి.
బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.51శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.09శాతంచొప్పునపెరిగాయి మార్కెట్లలో ఎన్‌ఎస్‌ఇలో 1720 షేర్లుపెరిగితే 1542 షేర్లుక్షీణించాయి. మరో 110 షేర్లుస్థిరంగా కొనసాగాయి. విదేశీ మార్కెట్‌లో భారత కరెన్సీ 96.90వద్దకు చేరింది.చివరకు ముగింపు దశలో 96.9575కు కూడా చేరింది. పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.21శాతం క్షీణించాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూలై సెటిల్‌మెంట్‌దరలు 2.30 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 111.28 డాలర్లుగా కొనసాగింది. నిఫ్టీలో ఆయిల్‌గ్యాస్‌సూచీ 1.59శాతంపెరిగింది. గడచిన రెండు సెషన్లలోకూడా 1.76శాతం పెరిగింది. హిందాల్కో ఇండస్ట్రీస్ 3.55శాతంపెరిగింది.త్రైమాసిక ఫలితాలు ఊతం ఇచ్చాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్స్ మాత్రం 5.39శాతం క్షీణించాయి. బోరోసిల్ కూడా 2.25శాతం క్షీణించింది. డైనామాటిక్ టెక్నాలజీస్ 3.89శాతం దిగజారింది. ఎఎస్‌కె ఆటోమోటివ్స్ 2.48శాతం క్షీణిస్తే కర్ణాటక బ్యాంకు 6.48శాతం పెరిగింది. సియారామ్ సిల్క్ మిల్స్ 6.29శాతం వెనకబడింది. సిఇ ఇన్ఫోసిస్టమ్స్ 5.65శాతంపతనం అయితే అవలాన్ టెక్నాలజీస్ 7.94శాతం, బిఎల్‌ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ 2.44శాతం పెరిగాయి. మొత్తంగాచూస్తే మార్కెట్లపై రూపాయి ఎఫెక్ట్‌కూడా తీవ్రస్థాయిలోనే ఉంది.ఆల్‌టైమ్ కనిష్ఠం 96.90వద్ద ముగిసిందంటే డాలర్ చెల్లింపులు పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఆర్‌బిఐ డాలర్ కౌంటర్ ప్రారంభించడవల్లనే ఈస్తాయిలో అయినా కొంతమేరకట్టడి అయింది.

# రికార్డుస్థాయికి పడిపోతున్న రూపాయి
## డాలర్ జోరుకు దేశీయ కరెన్సీ బేజారు




**ముంబయి,మే 20:** గ్లోబల్ కరెన్సీ మార్కెట్లో రూపాయి విలువ రికార్డు స్థాయిలో క్షీణిస్తోంది. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటంతో రూపాయి విలువ డాలరుకు 96.90కి పడిపోయింది. అతి త్వరలోనే 100కి పడిపోయే అవకాశం ఉంది. ఈ కరెన్సీ మార్పులు కేవలం స్టాక్ మార్కెట్లకు లేదా పెద్ద వ్యాపార వేత్తలకే పరిమితం కావు. ఇది దేశంలోని ప్రతి సామాన్యుడి జేబుపై, దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. భారతదేశం అనేక వస్తువుల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతుంది. మనం దిగుమతి చేసుకునే వస్తువులకు అంతర్జాతీయంగా డాలర్లలోనే చెల్లింపులుచేయాలి. రూపాయి బలహీనపడటం వల్ల ఈ క్రింది నష్టాలు వస్తాయి. భారతదేశం తన దేశీయ అవసరాల కోసం దాదాపు 80 పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. డాలర్ బలపడితే, మనం చమురు కోసం ఎక్కువ రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయి. రవాణా ఖర్చులు ఎక్కువై నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతాయి. స్మార్ట్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఆటో మొబైల్ విడిభాగాలు మరియు బంగారం దిగుమతి ఖర్చు పెరుగుతుంది. అమెరికా లేదా ఇతర దేశాలలో చదువుకునే భారతీయ విద్యార్థుల ఫీజులు భారీగా పెరుగుతాయి. రూపాయి విలువ తగ్గడం వల్ల వారు హాస్టల్ ఖర్చులు, ట్యూషన్ ఫీజుల కోసం ఎక్కువ మొత్తంలో రూపాయలను డాలర్లుగా మార్చాల్సి వస్తుంది. విదేశీ ప్రయాణాలు చేసే వారికి కూడా బడ్జెట్ దాటిపోతుంది. అనేక భారతీయ కంపెనీలు విదేశాల నుండి డాలర్ల రూపంలో అప్పులు తీసుకుంటాయి. రూపాయి పడిపోయినప్పుడు, ఆ అప్పులపై వడ్డీలు, అసలు తిరిగి చెల్లించడం కంపెనీలకు చాలా భారంగా మారుతుంది.
రూపాయి పతనం దేశానికి నష్టమే అయినప్పటికీ, కొన్ని రకాల రంగాలు, వ్యక్తులకు లాభదాయకంగా మారుతుంది భారతదేశం నుండి వస్తువులను లేదా సేవలను విదేశాలకు ఎగుమతి చేసే వారికి ఇది కలిసి వస్తుంది. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్స్ రంగాలు తమ సేవలకు గానూ డాలర్లలో ఆదాయం పొందుతాయి. వారు ఆ డాలర్లను రూపాయిల్లోకి మార్చుకున్నప్పుడు భారీగా లాభాలు వస్తాయి. విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ భారత దేశంలో ఉన్న తమ కుటుంబాలకు డబ్బులు పంపే ప్రవాస భారతీయులు పంపే ప్రతి డాలరుకు గతం కంటే ఎక్కువ రూపాయలు వస్తాయి. విదేశీ వస్తువుల దిగుమతి ఖరీదైనదిగా మారడంతో, దేశీయంగా తయారయ్యే వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. రూపాయి మరీ ఘోరంగా పడిపోకుండా ఉండటానికి భారత రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న విదేశీ మారక నిల్వల నుండి డాలర్లను మార్కెట్లో విక్రయిస్తుంది. తద్వారా రూపాయి పతనానికి బ్రేకులు వేయడానికి ప్రయత్నిస్తుంది. అంతర్జాతీయ మార్కెట్ ఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పుడు రూపాయి విలువ కొంతమేర తగ్గడం సహజం. భారతీయ రూపాయి వేగంగా పడిపోకుండా కాపాడటానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ మేనేజ్డ్ ఫ్లోట్ అనే విధానాన్ని ఉపయోగిస్తుంది. రూపాయి విలువను ఒకే నిర్దిష్ట సంఖ్య వద్ద నిలిపి ఉంచడం ఆర్బీఐ లక్ష్యం కాదు, కానీ మార్కెట్లో ఒక్కసారిగా వచ్చే తీవ్రమైన ఒడిదుడుకులను, భయాందోళనలను అరికట్టి రూపాయి పతనం నియంత్రణలో ఉండేలా చూడటమే దాని ప్రధాన బాధ్యత.
దీని కోసం ఆర్బీఐ మార్కెట్ జోక్యం, లిక్విడిటీ నియంత్రణలు మరియు నిబంధనల రూపంలో బహుముఖ వ్యూహాలను మరియు సాధనాలను ప్రయోగిస్తుంది. తన వద్దఉన్న విదేశీ మారక నిల్వల నుండి డాలర్లను మార్కెట్లో విక్రయించి రూపాయికి బ్రేకులు వేస్తుంది. మార్కెట్లో రూపాయి లభ్యతను తగ్గించి సట్టా వ్యాపారులకు అడ్డుకట్ట వేస్తుంది. విదేశీ పెట్టుబడులు మరియు, డిపాజిట్లను ఆకర్షించేలా నిబంధనలు సడలిస్తుంది. బ్యాంకులు రూపాయిపై ఊహాజనిత ట్రేడింగ్ చేయకుండా పరిమితులు విధిస్తుంది. రూపాయి 96.90 దాటి పడిపోకుండా కాపాడటానికి ఆర్బీఐ ఇటీవలి కాలంలో దాదాపు 30 నుండి 38 బిలియన్ల డాలర్ నిల్వలను మార్కెట్లోకి వదిలింది.

# ఎనిమిది కీలకరంగాల్లో గతనెల 1.7శాతమే వృద్ధి

**న్యూఢిల్లీ, మే 20:** భారత్‌లోని ఎనిమిది కీలక రంగాల వృద్ధి ఏప్రిల్‌నెలలో 1.7శాతంగా నమోదయింది. అదే మార్చినెలలో 0.4శాతం ప్రతికూల వృద్ధినుంచి మెరుగుపడిందని వాణిజ్య మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. ఎనిమిది పరిశ్రమల్లో ఐదు పరిశ్రమలకు ఏప్రిల్ నెలలో కొంతమేర హెచ్చుతగ్గులున్నాయి. అయితే భారత్ కోర్ సెక్టార్ ఉత్పత్తి మాత్రం మార్చినెలలో సవరించారు. 1.2 శాతంగా ఉందని తేలింది. సమిష్టివృద్ధి పరంగాచూస్తే 2025-26లో ఏప్రిల్‌నుంచి ఈ ఏడాది మార్చివరకూ 2.7శాతంగా ఉందని గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే వృద్ధి నమోదయినట్లు చెపుతోంది. ఎనిమిది కీలకపరిశ్రమల్లో వృద్ధివరుసగా ఆరు నెలలనుంచి మెరుగవుతూనే వచ్చిందని వాణిజ్యమంత్రిత్వశాఖ వివరించింది. ఎనిమిదింటిలో మూడు రరంగాలు ఏప్రిల్‌లో మరింత వృద్ధిరించాయి. సిమెంట్, స్టీల్, విద్యుత్‌రంగాల పరిశ్రమలు సానుకూల వృద్ధిని సాధించాయి. ఉక్కు ఉత్పత్తి 6.2శాతంగా ఉంది. అయితే బొగ్గురంగంలో 8.7శాతం దిగువకు చేరింది. ఎరువులరంగంలో ఉత్పత్తి ఏప్రిల్‌లో 8.6శాతంగా తగ్గింది. పెట్రోలియం శుద్ధి ఉత్పత్తులు 0.5శాతం క్షీణించాయి. ఐఐపి సూచీ ప్రకారం మార్చినెలలో 4.1శాతంగా నమోదయి సానుకూల వృద్ధినినమోదుచేస్తే కీలకరంగాల వృద్ధిమాత్రం స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల ఇంధన సరఫరాను దెబ్బతీసింది. దీనితో ఉత్పత్తిరంగంపై కీలకప్రభావం పడింది. ఉత్పత్తి 5.9శాతంనుంచి 4.3శాతంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి కూడా 2.3శాతంనుంచి 0.8శాతానికి పడిపోయింది.

# సెబీ ఫండ్స్‌రంగంలో సంస్కరణలు
### నెలవారీ సమష్టి నివేదిక విధానం అమల్లోకి...




**ముంబయి, మే 20:** మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ల ప్రయోజనాల కోసం సెబీ ప్రధాన నిర్ణయాలు ప్రకటించింది. మంత్లీ క్యుములేటివ్ రిపోర్ట్ విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసింది. దీనివల్ల సిప్ రిపోర్టింగ్ ప్రమాణాల్లో పారదర్శకత మరింత పెరగనుంది. ఇకపై ప్రతి నెలా కొత్త సిప్ రిజిస్ట్రేషన్లు, ఫోలియోల వృద్ధికి సంబంధించిన లెక్కలు ఇన్వెస్టర్లకు స్పష్టంగా కనిపిస్తాయి. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు మార్కెట్ నియంత్రణ సంస్థకు ఖచ్చితమైన గణాంకాలను అందించేలా ఈ కొత్త నిబంధనలు దోహదపడతాయి. పెట్టుబడిదారులు ఎంత కాలం పాటు తమ ఇన్వెస్ట్‌మెంట్‌లను కొనసాగిస్తున్నారో తెలుసుకునేందుకు సిప్ స్టాపేజ్ రేషియోపై సెబీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. గతంలో కేవలం కొత్తగా వచ్చే పెట్టుబడుల వివరాలు మాత్రమే ఉండేవి, దీనివల్ల ఎంతమంది సిప్ ఆపేస్తున్నారో తెలిసేది కాదు. ఇప్పుడు కొత్త రిజిస్ట్రేషన్లతో పాటు రద్దయిన సిప్ వివరాలను కూడా ట్రాక్ చేయడం వల్ల అసలైన వెల్త్ క్రియేషన్ ట్రెండ్స్ బయటకు వస్తాయి. ఇది యువ ప్రొఫెషనల్స్ తమ పెట్టుబడి ప్రయాణాన్ని ప్రారంభించే ముందు ఫండ్ల స్థిరత్వాన్ని అంచనా వేయడానికి సహాయపడుతుంది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఇచ్చే డేటా, స్కీమ్‌లలోని వాస్తవ నగదు ప్రవాహానికి సరిగ్గా సరిపోలాలని ట్రస్టీలు ఇకపై నిర్ధారించాల్సి ఉంటుంది. ఈ ప్రామాణిక ఫార్మాట్లను ఉపయోగించి ఆంఫీ ప్రతి నెలా ఇండస్ట్రీ ట్రెండ్స్‌ను సామాన్య ప్రజల కోసం విడుదల చేస్తుంది. ఇందులో ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఇఎల్‌ఎస్‌ఎస్), రిటైర్మెంట్ ఫండ్ ఫోలియోల వివరాలు కూడా ఉంటాయి. క్రమశిక్షణతో కూడిన ఆర్థిక ప్రణాళిక కోసం ఇన్వెస్టర్లు ఈ ఫ్యాక్ట్‌షీట్లను గమనిస్తూ సరైన ఫండ్లను ఎంచుకోవాలి. సెబీ కొత్త నిబంధనల వల్ల ఇన్వెస్టర్లు రిస్క్ మరియు రిటర్న్ ప్రొఫైల్స్‌ను మరింత సమర్థవంతంగా పోల్చి చూడవచ్చు. ఫండ్ హౌస్‌లు ప్రతి నెలా 10వ తేదీ లోపు తమ నివేదికలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.

# కృత్రిమమేధలో గూగుల్ ఎఐ ఆధిపత్యం



**సియాటెల్, మే 20:** ఆల్ఫాబెట్ నేతృత్వంలోని గూగుల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) రంగంలో తమ ఆధిపత్యాన్ని చాటుతోంది. తమ ఎఐ మోడళ్లను ఉపయోగించి ప్రతి నెలా 85 లక్షల మందికి పైగా డెవలపర్లు యాప్స్, ఇతర సేవలను రూపొందిస్తున్నారని గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ వెల్లడించారు. ఎఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నామని, ఈ ఏడాది మూలధన వ్యయం సుమారు 190 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తెలిపారు. ఈ నిధులను ప్రధానంగా ఎఐ డేటా సెంటర్లు, కస్టమ్ సిలికాన్, మోడల్ ట్రైనింగ్ కోసం కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. డెవలపర్లు, ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు సాధారణ వినియోగదారుల నుంచి కూడా తమ ఎఐ సేవలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందని పిచాయ్ వివరించారు. గూగుల్ జెమిని యాప్ నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య గతేడాదితో పోలిస్తే రెట్టింపు అయి, ప్రస్తుతం 90 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఎఐ ఓవర్‌వ్యూస్ ఫీచర్‌ను నెలకు 250 కోట్ల మంది, ఎఐ మోడ్‌ను 100 కోట్ల మందికి పైగా వినియోగిస్తున్నారని తెలిపారు. కొత్త ఎఐ టూల్స్‌ను, అప్‌గ్రేడ్లను కూడా గూగుల్ పరిచయం చేసింది. కోడింగ్, వర్క్‌ఫ్లోల కోసం వేగవంతమైన జెమిని 3.5 ఫ్లాష్ మోడల్, యూజర్ల తరఫున పనులు పూర్తిచేసే పర్సనల్ ఎఐ ఏజెంట్ జెమిని స్పార్క్ ఉన్నాయి. యూట్యూబ్‌లో సంభాషణల ద్వారా వీడియోల్లోని కీలకమైన క్షణాలను కనుగొనడానికి ఆస్క్ యూట్యూబ్ అనే కొత్త ఫీచర్‌ను, వాయిస్ కమాండ్స్‌తో డాక్యుమెంట్లు సృష్టించేందుకు డాక్స్ లైవ్‌ను కూడా ఆవిష్కరించింది. ఎఐ శిక్షణ, కార్యకలాపాలను వేగవంతం చేయడానికి తమ సరికొత్త తరం టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్లను (టిపియు) కూడా అందుబాటులోకి తెచ్చినట్లు గూగుల్ వెల్లడించింది. కంపెనీ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో ఏఐ అత్యంత కీలకమైన టెక్నాలజీ అని పిచాయ్ తెలిపారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.